


# సూర్య

visit us @ https://epaper.surya.news

SURYA

www.Surya.news

ఆదివారం 17 | ఆగస్టు 2025 | విజయవాడ


సంపుటి : 18 సంచిక : 138

పేజీలు : 8 | వెల : రూ. 5/-

**Circulated to :** Vijayawada, Guntur, Visakhapatnam, vizianagaram, Tirupati, kadapa, Rajahmundry


ఆదివారం - శ్రీ విశ్వావసు నామ సంవత్సర శ్రావణ మాసం - దక్షిణాయనం వర్ష ఋతువు, బహుళ పక్షం తిథి:నవమి రా.8-31 కు.త.దశమి సా.6-14 కు నక్షత్రం:కృత్తిక ఉ 6-46 కు.త.రోహిణి తె.5-15 కు సా.దు.4-41 ల 5-31 కు వర్జ్యము:రా.వ.9-45 ల 11-15 కు అమృతం:ఉ 6-01 కు రాహుకాలం:మ 4-30 ల 6-00 కు యమగండం:మ 12-00 ల 1-30 కు సూర్యోదయం: ఉ 5-46 సూర్యాస్తమయం:6-23

## క్వీన్స్‌ల్యాండ్‌లో భారీ భూకంపం



సూర్య ప్రతినిధి, క్వీన్స్‌ల్యాండ్ : ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్‌లో భారీ భూకంపం సంభవించింది. శనివారం ఉదయం క్వీన్స్‌ల్యాండ్ తూర్పు తీరంలో 5.4 తీవ్రతతో భూకంపం సంభవిం చినట్లుగా అధికారులు తెలిపారు. యూరోపియన్ సీస్మోలాజికల్ సెంటర్ ప్రకారం.. భూకంపం 10 కి.మీ (6.2 మైళ్ళు) లోతులో సంభవించింది. దీంతో సమీప పట్టణాలు, నగరాల్లో ప్రభావం కనిపించింది. ఆస్తి, ప్రాణ నష్టం అధికారులు ఎలాంటి సమాచారం అందించలేదు. ప్రస్తుతం అధికారులు అప్రమత్తం అయ్యారు. ప్రస్తుత ప్రమాదాన్ని జియోసైన్స్ ఆస్ట్రేలియా నేషనల్ భూకంప హెచ్చరిక కేంద్రం పరిస్థితిని అంచనా వేస్తోంది.



## అలాస్కా వేదికగా అగ్రదేశాల భేటీ

- సరదాగా మాట్లాడుకున్న ట్రంప్,పుతిన్
- సైనిక దర్పంతో ప్రదర్శించిన ట్రంప్

2 లో

సూర్య ప్రతినిధి, వాషింగ్టన్ : ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడమే లక్ష్యంగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయ్యారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. అలాస్కా వేదికగా జరిగిన ఈ అరుదైన సమావేశం యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది.

## ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపికలో బాబు కీలకం

- ప్రధాని నరేంద్ర మోడీ అన్ని బాధ్యతలను బాబుకే వదిలేశారు
- ముగ్గురు గవర్నర్లతో పాటు దేశ బీజేపీ చీఫ్ నడ్డా తెరపైకి
- కేంద్ర మంత్రివర్గంలో ఏపీ నుంచి మరొకరికి అవకాశం

సూర్య ప్రతినిధి, అమరావతి :

ఏపీ కేంద్రంగా ఢిల్లీలో కొత్త లెక్కలు తెర మీదకు వస్తున్నాయి. ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఖరారు పైన బీజేపీ అధినాయకత్వం కసరత్తు చేస్తోంది. ఆదివారం జమ్మూ కాశ్మీర్ లో జరగనున్న బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిని ఖరారు చేయనున్నారు. ఇక కేంద్ర మంత్రి వర్గ విస్తరణ దిశగా మోదీ టీం లెక్కలు మొదలు పెట్టింది.



ఆదివారం బిజెపి పార్లమెంటరీ బోర్డు ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగే సమావేశానికి జమ్మూ కాశ్మీర్ ఆంధ్రప్రదేశ్ మహారాష్ట్ర గవర్నర్లు మనోజ్ సిన్హా, జస్టిస్ అబ్దుల్ నజీర్, సిపి రాధాకృష్ణన్, బిజెపి దేశచీఫ్ జేపీ నడ్డా పేర్లను తెరపైకి తేనున్నారు అలాగే ఏపీకి మరో మంత్రి పదవి ఖాయమని తెలుస్తోంది. ఈ భేటీలో ఆ పదవి ఎవరికి దక్కుతుందనేది స్పష్టత వచ్చే అవకాశం ఉంది. నూతన ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎవరనేది బీజేపీ అధినాయకత్వం ఖరారు చేయనుంది. ఎలక్టోరల్ కాలేజ్ లో ఎన్డీఏకు పూర్తి మెజార్టీ ఉంది. ఇండియా కూటమి అభ్యర్థిని పోటీ లో దించితే సెప్టెంబర్ 9న ఎన్నిక జరగనుంది. ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఈ నెల 21న

- మిగతా 2లో..



## 3రోజులు భారీ వర్షాలు

### ఏపీలో మరో అల్పపీడనం...

సూర్య ప్రతినిధి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారత వాతావరణ శాఖ కీలక వర్ష సూచన జారీ చేసింది. వాయవ్య బంగాళాఖాతంలో ఆగస్టు 18, సోమవారం నాటికి మరో కొత్త అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇప్పటికే ఉన్న అల్పపీడనానికి ఇది తోడవడంతో, రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది.

- అల్పపీడనాలతో విస్తారంగా వర్షాలు
- వాయవ్య బంగాళాఖాతంలో సోమవారం మరో అల్పపీడనం
- రానున్న మూడు రోజులు కోస్తాంధ్రకు భారీ వర్షాలు
- రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు జల్లుల అంచనా
- మంగళవారం వరకు మత్స్యకారులకు వేటపై నిషేధం
- ఆదివారం పలు కోస్తా జిల్లాల్లో కుండపోత వర్షాలకు అవకాశం

2 పేజీలో..



## భారత్‌లో చైనా విదేశాంగ మంత్రి వాయింగ్‌యి 3 రోజుల పర్యటన

సూర్య ప్రతినిధి, బీజింగ్ : చైనా విదేశాంగ శాఖా మంత్రి వాంగ్‌యి ఆగస్టు 18 నుండి 20 వరకు భారత్‌లో పర్యటిస్తారని ఆ దేశ విదేశాంగ శాఖ ప్రతినిధి శనివారం వెల్లడించారు. చైనా, భారత్ సరిహద్దు సమస్యపై ప్రతినిధులతో వాంగ్‌యి 24వ రౌండ్ చర్చలు జరపనున్నారు.కాగా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఆహ్వానం మేరకు చైనా విదేశాంగ శాఖా మంత్రి వాంగ్ యి భారత్‌ను సందర్శించనున్నారు.

2 లో



## అమెరికా పన్నులతో తమిళనాడుకి తీవ్ర నష్టం

**- ఎం.కె.స్టాలిన్**

సూర్య ప్రతినిధి, చెన్నై : అమెరికా భారత్‌పై 50 శాతం పన్నులను విధించింది. ఈ పన్నుల వల్ల మిగతా రాష్ట్రాల కంటే.. తమిళనాడుకి ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ శనివారం అన్నారు. మన ఎగుమతులు అమెరికా మార్కెట్‌తో ముడిపడి ఉన్నందున తమిళనాడు మిగతా రాష్ట్రాల కంటే తీవ్రంగా దెబ్బతింటుంది. వస్త్రాలు, తోలు, ఆటో యంత్రాలు, ఇతర రంగాలలో లక్షలాది ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయి అని స్టాలిన్ అన్నారు.

2 లో..



## భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తం కండి

- వాగులు వంకలు పొంగే ప్రమాదం ఉంది
- కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లి సమాచారం సేకరించాలి
- సహాయ బృందాలతో సమన్వయం చేసుకోవాలి
- అధికారులకు సిఎం రేవంత్ రెడ్డి ఆదేశం

2 లో..

సూర్య ప్రతినిధి, హైదరాబాద్ : భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం..



## 30ఏళ్లుగా ఏపీలో ఉగ్రవాదులు..!

- ఏసీ మెకానిక్‌లుగా తెరవెనక ఉగ్ర కుట్రలు
- పలువురు ఉగ్రవాదులు అరెస్ట్
- నిఘా పెంచిన ఏపీ పోలీసులు

సూర్యబ్యూరో, సత్యసాయి జిల్లా : జిల్లా కేంద్రంలో ఉగ్ర కదలి కలతో తెలుగు రాష్ట్రాలు ఒక్కసారి గా ఉలిక్కిపడ్డాయి. అయితే.. ఇప్ప టికే ఉగ్రవాది నూర్ మహమ్మద్ షేక్ ను పోలీసులు అదుపు లోకి తీసుకు న్నారు. ఈ మేరకు ఏపీలో ఉగ్ర కదలి కలపై నిఘావర్గాలు, ఏపీ పోలీసులు ఫోకస్ పెట్టారు. ధర్మవరంలో నూర్ మహమ్మద్ షేక్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మహమ్మద్‌కు పాకిస్తాన్‌కు చెందిన జైషే మహమ్మద్ అనే ఉగ్రవాద సంస్థతో లింకులు ఉన్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) గుర్తించింది.



## హైదరాబాద్‌కు ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ఘనత చంద్రబాబుదే

**తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి**

సూర్యబ్యూరో - హైదరాబాద్ : హైదరాబాద్‌లోని హైటెక్ సిటీని ప్రపంచ ఐటీ కేంద్రంగా మార్చిన ఘనత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు.



## భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి

### కిన్నరసానికి భారీగా వరదనీరు చేరిక

సూర్య ప్రతినిధి, భద్రాచలం : గోదావరి పరివాహకంలో కురుస్తున్న వర్షాలతో భద్రాచలం(ఇరశసశ-రశశెప) వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగు తోంది. నీటిమట్టం శుక్రవారం ఉదయం

2 లో..

## సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తితో చంద్రన్న పాలన

### గీత కార్మికులకు మోపెడ్లు

- ఆదరణ 3.0 పథకం ద్వారా అందజేయబోతున్నాం
- రంపచోడవరం హార్టీకల్చర్ పరిశోధనా కేంద్రంలో నూతన తాటిచెట్ల ఉత్పత్తుల తయారీ
- గీత కార్మికులకు ఉపాధి పెంచేలా నూతన ఉత్పత్తుల రూపకల్పన
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

సూర్యబ్యూరో - విజయవాడ

త్వరలో ఆదరణ 3.0 పథకాన్ని శ్రీకారం చుడుతున్నామని, ఈ పథకం ద్వారా గీత కార్మికులకు మోపెడ్ ద్విచక్ర వాహనాలు అందజేయబోతున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తితో సీఎం



చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తు న్నారన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న116వ జయంతిని విజయవా డలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు.

2 లో

## సూపర్ సిక్స్... సూపర్ ఫ్లాప్

**» షర్మిల**

- సీఎం చంద్రబాబు ప్రజలను ఘోరంగా మోసం చేశారని షర్మిల ఆరోపణ
- ఏడాది పాలనలో హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ధ్వజం
- ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మహిళలకు సాయం హామీలు గాలికి
- తల్లికి వందనం, రైతు పథకాలకు కోతలు పెట్టారని ఆరోపణ
- 14 నెలల తర్వాత బస్సు ఫ్రీ ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు


2 పేజీలో..



సూర్య ప్రతినిధి, అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల ముందు ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన 'సూపర్ సిక్స్' పథకాలు 'సూపర్ ఫ్లాప్' అయ్యాయని, ఇది ప్రజలను ఘరానా మోసం చేయడమేనని ఆమె ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

# 3 రోజులు భారీ వర్షాలు

విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, ఈ అల్పపీడనాల ప్రభావంతో కోస్తాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. అదే సమయంలో రాయలసీమ ప్రాంతంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదవుతుందని ఆయన అంచనా వేశారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండే ప్రమాదం ఉన్నందున, మత్స్యకారులు మంగళవారం వరకు వేటకు వెళ్లరాదని ఆయన స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఆదివారం నాటి వాతావరణ పరిస్థితులపై మాట్లాడుతూ, ఉత్తర కోస్తాలోని అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులు ఉంటాయని వివరించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.



## ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపికలో

# బాబు కీలకం



మొదటి పేజీ తరువాయి

నామినేషన్ వేసే అవకాశం ఉంది. నామినేషన్ కార్యక్రమానికి ఎన్డీఏ భాగస్వామ్య పక్ష నేతగా సీఎం చంద్రబాబు హాజరు అవుతారని పార్టీ వర్గాల సమాచారం. ఇప్పటికే కొత్త ఉప రాష్ట్రపతి పైన బీజేపీ హైకమాండ్ ఒక నిర్ణయానికి వచ్చింది. అభ్యర్థి ఖరారు బాధ్యత ప్రధానికి అప్పగించింది. రేపు పేరు ఖరారు చేసే అవకాశం ఉంది. ఆరెస్సెస్ అభిప్రాయంతో పాటుగా అన్ని సమీకరణాలను పరిగణలోకి తీసుకొని అభ్యర్థిని ప్రకటించనున్నారు. దక్షిణాది నుంచి లేదా మహారాష్ట్రకు అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు. ఇక.. త్వరలోనే కేంద్ర మంత్రివర్గ విస్తరణ ఉంటుందని బీజేపీ క్యాంపు చెబుతోంది. ఇప్పటికే కేంద్రం కేబినెట్ లో ఏపికి మరో బెర్తు ఖాయమని సమాచారం. టీడీపీ నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఒక్కరు కేంద్ర కేబినెట్ లో మంత్రులుగా ఉన్నారు. మరో మంత్రిగా అవకాశం ఎవరికి దక్కుతుందనేది ఆసక్తి కరంగా మారుతోంది. బీజేపీ నుంచి పురందేశ్వరికి మంత్రిగా అవకాశం ఇస్తారనే ప్రచారం ఉంది. ఇక.. జనసేన సైతం అవకాశం వస్తే కేంద్రంలో మంత్రి పదవి తీసుకోవాలని భావిస్తున్నట్లు పార్టీ నేతల సమాచారం. అయితే, టీడీపీకే మరో మంత్రి పదవి కేటాయించే అవకాశాలు ఉన్నాయని ఢిల్లీ సర్కిల్స్ లో చర్చ జరుగుతోంది. కాగా, చంద్రబాబు దే ఈ విషయంలో తుది నిర్ణయం. బీజేపీకి అవకాశం ఇస్తే ఆ పార్టీకి ఉన్న ఇద్దరు ఎంపీల్లో ఒకరికి ఛాన్స్ దక్కనుంది. టీడీపీ నుంచి పలువురు ఆశావాహులు ఉన్నారు. ఈ సారి మంత్రి పదవి ఎస్సీ లేదా రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చే అవకాశం ఉందని టీడీపీ నేతలు అంచనా వేస్తున్నారు. అందులో భాగంగా రెడ్డి వర్గానికి ప్రధానం గా నెల్లూరు ఎంపీ పేరు ప్రచారంలో ఉంది. ఎస్సీ వర్గానికి ఇస్తే చిత్తూరు ఎంపీకి అవకాశం పైన అంచనాలు కనిపిస్తున్నాయి. అయితే, బీజేపీ నుంచి మరొకరికి అవకాశం ఇస్తారని.. కీలక పదవి నిర్వహించిన మాజీ నేత వైపు చూస్తున్నారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. దీంతో, ఈ సారి ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రివర్గ విస్తరణతో పాటుగా కేంద్రంలో నామినేటెడ్ పదవులలో మిత్రపక్షాల కు ప్రాధాన్యత పైన నిర్ణయం జరిగే అవకాశం కనిపిస్తోంది. మొత్తం మీద ఎన్డీఏలో సీఎం చంద్రబాబు నాయుడుకు కీలక బాధ్యతలు, ప్రాముఖ్యత ఇస్తున్నారు. బాబు మోదీని విశ్వ గురువుగా అభివర్ణించడం, మోడీకి ఇచ్చే ప్రాముఖ్యత ఏ భాగస్వామ్య పార్టీకి ఇవ్వకపోవడం విశేషం.

# భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి

మొదటి పేజీ తరువాయి

6 గంటలకు 23.6 అడుగులకు చేరింది. 12 గంటలకు 25.4, 4గంటలకు 26.3అడుగులకు చేరగా.. రాత్రికి 28 అడుగుల వరకు చేరే అవకాశం ఉన్నట్టు- అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా భద్రాచలం గోదావరి స్నానఘట్టాలపై నుంచి నీరు ప్రవహిస్తోంది. భక్తులు, పర్యాటకులకు తెలిసేందుకు ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు- చేశారు. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరదనీరు చేరుతోంది. 404.70 అడుగులకు నీటి మట్టం పెరిగింది. మహబూబాబాద్ జిల్లాలోని పాకాల కొత్తగూడం నుంచి గుండాల, ఇల్లెందు, టేకులపల్లి, కొత్తగూడెం అటవీ ప్రాంతాల నుంచి జలాశయానికి 1,700 క్యూసెక్కుల చొప్పున నీరు చేరడంతో డ్యాం అధికారులు అప్రమత్తమయ్యారు. డ్యాం సామర్థం 407 అడుగులు కాగా 404.70 అడుగులకు నీరు చేరడంతో లోతట్టు- ప్రాంతాల ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. జలాశయం దిగువ ప్రాంతం లో ఉన్న లోతట్టు- గ్రామాల ప్రజలు వాగులు దాటొద్దని హెచ్చరికలు జారీ చేశారు.



# 30 ఏళ్లుగా ఏపీలో ఉగ్రవాదులు..!

భారతదేశంలో నిషేధించిన ఉగ్రవాద సంస్థలకు చెందిన వాట్సప్ గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నట్లు ఐబీ అధికారులు పేర్కొన్నారు. ముస్లిం యువతను అతడు ఉగ్రవాదం వైపు మళ్లిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆన్లైన్ కాల్స్ ద్వారా పాకిస్తాన్‌లోని జైషే మహమ్మద్, ఇతరులతో మాట్లాడినట్టు వివరించారు. అలాగే.. ఏపీలో ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా(సీమీ) ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్న స్టూడెంట్స్‌ను గుర్తించినట్లు అధికారులు చెప్పారు.

**ఏపీ మెకానిక్‌లుగా తెరవెనక ఉగ్రవాదులు కుట్రలు**

ఏప్రిల్ 25న పది మంది అనుమానితులను నిఘా వర్గాలు గుర్తించాయని ఐబీ అధికారులు తెలిపారు. విజయవాడలో నలుగురు.. శివారు ప్రాంతాల్లో మరో ఆరుగురిని గుర్తించినట్లు చెప్పుకొచ్చారు. ఏసీ మెకానిక్లుగా, మసీదుల దగ్గర భిక్షాటన, బడ్డీకొట్లలో పనులు చేస్తూ.. సీమీకి పని చేస్తున్నారని పేర్కొన్నారు. జులై 2న అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఇద్దరు ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నట్లు గుర్తు చేశారు. 30 ఏళ్ల నుంచి ఈ ప్రాంతంలోనే మకాం వేసి ఉన్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో గుర్తించినట్లు చెప్పుకొచ్చారు. రాయచోటిలోని కొత్తపల్లి ప్రాంతంలో ఇళ్లు అద్దెకు తీసుకుని చీరల వ్యాపారం చేసుకుంటున్న సోదరులు అబూబకర్ సిద్ధిఖీ, మహమ్మద్ అలీ తెరవెనక భారీ బాంబు పేలుళ్లకు కుట్ర చేసినట్లు ఐబీ అధికారులు వెల్లడించారు. 2011లో బీజేపీ అగ్రనేత ఎల్కే ఆద్వాణీ రథయాత్ర సందర్భంగా మధురైలో బాంబులు పేల్చడానికి కుట్ర చేశారని పేర్కొన్నారు. 1995లో చెన్నైలోని చింతాద్రిపేట హిందూ మున్నాని కార్యాలయంపై బాంబు దాడి కేసులోనూ ఇద్దరు సోదరులు నిందితులుగా ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పుకొచ్చారు. అదే ఏడాది పార్సిల్ బాంబు పేల్చిన కేసులోనూ.. 1999లో చెన్నై, తిరుచ్చి, కోయంబత్తూర్, కేరళ ప్రాంతాల్లో వరసగా ఏడు చోట్ల బాంబు పేలుళ్లు జరిపిన ఘటనలో వీరిద్దరూ ప్రధాన నిందితులను తెలిపారు.

**నిఘా పెంచిన ఏపీ పోలీసులు**

మే 18న విజయనగరంలో ఉగ్ర కుట్రలను ఏపీ పోలీసులు భగ్నం చేసిన విషయం తెలిసిందే. ఇద్దరు ఉగ్రవాద కార్యకలాపాలు కొనసాగిస్తున్న సిరాజ్, సమీర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఉగ్ర కార్యకలాపాలపై ఏపీ పోలీసులు , సంయుక్తంగా విచారణ చేపట్టింది. విజయనగరం, హైదరాబాద్, బెంగుళూరు, తమిళనాడులో భారీ పేలుళ్లకు కుట్ర పన్నినట్లు గుర్తించినట్లు చెప్పారు. అహీం అనే సంస్థతో ఉగ్ర కార్యకలాపాల విస్తృతికి సిరాజ్, సమీర్ స్లీపర్ సెల్స్ ఏర్పాటు చేశారని దర్యాప్తు బృందాలు గుర్తించినట్లు పేర్కొన్నారు. ముస్లిం మహిళలను వివాహం చేసుకున్న ఇతర మతస్తులను హతమార్చాలి అన్నది సిరాజ్ పథకంలో ఓ భాగమని నిర్ధారణలో తేలిందని చెప్పుకొచ్చారు. ఉగ్రవాదం వైపు యువతను మళ్లించేందుకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశారని ఐబీ అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో భద్రత కట్టుదిట్టం చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

# సూపర్ సిక్స్... సూపర్ ఫ్లాప్: షర్మిల



"సూపర్ సిక్స్ సూపర్ హిట్ ఎలా అయ్యింది సీఎం చంద్రబాబు గారూ? 20 లక్షల ఉద్యోగాలు అన్నారు. ఒక్కరికైనా ఇచ్చారా? నెలకు రూ.3 వేల భృతి ఏ ఒక్క నిరుద్యోగికైనా అందిందా? 18 ఏళ్లు నిండిన ఒక్క మహిళకైనా నెలకు రూ.15 వందలు అకౌంట్ లో పడ్డాయా? అన్నదాత సుఖీభవ కింద సొంతగా రూ.20 వేలు ఇస్తామని మాట మార్చారు. కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో లింక్ పెట్టారు. 30 లక్షల మంది రైతులకు పథకం దక్కకుండా పంగనామాలు పెట్టారు.
తల్లికి వందనం కింద 20 లక్షల మంది బిడ్డలకు పథకంలో కోత పెట్టారు. రూ.15 వేలు ఇస్తామని రూ.13 వేలకు సరిపెట్టారు. మూడు సిలిండర్లు ఎంత మందికి అందుతున్నాయో అర్థంకాని పరిస్థితి! 14 నెలల తర్వాత ఫ్రీ బస్సు అమలు చేసి, సూపర్ సిక్స్ హామీలను ఉద్ధరించామని చెప్పుకోవడం నిజంగా సిగ్గుచేటు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అనడం హాస్యాస్పదం.
చంద్రబాబు గారు రాష్ట్ర ప్రజలకు చేసింది ఘరానా మోసం. రాష్ట్రంలో సంక్షేమం సన్నగిల్లింది. అభివృద్ధి అటకెక్కింది. సుపరిపాలన కొండెక్కింది. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో హామీలు ఘనం... అమలు మాత్రం అరచేతిలో వైకుంఠం" అంటూ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు.

## భారీ వర్షాల నేపథ్యంలో

# అప్రమత్తం కండి



జగిత్యాల మినహా 15 జిల్లాల్లో అధిక వర్షపాతం, మిగతా జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని సీఎం తెలిపారు. నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం ఉన్నతాధికారులతో మాట్లాడారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించామని, వారు కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడతారని సీఎం తెలిపారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు- ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని సీఎం ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని సీఎం ఆదేశించారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలని.... పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు- చేసి పర్యవేక్షణ చేయాలన్నారు. నిరంతరాయంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటు-వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ తగినంత మందులు అందుబాటు-లో ఉంచుకోవాలని... అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం,పశునష్టం చోటుచేసు కోకుండా జాగ్రత్తలు వహించాలని సీఎం తెలిపారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పురపాలక, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో సాగాలని సీఎం సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# అలాస్కా వేదికగా అగ్రదేశాల భేటీ

ఇద్దరు నేతల వాగ్ధాటి దృష్ట్యా ఈ భేటీ వాడీవేడిగా సాగుతుందని అంతా భావించారు. కానీ, అందుకు భిన్నంగా ట్రంప్-పుతిన్ చాలా ఆత్మీయంగా కన్పించారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడి 'పవర్ ప్లే' చూసి పుతిన్ ఒకింత ఆశ్చర్యానికి లోనయ్యారు. అలాస్కాలోని జాయింట్ బేస్ ఎల్మెండార్ఫ్-రిచర్డ్‌సన్ సైనిక స్థావరానికి తొలుత ట్రంప్ చేరుకున్నారు. కాసేపటి తర్వాత పుతిన్ అక్కడకు విచ్చేశారు. రష్యా అధ్యక్షుడికి ట్రంప్ ఆత్మీయంగా స్వాగతం పలికారు. షేక్‌హ్యాండ్ ఇచ్చి చిరునవ్వుతో పలకరించారు. ఈ సందర్భంగా ట్రంప్ తమ సైనిక సామర్థ్యాన్ని ప్రదర్శించడం చర్చ నీయాంశంగా మారింది. వీరిద్దరూ అక్కడ ఏర్పాటు- చేసిన పోడియం వద్దకు వెళ్తుండగా.. వారి పైనుంచి బీ-2 బాంబర్లు, పలు రకాల ఫైటర్ జెట్లు- ప్రయాణించాయి. వాటిని చూసి పుతిన్ ఆశ్చర్యపోయారు. ఇక, వీరు ప్రయాణిస్తున్న కాన్వాయ్ వెళ్లే మార్గంలోనూ యుద్ధ విమానాలు వరుసగా పార్క్ చేసి ఉన్నాయి. ఇటీ-వల ఇరాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధం సందర్భంగా టెహ్రాన్ అణు స్థావరాలను ధ్వంసం చేసేందుకు అమెరికా ఈ బీ-2 బాంబర్లను వాడిన సంగతి తెలిసిందే. తమ సైనిక సామర్థ్యాలను పరోక్షంగా పుతిన్‌కు చెప్పేందుకే ట్రంప్ ఈ మిలిటరీ విన్యాసాలు చేయించి ఉంటారని తెలుస్తోంది. రష్యా కూడా అణ్వాయుధ సామర్థ్యం కలిగిన దేశమే..! వీరి భేటీ- సందర్భంగా మరో ఆసక్తికర ఘటన చోటు-చేసుకుంది. సాధారణంగా పుతిన్ ఎక్కడకు వెళ్లినా తన సొంత వాహనాలను తీసుకెళుంటారు. అలాస్కాకు కూడా మాస్కో నంబర్‌ప్లేట్ ఉన్న వాహనశ్రేణి చేరుకుంది. అయితే, అందులో కాకుండా.. ట్రంప్‌తో కలిసి అమెరికా అధ్యక్షుడి 'బీస్ట్' వాహనంలో పుతిన్ ప్రయాణించడం ఆశ్చర్యపర్చింది. ఈ రైడ్ ముందస్తు ప్రణాళికలో భాగమో కాదో తెలియనప్పటికీ.. వీరిద్దరూ బీస్ట్‌లో వెనుక సీట్లో కూర్చుని సమావేశ వేదిక వద్దకు వెళ్లారు. 10 నిమిషాల ఈ ప్రయాణంలో ట్రంప్ మాట్లాడుతుండగా పుతిన్ నవ్వుతూ కన్పించారు.

# భారత్‌లో చైనా విదేశాంగ మంత్రి వాయింగ్‌యి 3రోజుల పర్యటన

ఈ పర్యటనలో భారత్ చైనా సరిహద్దు ప్రశ్నలపై 24వ రౌండ్ ప్రత్యేక ప్రతినిధుల (ఎస్ఆర్) చర్చలను వాంగ్ యి దోవల్‌తో నిర్వహిస్తారని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికారిక ప్రకటన తెలిపింది. ఈ పర్యటనలో వాంగ్‌యి భారత విదేశాంగ శాఖా మంత్రి ఎస్. జై శంకర్‌తో ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై కూడా చర్చించనున్నట్లు ఆ ప్రకటన పేర్కొంది.2020లో సరిహద్దులో భారత, చైనా దళాల మధ్య జరిగిన ఘర్షణ తర్వాత ఇరు దేశాధినేతలు చర్చించుకోవడం ఇది రెండోసారి. ఇదిలా ఉండగా.. మరోవైపు ఈ నెల చివరలో భారత ప్రధాని నరేంద్రమోడీ చైనాలో పర్యటించనున్నారు.

# అమెరికా పన్నులతో తమిళనాడుకి తీవ్ర నష్టం

ఈ మేరకు ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. మ్యాన్ మేడ్ ఫైబర్స్‌పై 5 శాతం జీఎస్టీని నిర్ణయించడం, పత్తి దిగుమతులపై సుంకాన్ని తొలగించడం, మారిటోరియంతో సులభమైన, తక్కువ వడ్డీ రుణాలను పొడిగించడం వంటి అనేక చర్యలు తీసుకోవాలని స్టాలిన్ ప్రధాని మోడీని కోరారు. సుంకాల సంక్షోభాన్ని పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వానికి తమిళనాడు పూర్తి మద్దతు ఇస్తోంది. ఈ వాణిజ్య సంక్షోభాన్ని అధిగమించడానికి తమిళనాడు కేంద్రం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుంది అని స్టాలిన్ అన్నారు.

## హైదరాబాద్‌కు ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన

# ఘనత చంద్రబాబుదే

మాదాపూర్‌లోని హైటెక్స్‌లో జరిగిన క్రెడాయ్ ప్రాపర్టీ షోలో రేవంత్ రెడ్డి పాల్గొని పేర్కొన్నారు. 1990లలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు హైటెక్ సిటీ ప్రాజెక్టును ఊహించి, అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారని ఆయన గుర్తు చేశారు. "కొందరు గుర్తించబడతారు, మరికొందరు గుర్తించబడరు. కానీ హైటెక్ సిటీ అభివృద్ధికి ఉన్న క్రెడిట్ చంద్రబాబు నాయుడుకే దక్కాలి" అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయంగా ప్రత్యర్థులు అయినప్పటికీ రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు మధ్య ఒక ప్రత్యేక బంధం ఉంది. పాలన గురించి చాలామంది యువ రాజకీయ నాయకులకు, రేవంత్‌కు కూడా నేర్పించిన ఘనత చంద్రబాబుకే ఉందని చెబుతారు. హైదరాబాద్ ఐటీ పరిశ్రమకు వెన్నెముకను నిర్మించిన ఘనత కూడా ఆయనకే దక్కుతుంది. రేవంత్ రెడ్డి బహిరంగంగా చేసిన ఈ ప్రశంస, హైదరాబాద్ అభివృద్ధిలో చంద్రబాబు విధానాలు ఎంతగా ప్రభావం చూపాయో చాటి చెప్పింది.

## సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తితో

# చంద్రన్న పాలన



ఈ కార్యక్రమంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని చిన్ని, పలువురు ఎమ్మెల్యేలతో మంత్రి సవిత పాల్గొన్నారు. ముందుగా సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సర్దార్ గౌతు లచ్చన్న అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేశారన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు బడుగు వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామన్నారు. గౌతు లచ్చన్న స్ఫూర్తితో సీఎం చంద్రబాబు బీసీల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. గౌతు లచ్చన్న పోరాట యోధుడే కాదు గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. అంటరానితనంపై అలుపెరగని పోరాటం చేశారని, హరిజన రక్షణ యాత్రలు నిర్వహించారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని సేవలు చేసిన సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం ఎంతో ఆనందం కలిగిస్తోందన్నారు.

**గీత కార్మికులకు మోపెడ్లు :** ఆదరణ 3.0 పథకం ద్వారా కుల వృత్తుదారులకు అత్యాధునిక పనిముట్లు ఇవ్వనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. గీత కార్మికులకు మోపెడ్ ద్విచక్ర వాహనాలతో పాటు తాటిచెట్లు ఎక్కడానికి అధునాతన పరికరాలు అందజేయనున్నామన్నారు. రంపచోడవరంలోరి హార్టీకల్చర్ పరిశోధనా కేంద్రంలో నూతన తాటి ఉత్పత్తులు తయారుచేసి, గీత కార్మికులకు ఉపాధి, ఆర్థిక వృద్ధి మరింత పెంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలోనే రంపచోడవరంలో పరిశోధనా కేంద్రానికి సందర్శించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు, మాజీ మంత్రులు పితాని సత్యనారాయణ, కేఈ ప్రభాకర్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల సత్యనారాయణ, ఎమ్మెల్యే, సర్దార్ గౌతు లచ్చన్న మనుమరాలు గౌతు శిరీష, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి సహా పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, అధిక సంఖ్యలో గీత కార్మికులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# చేనేత క్లస్టర్ల పై విచారణ జరిపించండి

సూర్య ప్రతినిధి - జమ్మలమడుగు

ఈ నెల 7 న రాష్ట్ర ప్రభుత్వం చేనేత దినోత్సవ సందర్భంగా విడుదల చేసిన రుణం ఎంత మంది లబ్ధిదారులకు అందినదో అధికారులు విచారణలో తేల్చాలని సిపిఐ ప్రసాద్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులకు చేనేత దినోత్సవ సందర్భంగా విడుదల చేసిన రుణాలు ఎంత మంది కందిందో సంబంధిత అధికారులు తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ జమ్మలమడుగు నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. తాసిల్దార్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేనేతలకు ప్రతిష్టాత్మకంగా వారి ఆర్థిక అభివృద్ధి కొరకు ప్రభుత్వం చేనేత దినోత్సవం సందర్భంగా రుణాలు విడుదల చేస్తే క్లస్టర్ నిర్వహిస్తున్న నిర్వాహకులు ఆ డబ్బులను లక్షల రూపాయల దోచుకోవడం జరిగిందని. వాటి పైన సమగ్ర విచారణ జరిపించే విధంగా అధికారులు ప్రయత్నం చేయాలని వారు డిమాండ్ చేశారు. మొదటి క్లస్టర్లో ఉండే వారు రెండో కస్టర్లను పేర్లను నమోదు చేయించి వారికి వచ్చిన రుణాలను క్లస్టర్ యాజమాన్యాలు దోచుకుంటున్నారని వారన్నారు వెంటనే సంబంధిత అధికారులు. సమగ్ర విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేసి క్లస్టర్ యాజమాన్యాలపై కేసు నమోదు చేయాలని లేని పక్షంలో లబ్ధిదారులను ఏకం చేసి ఆర్డీవో కార్యాలయం ముట్టడిస్తామని. సంబంధించిన సాక్ష్యాలు స్పష్టంగా మా వద్ద ఉన్నాయని వారన్నారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి రాంప్రసాద్ రాజేంద్ర నాగేంద్ర పాల్గొన్నారు.

## మానవత్వం చూపిన మేఐహెల్ప్ యు ఫౌండేషన్



సూర్య ప్రతినిధి - జమ్మలమడుగు

జమ్మలమడుగు వేపరాలలో నివాసం ఉంటున్న అలిశెట్టి లక్ష్మి (69) అనే వృద్ధురాలు అనారోగ్యంతో మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరు ముందుకు రాకపోవడంతో ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ అహమ్మద్ హుస్సేన్ ని సంప్రదించగా వారు వెంటనే స్పందించి హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, టౌన్ ప్రెసిడెంట్ అహమ్మద్ హుస్సేన్, సుబహన్, ట్రేజరర్ భార్గవ్ సాయి,ముని సాయి, కృపా ఆగ్ని షారూన్ ట్రస్ట్ సభ్యులు సుమన్ బాబు,ప్రసన్న కుమార్,సురేష్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ అమ్మ శరణాలయం లోని వృద్దులకు సహాయం చేయడానికి దాతలు 82972 53484, 9182244150 ఈ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## శ్రీ అభయ ఆంజనేయ స్వామి కి ప్రత్యేక పూజలు

### ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలి

### - టిడిపి ఇన్ ఛార్జి భూపేష్ రెడ్డి



సూర్య ప్రతినిధి - జమ్మలమడుగు

శ్రావణమాసం సందర్భంగా మైలవరం మండలం గొల్లపల్లి ఉప్పలపాడు గ్రామంలో వెలిసిన శ్రీ అభయ ఆంజనేయ స్వామికి దర్శించుకుని టిడిపి ఇన్ ఛార్జి భూపేష్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు శనివారం ఆంజనేయస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి పండితులు స్వాగతం పలికి ఆయనకు సన్మానం చేశారు. రాధాకృష్ణుని బొమ్మను బహుకరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ గొల్లపల్లి గ్రామంలో శ్రీ అభయ ఆంజనేయ స్వామి చాలా పురాతన దేవాలయం ప్రతి ఒక్కరికి మంచి జరగాలని ప్రతి ఒక్కరు సుఖశాంతులతో ఉండాలని భూపేష్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు వజ్రాల మాజీ ఎంపీటీసీ నరసింహులు యాదవ్ ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి నరసిమ్ములను అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు చిన్న పాపిరెడ్డి గురవయ్య యాదవ్ భాస్కర్ రెడ్డి మాజీ సర్పంచ్ శివరామిరెడ్డి ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్పొరేషన్ అధికారుల సాక్షిగా జాతీయ పతాకానికి అవమానం



సూర్యప్రతినిధి - కడప అర్బన్

జాతీయ పతాకం పట్ల కడప కార్పొరేషన్ అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో ఈ చిత్రం చూస్తే సరిపోతుంది. జాతీయ పతాకం చినిగిపోయిన పట్టించుకోలేదు. ఇదేమి మారుమూల ప్రాంతాల్లో లేదు... కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పక్కనే ఉంది. అంతే కాదు ఇదే రూట్ లో ఆర్డీవో నివాసం, డిఎస్పీ కార్యాలయం కూడా ఉన్నాయి. కానీ ఎవరు జాతీయ పతాకానికి పట్టిన దుస్థితి ని గమనించలేదు. వాడవాడల జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకున్న అధికారులు ప్రధాన రహదారి పక్కన చినిగిపోయి ఉన్నా జెండాను గమనించలేదంటే ఎంత నిర్లక్ష్యంగా విధులను నిర్వహిస్తున్నారో అర్థమౌతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి జాతీయపతాకాన్ని మార్చాలని ప్రజలు కోరుతున్నారు

## ధర్మవరంలో ఉగ్ర కలకలం

### - పాక్ ఉగ్రవాదులతో ధర్మవరం వాసికి సంబంధం




సూర్యప్రతినిధి - ధర్మవరం

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో కలకలం చోటుచేసుకుంది. మార్కెట్ వీధిలోని ఓ టీస్టాల్‌లో పనిచేస్తున్న నూర్ మహమ్మద్ ను ఇంటెలిజెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నూర్ మహమ్మద్ పాకిస్థాన్ ఉగ్రవాదులతో చాటింగ్ చేస్తున్నట్లు గుర్తించిన ఐబీ అధికారులు.. స్థానిక పోలీసులతో కలిసి ధర్మవరంలో తనిఖీలు చేపట్టారు.కోట కాలనీలో నూర్ మహమ్మద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఐబీ అధికారులు అతడి నివాసంలో తనిఖీలు చేసి పలుఅనుమానిత వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం అధికారులు ప్రశ్నిస్తున్నారు. నూర్ మహమ్మద్ తరచూ పాకిస్థాన్ కు ఫోన్లు చేస్తున్నాడని, అక్కడి ఉగ్రవాదులతో చాటింగ్ చేస్తున్నాడని అధికారవర్గాల సమాచారం.

## వెంకటేశ్వర స్వామికి అభిషేక పూజలు



సూర్య ప్రతినిధి - సుండుపల్లి

సుండుపల్లి మండలం ఆరోగ్య పురంలో ఎన్ జే ఆర్ కాలనీలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణమాస నాలుగో వారం శుభ సందర్భంగా స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు అమృనాయక్ తెలిపారు అభిషేకము పూల అలంకరణ, పట్టు వస్త్రాన్ని పరికబండ బిడికిలో నివాసం ఉన్న శ్రీ లక్ష్మమ్మ శ్రీరాం నాయక్ కుమారుడు దేవేంద్ర నాయక్ సుమలత కుటుంబ సభ్యులు స్వామివారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేయించారు వచ్చిన భక్తులకి తీర్థప్రసాదాలను అందజేసినట్లు తెలిపారు.

## నేడు పెన్షనర్ల సమావేశం

సూర్య ప్రతినిధి - సుండుపల్లె

మండల కేంద్రమైన సుండు పల్లె లో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల (పెన్షనర్ల)సమావేశం నిర్వహిస్తున్నట్లు పెన్షనర్ల ప్రతినిధులు మునిరత్నం రాజు, సురేంద్ర నాద్ రెడ్డి తెలిపారు. సుండుపల్లె తెలుగు ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం ఉదయం 10గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని పెన్షనర్లఅందరూ హాజరు కావలేనని కోరారు.

## వేడుకగా డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు



సూర్య ప్రతినిధి - జమ్మలమడుగు

స్వాతంత్ర సమరయోధుడు, ఉద్యమ నిప్పు కణిక బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న 116 వ జయంతి సందర్భంగా జమ్మలమడుగు పట్టణం విజ్ఞాన్ స్కూల్ ఆవరణంలో అయన చిత్ర పటానికి వైఎస్ఆర్సిపి ఎస్సి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి యోబుతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి.ఈ సందర్భంగా మీడియా తో మాట్లాడుచూ స్వాతంత్ర సమరయో దుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న 1909 వ సంవత్సరం ఆగష్టు 8 వ తేదీ శ్రీకాకుళం జిల్లా సోంపేట తాలూకా బారువా గ్రామం లో చిట్టయ్య, రాజమ్మల దంపతులకు 8వ సంతానంగా జన్మించారన్నారు. విద్యార్థి దశలోనే స్వాతంత్ర ఉద్యమాల వైపు ఆకర్షితులై అడుగులు వేశారన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటూ ఉద్యమ స్ఫూర్తిని ప్రజలకు చాటి చెప్పారన్నారు. మహాత్మా గాంధీ చేపట్టిన ఉప్పు సత్యాగ్రహం క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారన్నారు.విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో పాల్గొని విదేశీ వస్తువులను, వస్త్రాలను పెద్దఎత్తున దహనం చేసారన్నారు. నిత్యం ప్రజలలో ఉంటూ బీసీల ఉద్యమాలు పెద్ద ఎత్తున నడిపి బీసీలను చైతన్య పరిచారన్నారు. నేటి యువ రాజకీయతరానికి సర్దార్ గౌతు లచ్చన్న ఆదర్శప్రాయుడన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అయన జయంతి ని పండుగలా నిర్వహిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమం లోవైస్సార్సీపీ ఎస్సి విభాగం జమ్మలమడుగు నియోజకవర్గ అధ్యక్షులు గజ్జల కిరణ్, చేనేత నాయకుకు పూజారి రాఘవేంద్ర, బడిగించల నరసింహులు,చౌడం మునయ్య, సత్య జోసెఫ్,పలువురు బీసీ నేతలు పాల్గొన్నారు.

## జాతికి ఆదర్శనీయం.. సర్దార్ డా. గౌతు లచ్చన్న..!

### - జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు



సూర్యప్రతినిధి - కడప కలెక్టరేట్

అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధుడు.. సర్దార్ డా. గౌతు లచ్చన్న జాతికి ఆదర్శనీయం అని డిఆర్వో విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. శనివారం కడప కలెక్టర్ లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు అధ్యక్షతన సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ... సమాజంలోని పేద, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి సర్దార్ డా. గౌతు లచ్చన్న చేసిన కృషి రాష్ట్రానికే కాకుండా యావత్ భారతావనికే ఆదర్శం అని చెప్పవచ్చన్నారు. అట్టడుగు వర్గాల అభివృద్ధికి ఆయన చేసిన త్యాగం, పోరాటస్ఫూర్తిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మందస తిరుగుబాటు సమయంలో అతను రైతులు, గిరిజన సంఘాలకు అండగా నిలిచి.. రైతుల హక్కులను కాపాడటానికి అజ్ఞాతంలోకి వెళ్లి తన ప్రాణాలను పణంగా పెట్టిన మహనీయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసి వెంకటపతి, బిసి సంక్షేమ శాఖ అధికారి అంజల, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ డీసీవో ఉదయశ్రీ, జిల్లా కో.ఆపరేటివ్ అధికారి వెంకట సుబయ్య, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, విశ్రాంత బీసీ వెల్ఫర్ అధికారి వెంకట సుబ్బయ్య, పలు సంక్షేమ శాఖల అధికారులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అనంతగిరి క్షేత్రంలో వేడుకగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

### - అంగరంగవైభోపేతంగా రుక్మిణీదేవి-శ్రీకృష్ణుల కళ్యాణ మహోత్సవం



సూర్యప్రతినిధి - బద్వేలు

పట్టణంలోని పడమట దిశగా ఉన్నటువంటి అనంతగిరి క్షేత్రం నందు శ్రీకృష్ణ గీతామందిరం వద్ద శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొనిశ్రీ కృష్ణాష్టమి వేడుకలు పురస్కరించుకొని తెల్లవారుజామునండి ఆలయ ధర్మకర్త యానకి పెంచలయ్య, ఉత్సవ కమిటీ అధ్యక్షులు బోవిళ్ల సుబ్బారెడ్డి, సెక్రటరీ, బోవిల్ల నందగోపాల్ రెడ్డి, క్యాషియర్స్ చెన్ను పల్లె రమణారెడ్డి, గోనుగుంట వెంకటసుబ్బారెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణునికి వివిధ రకాల ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. రుక్మిణీదేవి, శ్రీకృష్ణుల కళ్యాణ మహోత్సవం వేద పండితుల మధ్య కన్నుల పండుగగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకొని మౌనానంద స్వామి వారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ స్వామివారి సన్నిధిలో వేకువ జాము నుండి సుప్రభాత సేవ, అభిషేకం, శాశ్విత సభ్యుల గోత్రనామాలతో అర్చనలు నిర్వహించారు. అనంతరం గణపతి హోమం, శ్రీ సూక్తం,పురుష సూక్తం,రుద్ర హోమం, నవగ్రహ హోమం స్వామివారికి నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తుల నడుమ రుక్మిణీదేవి - శ్రీకృష్ణుల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా వేద పండితుల తో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త యానకి పెంచలయ్య రిటైర్డ్ సూపర్డెంట్ ఎస్ బి వి ఆర్ కాలేజ్, కమిటీ ప్రెసిడెంట్ బోవిల్ల సుబ్బారెడ్డి రిటైర్డ్ తెలుగు పండిట్, సెక్రటరీ బోవిల్లా నందగోపాల్ రెడ్డి,ట్రెజరీ క్యాషియర్ చెన్నుపల్లి రమణారెడ్డి గోనుగుంట వెంకట సుబ్బారెడ్డి, బేరం రామలక్ష్మారెడ్డి ధనమ్మ,బోవిల్ల సుబ్బారెడ్డి లక్ష్మీదేవి కుడమలచిన్నపరెడ్డి లక్ష్మీదేవి, బోవిల్ల సుబ్బారెడ్డి లక్ష్మీదేవి, భోగపత్తినదశరధ రామయ్య పూజారి సుబ్బమ్మ,మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, గంగసాని సాంబశివారెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు తదుపరులు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ పై చర్యలు తీసుకోవాలి

### ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి - అంబేద్కర్ విగ్రహానికి వినతి



సూర్య ప్రతినిధి - సుండుపల్లి

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సుండుపల్లి మండల కేంద్రంలో జరుగుతున్న ర్యాలీని అడ్డుకొని, స్వాతంత్ర సమరయోధుల పేరుతో పాటలు పెట్టుకుని శాంతియుతంగా జరుగుతున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అనుమతులు ఉన్నాయా అని హెడ్ కానిస్టేబుల్ సాదక్ అలీ ప్రశ్నించడం సిగ్గుచేటన్నారు. ర్యాలీని అడ్డుకోవడం ఏమిటని వృత్తిరీత్యా ఫోటోలు వీడియోలు తీస్తున్న విలేకరి ప్రశ్నిస్తే స్టేషన్ కు రా నేనేంటో చూపిస్తా అని బెదిరించడం, పాత్రికేయ వృత్తికి ఆటంకం కలిగించడం నేరం అన్నారు. ప్రజాస్వామ్య భారతదేశంలో ఉన్నామా లేదా ఇతర దేశంలో ఉన్నామని ప్రశ్నించారు. ఇలాంటి వ్యక్తుల వలన పోలీసు వ్యవస్థకే చెడ్డ పేరు తెస్తున్నారన్నారు. హెడ్ కానిస్టేబుల్ సాదక్ ఆలీని వెంటనే పోలీసు ఉన్నత అధికారులు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గౌరవ అధ్యక్షుడు వీర నాగయ్య, మండల నాయకులు నాగేశ్వర, మండల ఉపాధ్యక్షుడు గడ్డం నాగలేసు, ఎంఎస్పి మండల నాయకులు గొల్లపల్లి నాగరాజు, గడ్డంబాలు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణుని కృపతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

### - కృష్ణాష్టమి వేడుకల్లో చమర్తి.జగన్ మోహన్ రాజు



రాజంపేట - రాజంపేట

శ్రీకృష్ణుని కృపతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు ఆకాంక్షించారు. శనివారం కృష్ణాష్టమి సందర్భంగా రాజంపేట మండలం మదన గోపాలపురంలో నందలూరు మండల ప్రజలతో కలిసి కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మేళా తాళాలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజలతో కలిసి కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని శ్రీకృష్ణుని కృపతో ప్రతి ఒక్కరు సుభిక్షంగా ఉండాలని, శ్రీకృష్ణుని లాగా ప్రతి ఒక్కరూ మధ్య ఉన్న మనుషులకు అండగా నిలిచి సాయం చేసే గుణాన్ని ఏర్పరచుకోవాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో యాదవ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, శరత్ కుమార్ రాజు, విశ్వనాధ రాజు, నందలూరు టిడిపి మండల అధ్యక్షుడు జంగం శెట్టి సుబ్బయ్య. వీరబల్లి టిడిపి అధ్యక్షుడు భాను గోపాల్ రాజు, క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్, శ్రీధర్ సుబ్బరాయుడు, కమ్మ సంఘం అధ్యక్షుడు శివ నారాయణ చౌదరి, తెలుగుదేశం పార్టీ నాయకులు గంప శివ, సుబ్రహ్మణ్యం నాయుడు, బిజెపి నాయకులు మహేశ్వర రాజు, కొండ శీను, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షుడు పోలి శివకుమార్, తెలుగు యువత అధికార ప్రతినిధి పాండురాజు, నందకుమార్ నాయుడు, చలపతి, సాయి, పలువురు టిడిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు ప్రజలు పాల్గొన్నారు.

## సూక్ష్మ నీటి పారుదల శాఖ సేవలు అభినందనీయం

### -సూక్ష్మ నీటి పారుదల పరికరాలు పంపిణీ చేసిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి




సూర్య ప్రతినిధి - రాయచోటి

జిల్లాలో సూక్ష్మ నీటి పారుదల శాఖ సేవలు అభినందనీయమని రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన సర్వీసుల శాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వై ప్రసన్నలక్ష్మి, ఎంఐఏఓ సాయికిరణ్ లు ఆద్వర్యంలో సూక్ష్మ నీటి పారుదల పరికరాలు పంపిణీ మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సూక్ష్మ నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ వర్గాలకు 100 శాతం రాయితీతో, మిగిలిన వర్గాలకు 90 శాతం రాయితీతో.... 70 లక్షల విలువైన డ్రిప్ ఇరిగేషన్ ఆస్తుల పంపిణీ చేసినట్లు తెలిపారు. మైక్రో ఇరిగేషన్ జిల్లా అధికారి వై ప్రసన్నలక్ష్మి, ఎంఐఏఓ సాయికిరణ్ లను మంత్రి అభినందించి రైతులకు మరిన్ని సేవలు అందించాలని సూచించారు.

## వాజపేయి కి నివాళిలర్పించిన బీజేపీ నేతలు




సూర్య ప్రతినిధి - జమ్మలమడుగు

బిజెపి పార్టీ జమ్మలమడుగు కార్యాలయంలో మాజీ ప్రధాని, తొలి బిజెపి జాతీయ అధ్యక్షుడు తొమ్మిది సార్లు లోక్ సభ కు రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికైన ప్రజా నాయకుడు, భారతరత్న అవార్డు గ్రహీత వాజపేయి వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి పార్టీ జమ్మలమడుగు మండల రూరల్ అధ్యక్షుడు ధనుంజయ మాట్లాడుతూ ఇలాంటి మహానుభావుని వర్ధంతి జరుపుకోవడం చాలా సంతోషం అన్నారు అలాంటి గొప్ప వ్యక్తిని స్మరించుకుంటూ అర్బన్ అధ్యక్షుడు ఓబులరెడ్డి మైలవరం మండల అధ్యక్షుడు సయ్యద్ నబీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పాములేటి జిల్లా చేనేత అధ్యక్షుడు వెంకటేశ్వర్లు రంగనాయకులు పుష్ప రాజు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

## రామన్నుతల పల్లి లో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



సూర్య ప్రతినిధి - లింగాల

లింగాల మండల పరిధిలోని రామన్నుతల పల్లె గ్రామంలో శనివారం ఘనంగా శ్రీకృష్ణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. జన్మాష్టమి పురస్కరించుకొని, ఆ గ్రామంలో వేదమంత్రాలతో, స్వామివారికి అభిషేకం అర్చన అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు, యువకులు విద్యార్థులు, చిన్నపిల్లలు, శ్రీకృష్ణ, గోపిక, వేషధారణలో, ఉట్టి కొట్టారు, ఉట్టి కొట్టు, కార్యక్రమంలో పెద్దలు పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం వేళలో మేళా తాళాలతో ఘనంగా కోలాటాల నడుమ స్వామివారిని, గ్రామోత్సవం, నిర్వహించారు, కట్టెల కోలాటం ప్రదర్శనలు అలరించాయి కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులందరూ పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ కళ్యాణ మహోత్సవంలో ఆకేపాటి

సూర్య ప్రతినిధి - నందలూరు

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నందలూరు మండలంలోని అరవపల్లి గీతా మందిరంలో ఏర్పాటుచేసిన శ్రీశ్రీశ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరిగేల సౌమిత్రి, గుండు మల్లికార్జున రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, భాస్కర్ యాదవ్, మధు యాదవ్,గుణ యాదవ్,ఇబ్బు, మధురాజు, గ్రీష్మంత్ రెడ్డి, నాగసుబ్బయ్య, కాకి చంద్ర,విజేయుడు, కృష్ణయ్య ,ముమ్మాడిశెట్టి సుధ, పుత్త శంకర్, నాగేశ్వర్ రెడ్డి, ఏలూమలై పాల్గొన్నారు.


## పూలు అమ్మిన చోటే కట్టెలు అమ్మలేం

సూర్యప్రతినిధి - రాయచోటి

గత మూడేళ్లుగా అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి ఉన్న నేపథ్యంలో నేడు కూటమి ప్రభుత్వం రాయచోటి అన్నమయ్య జిల్లా ను రాజంపేట గా మారుస్తున్నారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. నాడు రాజంపేట వాసులు రాయచోటికి పోవాలంటే రెండు కొండలు దాటిపోవాలి ఇప్పుడు రాయచోటి వారికి కూడా అంతే కదా... ఆ ఊరికి ఈ ఊరు ఎంత దూరమో ఈ ఊరికి ఆ ఊరు కూడా అంతే దూరమని రాయచోటి ప్రజలు మేధావులు అంటున్నారు. రాయచోటి జిల్లా లేకున్నా పర్లేదని రాజంపేట అన్నమయ్య జిల్లాలో కలపకుండా పాత జిల్లా కడపలోకి రాయచోటి కలపాలని నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారు. దేవుని తొలి గడప కడప అని మేధావులు, స్వాతంత్ర సమరయోధులు, రాజకీయ నాయకులు, అందరూ ముక్తకంఠంతో రాయచోటి ని కడపలో కలపాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పునఃసమీక్షించాలని వారు కోరుతున్నారు.

## ఘనంగా శ్రీ వేణుగోపాల స్వామిఆలయంలో శ్రీ కృష్ణాష్టమి మహోత్సవం

సూర్య ప్రతినిధి - బ్రహ్మంగారిమఠం



బ్రహ్మంగారిమఠం మండలం ముడమాల గ్రామం పంచాయతీ పరిధిలోని సిద్దయ్య గారి మఠంలో మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ వారి కుటుంబం సభ్యులు నిర్మించిన శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో శ్రీ కృష్ణాష్టమి మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నేడు శ్రీ కృష్ణాష్టమి మహోత్సవ శుభ సందర్భంగా ముడమాల గ్రామానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ విచ్చేయనున్నారు. ఈ క్రమంలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి మల్లెపల్లె సర్పంచ్ లక్ష్మీదేవి ఆమె భర్త వైన్ షాప్ ఓనర్ చిలమల నారాయణ మరియు ముడమాల సర్పంచ్ వేమిరెడ్డి మునిరెడ్డి, తెదేపా నాయకులు అదిబోయిన రమణయ్య, నాగరాజు, సిద్దయ్య, రామకృష్ణ, ఎంపిటిసి రమేష్ ఈ పూజ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు, ప్రజలు మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన వారందరికీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు.

# ఇంద్రకీలాద్రి క్షేత్రంలో భక్తులకు మెరుగైన వైద్యసేవల ఏర్పాటు

సూర్య ప్రతినిధి - విజయవాడ

శ్రీ దుర్గా మల్లేశ్వరుల దర్శనం కోసం ఇంద్రకీలాద్రి కి విచ్చేసే భక్తులకు ఏదైనా ఆరోగ్య అత్యవసర పరిస్థితి ఏర్పడితే తక్షణమే స్పందించి వైద్య సేవలు అందేలా దేవస్థానం వైద్య కేంద్రానికి జవసత్వాలు కల్పిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి. కె. శీనానాయక్ పేర్కొన్నారు. శనివారం ఉదయం దేవస్థానం ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. వైద్యు లు పూర్తి స్థాయిలో లేకపోవడం, రోగుల వివరాల నమోదు లో లోపాలు, అవసరమైన మందులు లోటు గమనించి, అర్హత గలిగిన నర్సింగ్ సిబ్బంది కేటా యించినా ఇంకా ఆరోగ్య కేంద్రం పరిస్థితి లో మార్పు రాకపోవడంపై ఈవో అసహనం వ్యక్తం చేశారు. ఇరుకు గదిలో ఆరోగ్యకేంద్రం నిర్వహించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ, తగినంత గాలి వెలుతురు వచ్చేలా విశాలంగా మార్పు చేయాలని ఇంజనీరింగ్ సిబ్బంది ని ఆదేశించారు. ఈ తనిఖీ లో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సి హెచ్ రంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. రాంబాబు పాల్గొన్నారు.



సూర్య

సంపాదకీయం

# ఇక జియో పొలిటికల్ షిఫ్ట్..

రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు అంటూ ఉండరంటారు కదా.. అయితే ఇది కొన్ని సందర్భాల్లో దేశాలకూ వర్తిస్తుంటుంది. ప్రత్యర్థిగా భావిస్తున్న దేశాలతోనే జట్టుకట్టే పరిస్థితి ఉండొచ్చు. ఇప్పుడు భారత్ చైనా బంధం చూస్తుంటే ఇదే నిజమనిపిస్తోంది. ఓవైపు ట్రంప్ దూకుడు భారత్, చైనాకు చాలానే కలిసి వస్తోంది. జియోపొలిటికల్ షిఫ్ట్ అనేది ఒకటి ఉంటుంది. ట్రంప్ కారణంగా ఇది వర్కవుట్ అవుతోంది. భారత్ చైనా మధ్య స్నేహ బంధం. ఒక నమ్మకం సరికొత్త బంధానికి పునాది వేస్తుంది. ఒక అవకాశం.. సత్సంబంధాలను పెంచుతుంది. ఒక అవసరం కలిసి నడిచేలా చేస్తుంది. ఇది ఇప్పుడు భారత్ చైనాకు వర్తిస్తుంది. ఎందుకంటే 2020లో గాల్వన్ లోయలో ఘర్షణ తర్వాత కథ అంతా మారిపోయింది. దూరం పెరిగింది. అయితే ఆ దూరం ఎప్పుడూ అలాగే ఉండదు కదా. ఇటీవలి పరిస్థితులు కలిసి వచ్చాయి. రెండు దేశాల మధ్య మళ్లీ కొత్త బంధం చిగురించేలా చేశాయి. భారత ఉత్పత్తులపై ట్రంప్ 50 శాతం టారిఫ్ లు విధించిన తర్వాత ఈ రెండు దేశాలు దగ్గరవుతున్నాయని ఇప్పుడు అనుకుంటున్నారు. అయితే మార్చిలో చైనాపై 20 శాతం ట్రంప్ టారిఫ్ లు విధించినప్పుడే చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ కలిసి నడుద్దామని పిలుపునిచ్చారు. అమెరికా ఓవరాక్షన్‌కు చెక్ పెట్టేందుకు, పవర్ పాలిటిక్స్‌ను అడ్డుకునేందుకు కలిసి పని చేద్దామన్నారు. అప్పటి నుంచే భారత్ - చైనా మధ్య పరిస్థితులు అనుకూలించడం మొదలైంది. చెప్పాలంటే మొదట ఒక మెట్టు చైనానే దిగింది. ఆగస్ట్ 18న చైనా విదేశాంగ మంత్రి రాక. ఆగస్ట్ 18న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఢిల్లీకి వస్తున్నారు. జాతీయ భద్రతా సలహాదారు దోవల్ తో భేటీ అవుతారు. ఈనెల 31న ప్రధాని మోడీ చైనా పర్యటన కంటే ముందుగానే ఈ పరిణామం చోటు చేసుకుంటుండడం ఆసక్తికరంగా మారుతోంది. ఎందుకంటే మాట్లాడుకునేవి చాలా ఉన్నాయి. పరిష్కరించుకునేవీ ఉన్నాయి. సో ఇటీవలి కాలంలో భారత్ చైనా ప్రతినిధులు, ప్రభుత్వ వర్గాల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడుస్తున్నాయి. రాజకీయంగా పరస్పర విశ్వాసం పెంచుకోవడం, సహకారాన్ని విస్తరించడం ఇవన్నీ రెండు దేశాల మధ్య బంధాన్ని మరో లెవెల్ కు తీసుకెళ్లేలా కనిపిస్తున్నాయి ట్రంప్ టారిఫ్ లకు చెక్ పెడుదామని చైనా ముందుకు రావడం, ప్రధాని మోడీ ఏడేళ్ల తర్వాత చైనాకు వెళ్లాలని డిసైడ్ అవడం, సరిహద్దు వాణిజ్యం మళ్లీ ప్రారంభించాలని అనుకోవడం, బార్డర్ లో పెట్రోలింగ్ విధానాన్ని పునరుద్ధరించడం, డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసులు తిరిగి ప్రారంభించాలనుకోవడం, చైనీస్ పౌరులకు టూరిస్టుల వీసాల మంజూరుపై ముందడుగు పడడం, చైనా కంపెనీల పెట్టుబడుల నిబంధనలను సడలించాలనుకోవడం ఇవన్నీ కీలక పరిణామాలుగా కనిపిస్తున్నాయ్. సరిహద్దు వాణిజ్యం మళ్లీ మొదలు పెట్టేలా చర్చలు. ఓవరాల్ గా చూస్తే భారత్ చైనా మధ్య సరిహద్దు వాణిజ్యం, ద్వైపాక్షిక సంబంధాల్లో మెరుగుదల కనిపిస్తోంది. ముఖ్యంగా 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత ఏర్పడిన ఉద్రిక్తతల నుంచి రిలీఫ్ కనిపిస్తోంది. ఈ సంబంధాలు పెరగడంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాలు, భారత్‌పై విధించిన అధిక టారిఫ్‌లు కీలకంగా మారాయి. ఫస్ట్..



2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత నిలిపేసిన సరిహద్దు వాణిజ్యాన్ని పునఃప్రారంభించేందుకు చర్చలు జరుగుతున్నాయి. ఈ ట్రేడ్ ఉత్తరాఖండ్ లిపులేఖ్ పాస్, హిమాచల్ ప్రదేశ్ షిప్కీ లా పాస్, అలాగే సిక్కిం నాథు లా పాస్ ఇలా మూడు హిమాలయన్ సరిహద్దుల ద్వారా జరుగుతుంది. ఈ సరిహద్దు వాణిజ్యం విలువలో చిన్నదైనప్పటికీ రెండు దేశాల మధ్య సామాజిక ఆర్థిక సంబంధాలను మెరుగుపరచడంలో కీ సిగ్నల్‌గా ఉంది. సో ఇది త్వరలో ప్రారంభించాలనుకోవడంపై చైనా రియాక్ట్ అయింది. ఈ వాణిజ్యంతో సరిహద్దు ప్రాంత వాసుల లైఫ్ క్వాలిటీని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నది చైనా. 2020కి ముందున్న పెట్రోలింగ్ విధానం పునరుద్ధరణ. భారత్ చైనా మధ్య దౌత్యపరమైన పురోగతి కూడా కనిపిస్తోంది. 2024 అక్టోబర్‌లో కుది రిన ఒప్పందంతో 2020కి ముందు ఉన్న పెట్రోలింగ్ విధానాన్ని పునరుద్ధరించారు. ఐదేళ్ల తర్వాత ఇదొక కీలక ముందడుగుగా మారింది.

అటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆగస్టు 31న షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్ కోసం చైనాకు వెళ్లనున్నారు. ఏడేళ్ల తర్వాత చైనా పర్యటనకు మోడీ వెళ్తుండడం ఇదే తొలిసారి. ఈ టైంలో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో భేటీ జరగనుంది. అటు 2020 నుండి నిలిపేసిన డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసులు తిరిగి ప్రారంభం కానున్నాయి. రెడీగా ఉండాలని విమానయాన సంస్థలకు కేంద్రం సూచించింది కూడా. చైనాతో భారత్‌కు 85 బి. డాలర్ల వాణిజ్య లోటు. సో ఈ ప్రయత్నాలన్నీ ఆర్థిక దౌత్య సంబంధాలను బలోపేతం చేయడంలో కీలక ముందడుగుగా మారుతాయి. వాణిజ్యం, చర్చలను తిరిగి ప్రారంభించడం ద్వారా రెండు దేశాలు ఉద్రిక్తతలను తగ్గించడానికి సహకారాన్ని పెంచుకోవడానికి ఉపయోగపడనున్నాయి. అటు వాణిజ్య బంధంపైనా ఫోకస్ పెడుతున్నాయి. 2023-24లో భారత్‌కు చైనా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. ద్వైపాక్షిక వాణి జ్యం 118.4 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అయితే ఇండియా 85 బిలియన్ డాలర్ల వాణి జ్య లోటును ఎదుర్కొంటోంది. దీనిని తగ్గించేందుకు చైనాలో మన మెడిసిన్స్, అలాగే వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ యాక్సెస్‌ను పెంచాలని భారత్ కోరుతోంది. సో రాబోయే రోజుల్లో అన్నీ జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా అమెరికాను ఎదుర్కోవడం చైనాకు కీలకం. అందుకు భారత్ సపోర్ట్ కావాలి. అదే సమయంలో మన ప్రాధాన్యతలకు మనకు ఉన్నాయి. అయితే చైనాను పూర్తిగా నమ్మకుండా జాగ్రత్తగా వ్యవహరించడమే కీలకమైన విషయం. ట్రంప్ టారిఫ్‌లతో మారిన కథ. కొన్ని అవకాశాలు ఆటోమేటిక్ గా కలిసి వస్తాయి. ఇప్పుడు భారత్ చైనా సంబంధాల మెరుగువడంలో కూడా చాలానే కలిసి వచ్చాయి. ఈ రెండు దేశాల దౌత్య సంబంధాలకు ఈ ఏప్రిల్ లో 75 ఏళ్లు పూర్తయ్యాయి. ఆ సందర్భంగా చైనా అధ్యక్షుడు, భారత రాష్ట్రపతి పరస్పర అభినందనలు తెలుపుకోవడం దగ్గర్నుంచి ఇప్పుడు స్ట్రాటజిక్ రీ సెట్ దాకా చాలా పరిణామాలు జరుగుతున్నాయ్. రష్యా నుంచి ఆయిల్, ఆయుధాలు కొనడం ఆపకపోతే భారత్ పై 50 శాతం టారిఫ్ లు వేస్తానని ట్రంప్ ప్రకటించిన తర్వాత కథ మారింది. ఇది భారత్ అమెరికా సంబంధాలపై చాలా ఎఫెక్ట్ చూపింది. ఓవైపు పాకిస్తాన్‌ను అమెరికా దగ్గర తీస్తోంది. ఇటు భారత్ చైనా మధ్య పొలిటికల్ షిఫ్ట్ కనిపిస్తోంది. చైనా పై 20 శాతం సుంకాలు, భారత్ పై 50 శాతం సుంకాలు విధించారు ట్రంప్. దీంతో ఈ రెండు దేశాలు అమెరికా ఆధిపత్యానికి చెక్ పెట్టే దిశగా కదులుతున్నాయి. తాజాగా ప్రధాని మోడీ ఇండిపెండెన్స్ డే స్పీచ్ లోనూ మనం ప్రపంచ మార్కెట్లలో మన సత్తా చాటుకోవాల్సిన టైం వచ్చిందని గుర్తు చేశారు. భారత్ - చైనా వాణిజ్య సంబంధాల మెరుగుదల. ట్రంప్ అమె రికా ఫస్ట్ అన్న విధానం అలాగే అధిక సుంకాలు భారత్ - చైనా మధ్య వాణిజ్య సంబంధాలు పెరగడంలో కీలక పాత్ర పోషించింది. సో తమ ఉత్పత్తులకు అమెరికా చెక్ పెడితే.. భారత్ మాత్రం అన్ని ప్రత్యామ్నాయ ఆప్షన్లు చూస్తోంది. అందుకే డైవర్సిఫికేషన్ రూల్ ఫాలో అవుతోంది. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడికి ఉత్పత్తుల్ని షిఫ్ట్ చేసే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందులో భాగంగానే చైనాతో వాణిజ్య బంధంపై ముందడుగు వేస్తోంది. చైనీస్ పెట్టుబడులపై ఆంక్షలను సడలించడం, వాణిజ్య మార్గాలను తెలవడం వంటి చర్యలకు ఓకే చెబుతోంది. క్లియర్ గా చెప్పాలంటే ట్రంప్ విధానాలు భారత్-చైనా సంబంధాలను స్ట్రాటజిక్ రీసెట్ వైపు నడిపిస్తున్నాయి. భారత్ అమెరికాతో బలమైన సంబంధాలను కొనసాగిస్తూనే, చైనాతో ఆర్థిక సహకారాన్ని పెంచడం ద్వారా ప్రపంచంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవాలని చూస్తోంది. అందుకే ఇవన్నీ జరుగుతున్నాయి. అంతకు ముందు కైలాస శిఖర దర్శన, మానస సరోవర యాత్రకు అడ్డంకులు తొలగించారు.



కన్నెగంటి సజ్జనరావు
ఎడిటర్,
సూర్యదినపత్రిక, ఏపీ & టీజీ
9948036048

## ఘనంగా ప్రారంభమైన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు





సూర్య ప్రతినిధి - విజయవాడ

త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవా సమితి - ఇందూ జ్ఞాన వేదిక విజయవాడ శాఖ వారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వర రావు పూజ కార్యక్రమంలో పాల్గొని శ్రీకృష్ణుని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొనటం చాలా సంతోషంగా ఉంది అని, భగవద్గీత ప్రతీ ఒక్కరూ చదవాలి అని, జ్ఞానం తెలుస్కుని జీవితం సార్ధకం చేసుకోవాలని అన్నారు. ఇంకనూ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొని "గత 5 ఏళ్లుగా ఈ ప్రబోధ సేవా సమితి వారి కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొంటూ వచ్చానని, ఎంతో గొప్పగా వేడుకలు నిర్వహిస్తారు అని. అర్ధవంతంగా వేడుకలు నిర్వహించటం చాలా బాగుంది అని అన్నారు. భగవద్గీత ఎంతో ఉన్నతమైనది అని ప్రపంచానికి మార్గదర్శనం అని తెలిపారు. ఇంకనూ ఈ ఏపీ నాగవంశ సంక్షేమ సంఘం కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు మాట్లాడుతూ ఈ వేదిక వద్ద ప్రతిదీ జ్ఞాన సందేశం , ఆధ్యాత్మిక అంశాలతో ప్రత్యేకంగా వివరిస్తూ, ఎంతో చక్కగా చేస్తున్నారు అని అన్నారు. 63వ డివిజన్ టీడీపీ ఇంచార్జ్ దుర్గ, బొడ్డు అప్పలనాయుడు వైసీపీ నాయకులు తదితరులు శ్రీకృష్ణుని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక అధ్యక్షులు, సభ్యులు కాళ్ల సత్యం, తిరుపతి, సురేష్, అప్పల నరసమ్మ, అన్న, జయ, సన్నీ, సీత తదితరులు పాల్గొన్నారు.

## దేవి శరన్నవరాత్రులకు.. ప్రభుత్వ శాఖలన్నీ స్వచ్ఛందంగా, సేవ చేయాలని శ్రీకృష్ణ భగవానుడికి, వినతిపత్రం సమర్పించిన ఇంద్రకీలాద్రి పరిరక్షణ సమితి.

సూర్య ప్రతినిధి - విజయవాడ



విజయవాడ, ఇంద్రకీలాద్రి క్షేత్రంలో జరిగే దేవి శరన్నవరాత్రులకు అన్ని ప్రభుత్వ శాఖలు స్వచ్ఛందంగా సేవ చేయాలని, ఈ పండుగను రాష్ట్ర పండు గ చేసి, నిధులు కేటాయించాలని.. శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా, ఆ శ్రీకృష్ణ పరమాత్మునికి ఇంద్రకీలాద్రి పరిరక్షణ సమితి సభ్యులు వినతిపత్రం సమ ర్పించారు. ఇంద్రకీలాద్రి పరిరక్షణ సమితి సభ్యులు ఆవేదన చెందుతూ హిందువుల అతి పెద్ద పండుగ అయిన దసరా నవరాత్రులకు, సేవలు అం దించే అన్ని శాఖల వారు...దీనికి భిన్నంగా సేవలందిస్తున్నారు. ప్రజా స్వామ్య ప్రభుత్వాలు భక్తులు చేసుకునే వేడుకలకు ప్రభుత్వ శాఖ ఉద్యోగిగా సేవలందించాలని కానీ భక్తులు వేసిన కానుకల నుండి దసరా నవరాత్రుల కు ఉద్యోగిగా సేవలందించినందుకు గాను, వారి జీతభత్యాలు పొందడం చాలా బాధాకరమని ఇప్పటికైనా అన్ని శాఖల వారు స్వచ్ఛందంగా ప్రభుత్వ శాఖ ఉద్యోగిగా సేవ చేసే విధంగా.. ఆ శ్రీకృష్ణ పరమాత్ముడు వారికి సంక ల్పం కలుగజేయాలని, ఆ శ్రీకృష్ణ పరమాత్ముని సమితి సభ్యులు వేడుకో వడం జరిగింది.

# ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి

సూర్య స్టాఫ్ రిపోర్టర్ - మచిలీపట్నం

స్వాతంత్ర్య సమర యోధుడు గౌతు లచ్చన్న జయంతి వేడుకలు శనివారం మచిలీపట్నంలో ఘనంగా జరిగాయి. స్థానిక బస్టాండ్ సెంటర్ లోని లచ్చన్న విగ్రహానికి కూటమి నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమంకోసం జీవితాన్ని ధారపోసిన నాయకుడు గౌతు లచ్చన్న అని కొనియాడారు. రైతుల శ్రేయస్సుకోసం ఎన్నో పోరాటాలు చేశారని, అందుకే ఆయన రైతు బాంధవుడు అయ్యారని చెప్పారు. రాజకీయ జీవితంలో ఎంతో నిబద్ధతతో ఉండే వారని, అందుకనే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఒకేసారి పోటీ చేసి, రెండింటిలో ఘన విజయం సాధించిన వ్యక్తి అని ప్రశంసించారు. ఆయన చేసిన పోరాటాలకు గుర్తుగా ఆంగ్లేయులు సర్దార్ అని బిరుదు ఇచ్చారని చెప్పారు. లచ్చన్న జయంతి నీ అధికార కార్యక్రమంగా కూటమి ప్రభుత్వం ప్రకటించటం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొనకళ్ళ బుల్లయ్య, మోటమర్రి బాబా ప్రసాద్, లంకె ప్రసాద్, గోపు సత్యాన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

**వెనుకబడిన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో.....**

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్థికంగా వెనుకబడిన కులాల కోసం లచ్చన్న ఎన్నో ఉద్యమాలు చేశారని ప్రశంసించారు. రైతుల శ్రేయస్సుకోసం నిరంతరం పోరాటాలు చేశారని, స్వాతంత్రోద్యమంలో గౌతు లచ్చన్న పాత్ర మరువలేమని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు జి. రమేష్, ఫణి ధూర్జటి, టిడిపి నాయకులు మోటమర్రి బాబా ప్రసాద్, కొనకళ్ళ బుల్లయ్య, గోపు సత్యనారాయణ, మాదివాడ రాము, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయాలలో మచ్చలేని నాయకుడు వాజపేయి

**బిజెపి నాయకులు**

సూర్య స్టాఫ్ రిపోర్టర్-మచిలీపట్నం

భారతదేశ రాజకీయ చరిత్రలో మాజీ ప్రధాని అటల్ బీహారీ వాజపేయి ఒక మచ్చలేని మహా మనిషి అని బిజెపి నాయకులు పేర్కొన్నారు. శనివారం మాజీ ప్రధాని వాజపేయి వర్ధంతి పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత వాజేపేయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు కూ నపురెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నేడు బిజెపి ప్రాచుర్యం పొందటానికి ప్రధాన కారకులు వాజపేయి, ఎల్. కె. అద్వానీ లు అని చెప్పారు. వారి కృషి ఫలితంగా కేంద్రంలో బీజేపీ మూడవసారి అధికారంలో కొనసాగుతోందని అన్నారు. గతంలో వాజేపేయి ప్రధానిగా ఆరు సంవత్సరాలు పదవిలో ఉన్నారని, మచ్చలేని నిస్వార్ధ నాయకుడిగా నిలిచిపోయారని గుర్తు చేశారు. దేశంలో రహదారులు అనుసంధానం అవ్వటానికి కారకులు వాజపేయి అని కొనియాడారు. నైతిక విలువలు, ఉన్నత ఆశయాలతో రాజకీయ జీవితం సాగించారని ప్రశంసించారు.



రచయితగా, కవిగా, నైతిక విలువలు కలిగిన వ్యక్తి అని చెప్పారు. సీనియర్ నాయకులు పంతం గజేంద్ర మాట్లాడుతూ అటల్ బీహారీ వాజ్ పేయి దేశం గర్వించదగ్గ నాయకుడని అన్నారు. పోక్రాన్ అనుపరీక్షను జరిపిన ఘనత వాజపేయి కి దక్కుతుందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ధూళిపాళ్ల శ్రీరామ చంద్ర మూర్తి, సూరిసెట్టి హరికృష్ణ, పుప్పాల రాము, వై. వి. ఆర్. పాండురంగారావు, కె. వి. రామారావు, ఎం .వెంకటేశ్వర రావు, అయోధ్య రామలింగం, సలాది రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



సూర్య స్టాఫ్ రిపోర్టర్ - మచిలీపట్నం

కృష్ణా జిల్లా ప్రధాన కేంద్రం మచిలీపట్నంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగ రంగ వైభవంగా జరిగాయి. వాడ వాడలా ప్రజలు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గోమాతలను ప్రత్యేకంగా అలంకరించి వాటికి పూజలు చేశారు. అలాగే కృష్ణాష్టమి పురస్కరించుకొని ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకల్లో రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కోనేరు సెంటర్ లో ఏర్పాటు చేసిన కృష్ణాష్టమి వేడుకలలో పాల్గొన్నారు. అలాగే వైసిపి నాయకులు పేర్ని కిట్టు వేడుకల్లో పాల్గొన్నారు. జనసేన పార్టీ ఇంచార్జి బండి రామకృష్ణ శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా జరిగిన వేడుకల్లో ఉత్సహంగా పాల్గొన్నారు. పట్టణంలోని ప్రముఖ దేవాలయాల్లో కృష్ణాష్టమి వేడుకలు నేత్ర పర్వంగా నిర్వహించారు. ప్రధానంగా వైష్ణ వాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చిలకలపూడి లో వేంచేసియున్న శ్రీ పాండురంగ స్వామి వారి దేవస్థానం లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు టేకీ నరసింహం నేతృత్వంలో వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేకువజామునుండే భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం ఉట్టి కొట్టే కార్యక్రమం కోలాహలంగా నిర్వహించారు. అలాగే స్థానిక బచ్చుపేట లోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం లో, శ్రీ రంగనాయక స్వామి వారి దేవస్థానం లో, చల్ల రాస్తా సెంటర్ లోని శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానం లో, భద్రాద్రి సీతా రాముల వారి దేవస్థానం, బొబ్బిలి వేణు గోపాల స్వామి వారి దేవస్థానం, తదితర దేవస్థానాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్త మండలి ఆధ్వర్యంలో భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. వేలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

## చంద్రన్న సామూహిక గోకులం ప్రారంభోత్సవంలో పాల్గొన్న శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)



సూర్య ప్రతినిధి-జగ్గయ్యపేట

నందిగామ నియోజకవర్గం మండలం మునగచెర్ల గ్రామంలో కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చంద్రన్న సామూహిక గోకులం ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులుగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)తో కలిసి పాల్గొన్న జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య మరియు వివిధ హోదాలో ఉన్న కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ క్లబ్‌లో

# ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్

## ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఏసీఏ నూతన కమిటీ ఎన్నిక..

సూర్య ప్రతినిధి - విజయవాడ

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్ శనివారం తాడేపల్లిలోని విజయవాడ క్లబ్ లో జరిగింది. ఈ సమావేశంలో 2025-2028 కి సంబంధించి ఏసీఏ నూతన కమిటీ ఎన్నికైంది. అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధికార ప్రతినిధి మ్యాన్ చో ఫేరారే గౌరవ అధ్యక్షుడుగా ఏసీఏ జనరల్ బాడీ మీటింగ్ కి వ్యవహరించారు. ఈ సమావేశంలో ఏసీఏ మాజీ జాయింట్ సెక్రటరీ, ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు కూడా పాల్గొనడం జరిగింది. ఎలాంటి పోటీ లేకుండా నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా సాగింది. ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఏసీఏ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అలాగే సెక్రటరీగా రాజ్యసభ ఎంపీ సానా సతీస్ బాబు, కోశాధికారిగా దండమూడి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ గా బి. విజయ్ కుమార్, కౌన్సిలర్ గా దండు గౌర్ విష్ణు తేజ్ కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ పలు హోదాల్లో ఎన్నికైన సభ్యులకు ధృవీకర ణ పత్రాలు అందజేశారు. వైస్ ప్రెసి డెంట్ పదవికి బండారు నరసింహారా వు ఒక్కరే నామినేషన్ వేయగా, అధికార ధ్రువీకరణ పత్రాలు వివరా లు సరిగ్గా లేక పోవటం వల్ల నామి నేషన్ తిరస్కరణకు గురైందని ఎన్ని కల రిటర్నింగ్ అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ తెలిపారు. అలాగే ఆ పదవికి త్వరగా ఎన్నికలు నిర్వహించుకోవాలని సూచించారు. వచ్చే నెల నిర్వహిస్తామని సెక్రటరీ సానా సతీష్ బాబు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ జిల్లా క్రికెట్ సంఘాల సభ్యులు, అథరైజ్డ్ క్లబ్ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



## త్రాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

**రెండు లక్షల వ్యయంతో వాటర్ ప్లాంట్ నిర్మించిన పూర్వ విద్యార్థి**



**సూర్య ప్రతినిధి - హనుమాన్ జంక్షన్**

పెదపాడు మండలం అప్పనవీడు జిల్లా హైస్కూల్లో త్రాగునీరు లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని పాఠశాల పూర్వ విద్యార్థి మొవ్వా రమేష్ రంగలక్ష్మి దంపతులు రెండు లక్షల రూపాయల వ్యయంతో వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశారు. త్వరలో దాతలచే ప్రారంభించనున్నట్లు అదే రోజు దాత మొవ్వా రమేష్ చే గత సంవత్సరం పదవ తరగతిలో ప్రధమ, ద్వితీయ, తృతీయ స్థానములు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి కూడా అందించనున్నట్లు పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మారుబోయిన కోటేశ్వర రావు తో పాటు ప్రధానోపాధ్యాయిని తోట పుష్పావతి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఉపాధ్యాయేతర సిబ్బంది దాతలకు ధన్యవాదములు తెలియజేశారు.

## గన్నవరం మార్కెట్ కమిటీ చైర్మన్ గూడవల్లిని అభినందించిన బిజెపి నాయకులు

**సూర్య ప్రతినిధి - హనుమాన్ జంక్షన్**

గన్నవరం నియోజకవర్గం కూటమి ప్రభుత్వంలో గన్నవరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన గూడవల్లి నరసింహారావు (నరసయ్య) ని కృష్ణా జిల్లా బీజేపీ కార్యదర్శి సింగవరపు భాస్కర్ గణేష్ ,కృష్ణా జిల్లా యువ మోర్చా ప్రధాన కార్యదర్శి యిర్రింకి నాగ శ్రీనివాస్ నాయుడు ,బీజేపీ విజయవాడ రూరల్ మండలం బత్తుల



చిన్నారావు శనివారం శుభాకాంక్షలు తెలియజేశారు.

## పశ్చిమ ఇబ్రహీంపట్నంలో ఏసీపీ దుర్గారావు పర్యటన
**-ప్రశాంతంగా ముగిసిన ఉట్టికొట్టే కార్యక్రమం**



**సూర్య ప్రతినిధి - ఇబ్రహీంపట్నం**

పశ్చిమ ఇబ్రహీంపట్నంలో పశ్చిమ డివిజన్ ఏసీపీ దుర్గారావు పర్యటన చేశారు. కృష్ణాష్టమి సందర్భంగా ఉట్టి కొట్టే ప్రాంతంలో శాంతి భద్రతలను పరిశీలన చేశారు. గతంలో రెండు సామాజిక వర్గాల మధ్య విభేదాలు ఉన్న నేపథ్యంలో ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎటువంటి ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉట్టికొట్టే కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది.

## ఎందరో మహానుభావుల త్యాగ ఫలితమే దేశానికి స్వాతంత్రం
**-ఎల్ఐసి డివిజనల్ సీనియర్ మేనేజర్ డా.సుధాకర్ బాబు**



**సూర్య ప్రతినిధి-మచిలీపట్నం**

ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగా మన దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, దానిని మనం సఫలం చేసుకోవాలని ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ డా.సుధాకర బాబు అన్నారు.79 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మచిలీపట్నం ఎల్ఐసి డివిజనల్ కార్యాలయంలో సీనియర్ డివిజనల్ మేనేజర్ డా. సుధాకర బాబు జాతీయ జెండా ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జాతీయ జెండాను గౌరవించవలసిన అవశ్యకత ఎంతైనా ఉన్నదని చెప్పారు. కుల, మతాలకు, ప్రాంతీయ తత్వాలకు అతీతంగా దేశమంతా కలిసి కట్టుగా జరుపుకునే పండుగ స్వాతంత్ర్యదినోత్సవం అన్నారు.ఈ కార్యక్రమంలో గుంటూరు మరియు కృష్ణ జిల్లాలకు చెందిన 24 బ్రాంచీ లకు చెందిన ఎల్ఐసి అధికారులు, సిబ్బంది, ఎల్ఐసి ఏజెంట్లు పాల్గొన్నారు.

**శ్రీ రాధాకృష్ణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో**
## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**సూర్య ప్రతినిధి - విజయవాడ**



శ్రీ రాధాకృష్ణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సోమవారం స్థానిక రామవరప్పాడులో 32వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు, రామవరప్పాడు గ్రామ సర్పంచ్ వరి శ్రీదేవి మీడియాతో మాట్లాడుతూ గత 31 సంవత్సరాల నుండి దిన దిన ప్రవర్ధమానం అవుతూ ఇప్పుడు 32 వ సంవత్సరం ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా జరుపుతున్నామని, సుమారు ఈ సంవత్సరం 10 వేల మందికి పైగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించామని అలాగే ఈరోజు సాయం త్రం ఉట్టికొట్టే ఉత్సవ కార్యక్రమాన్ని కూడా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పోలీసు వారు మున్సిపల్ సిబ్బంది మరియు అనేకమంది సహకారంతో విజయవంతంగా నిర్వహించడం జరిగింది అని శ్రీదేవి అన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరూ శ్రీకృష్ణ భగవానుడు ఆశీస్సులు అందుకొని సకల ఆయురారోగ్యాలతో ధర్మబద్ధంగా జీవించాలని శ్రీదేవి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ప్రజాప్రతినిధులు, నాయకులు, నగర ప్రముఖులు, యాదవ సంఘం నాయకులు, స్థానికులు, స్థానిక పెద్దలు, అభిమానులు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు హాజరయ్యారు.

**యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో**
## శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



**సూర్య ప్రతినిధి - విజయవాడ**

సోమవారం స్థానిక రామవరప్పాడులో యామనేని రామస్వామి వీధిలో 23వ కృష్ణాష్టమి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా యాదవ సంఘం అధ్యక్షులు కొంగన రవికుమార్ మాట్లాడుతూ ఈ ఉత్సవాలు 22 సంవత్సరాలు నుంచి చేస్తున్నామని, రామవరప్పాడు, యామనేని రామస్వామి వీధిలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి స్థానిక పెద్దలు, సంఘ నాయకులు ఎంతో కృషి చేశారని వారికి నేను అభినందనలు తెలియజేస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమములో ముఖ్య అతిథులను పెద్దలను, నాయకులను మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. ఈరోజు సాయంత్రం ఉట్టి కొట్టే ఉత్సవ కార్యక్రమం జరుగుతుందని అని తెలిపారు.

తదనంతరం వక్తలు, యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ కృష్ణ జన్మాష్టమి వేడుకలు 23 వ వార్షికోత్సవం ఇంత ఘనంగా జరుగుతున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఆ శ్రీకృష్ణుడు ప్రజలకు భోగభాగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలు ఇవ్వాలని , మనస్ఫూర్తిగా కోరుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో మెండే వెంకటేష్, తుపాకుల స్వామి, సుంకర కోటేశ్వరరావు, కృష్ణం వెంకట సుబ్బారావు, యాదవ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# నిధుల్లేక..... పనులు సాగక.... గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తం

- వీధి దీపాల నిర్వహణకు నిధులు నిల్
- పారిశుధ్యం మెరుగుపడాలని గ్రామస్తుల ఆవేదన
- విడుదల కానీ15 వ ఆర్థిక సంఘ నిధులు




**సూర్య రిపోర్టర్ - పెడన**

వర్షాకాల ప్రభావంతో గ్రామాల్లో నీరు నిల్వ ఉండటంతో దోమలు అధికమై రోగాల బారిన పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాధులు ముసురుతున్న వేళ గ్రామాల్లో పరిస్థితులు మెరుగుపరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నప్పటికీ గ్రామపంచాయతీలో నిధుల కొరత మాత్రం వేధిస్తోంది. ఇంటి పన్ను వసూళ్లు అంతంత మాత్రంగా ఉన్నందున ప్రభుత్వ గ్రాంట్ల కోసం ఎదురు చూడక తప్పడం లేదంటున్నారు అటు గ్రామ సర్పంచులు ఇటు గ్రామ కార్యదర్శులు.

**కనీస అవసరాలకు కరువు**

తాగునీటి పథకాల మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణకు కూడా నిధులు లేని పరిస్థితి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమై ఐదు నెలల గడుస్తున్న ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదు. దీంతో పంచాయతీల పాలకవర్గాలు ఆర్థిక వెసులుబాటు లేక ఇబ్బందులు పడుతున్నారు. పౌడర్ బ్లీచింగ్, నీటిలో కలిపే బ్లీచింగ్ కొనేందుకు కూడా నిధులు తక్కువ ఉండటంతో కొన్ని గ్రామాల్లో సర్పంచుల తమ సొంత ఖర్చులతో బ్లీచింగ్ కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడింది. మరో వైపు వచ్చే ఏడాది ఏప్రిల్ 3 న పంచాయతీ పాలకవర్గాల గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో కొందరు సర్పంచులు బిల్లులు భయంతో ముందస్తుగా సొంత డబ్బులు ఖర్చు చేసి పనులు చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు.

**బకాయిల కోసం ఎదురుచూపులు**

పెడన మండల పరిధిలో మొత్తం 24 పంచాయతీల్లో మైనర్ పంచాయతీలే ఎక్కువగా ఉన్నాయి. క్లాత్ మిత్ర పేరుతో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కూడా వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లె పండుగ పేరుతో నిర్మించిన సిసి రోడ్లు మినహా చెప్పుకోదగ్గ పనులు ఏమీ లేవు.

15వ ఆర్థిక సంఘం నిధులు ఏడాదికి రెండు విడతలు రావాల్సి ఉండగా గత ఆర్థిక సంవత్సరంలో రెండో భాగం ఇప్పటివరకు అందలేదని సర్పంచులు వాపోతున్నారు. ఈ విషయంపై డిప్యూటీ ఎంపీడీవో ఎం నాగిరెడ్డిని వివరణ కోరగా గత సంవత్సరం ఒక విడత 15 వ ఆర్థిక సంఘం నిధులు రావాల్సి ఉందని ఆ నిధులు విడుదల అయిన వెంటనే గ్రామల్లో అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో జరిగేలా చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ఎంపీడీఓ తెలిపారు.

# గుడివాడ అభివృద్ధికి సహకరించండి

- మంత్రి నారా లోకేష్ కు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము విజ్ఞప్తి
- గుడివాడ అభివృద్ధి పనుల అంచనాలను నివేదికలను మంత్రి లోకేష్‌కు అందించిన ఎమ్మెల్యే రాములి
- నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చిన లోకేష్.

**సూర్య ప్రతినిధి - గుడివాడ**

గుడివాడ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఏపీ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము విజ్ఞప్తి చేశారు. ఉండవల్లిలోని ఆయన స్వగృహంలో మంత్రి నారా లోకేష్ ను శనివారం సాయంత్రం కలిసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై రూపొందించిన అంచనాల నివేదికలు మరియు పలు సమస్యల వినతులను అందచేశారు.ఎమ్మెల్యే రాము విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్, అభివృద్ధి పనులకు నిధుల మంజూరు,సమస్యల నివారణకు చర్యలు తీసుకుంటానని మంత్రి లోకేష్ ఎమ్మెల్యే రాముకు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే రాముతో పాటు గుడివాడ ఏఎన్ఆర్ కళాశాల కమిటీ సభ్యులు కళాశాల వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొనాల్సిందిగా లోకేష్ ఆహ్వానించగా.... హాజరవుతానని కమిటీ సభ్యులకు మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు. లోకేష్‌కు అందించిన ముఖ్య ప్రతిపాదనల వివరాలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మీడియాకు తెలియజేశారు... గుడ్లవల్లేరు మండలంలోని డోకిపర్రు రహదారి.. నందివాడలోని పోలుకొండ రోడ్డు, కంకిపాడు రోడ్డు, మోటూరు - రుద్రపాక రోడ్ల అభివృద్ధి పనులపై



రూపొందించిన అంచనాల నివేదికలను మంత్రి లోకేష్‌కు అందించామన్నారు. అత్యవసర సమస్యగా భావించి గుడివాడ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి సహకరించాలని, నియోజకవర్గంలోని 98 పాఠశాలల భవనాలకు అత్యవసరం మరమ్మత్తులు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు ఎమ్మెల్యే రాము చెప్పారు.

అభివృద్ధి పనులతో పాటుగా కే.ఈ డివిజన్ ఆఫీస్ గుడివాడ మార్చడం, గుడివాడ ఆర్టీవో కార్యాలయానికి ఫిట్నెస్ సెంటర్ ఏర్పాటు, ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశానన్నారు. 1994 లో స్థాపించిన ప్రభుత్వ ఐటిఐ కళాశాలను అప్ గ్రేడ్ చేయడం, గుడ్లవల్లేరు మండలంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు, నియోజకవర్గంలో 77 సచివాలయ కార్యదర్శుల స్థానాలు భర్తీ చేయడంపై వినతి పత్రాలు అందించామన్నారు. తన ప్రతిపాదనలపై మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించారని... ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యలు పరిష్కరించడమే కాకుండా, అభివృద్ధి పనుల నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు లోకేష్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు. అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్న మంత్రి లోకేష్‌కు.... గుడివాడ ప్రజానీకం తరఫున ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ధన్యవాదాలు తెలిపారు. గుడివాడ అభివృద్ధి లక్ష్యంగా రానున్న రోజుల్లో మరింత ముందుకు సాగుతానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము పునరుద్ఘాటించారు.

## ఐనాల రుక్మిణీ కళ్యాణి కి ప్రశంసాపత్రం
**-హనుమాన్ జంక్షన్ విద్యుత్ శాఖ ఏ ఇ**



**సూర్య ప్రతినిధి - హనుమాన్ జంక్షన్**

హనుమాన్ జంక్షన్ విద్యుత్ శాఖ లో ఏఇ గా పనిచేస్తున్న ఐనాల రుక్మిణీ కళ్యాణి కి 79 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఎలక్ట్రిక్రికల్ సూపర్ డెంట్ ఇంజినీర్ ఎం.సత్యానందం చేతుల మీదుగా మచిలీపట్నం లో జరిగిన కార్యక్రమంలో కళ్యాణి కి అందజేశారు. వినియోగదారులకు వినూత్నమైన అందించినందుకు ఈ ప్రశంసాపత్రం అందుకున్నారు. విద్యుత్ శాఖ లో చేరిన 18 సంవత్సరాల కాలంలో ఇప్పటి వరకు 4 సార్లు అవార్డులు ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు కళ్యాణి తెలిపారు. అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయని ఆమె అన్నారు. కాగా హనుమాన్ జంక్షన్ సబ్ డివిజన్ ఏ డి ఇ, బొజ్జగాని శ్రీనివాస్ సబ్ డివిజన్ స్థాయిలో ఉత్తమ సేవలు అందించి ప్రత్యేక అవార్డ్ అందుకున్నారు. విద్యుత్ కార్యాలయంలో లైన్ ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్న మధువతు నాగ మల్లేశ్వరరావు వినూత్న రీతిలో సేవలు అందించి అధికారుల నుండి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

## టిడిపి నేత ఆళ్ల శ్రీకాంత్ విద్యార్థులకు చేయూత



**సూర్య ప్రతినిధి - ఉయ్యూరు**

విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని టిడిపి రైతు విభాగం నేత ఆళ్ల శ్రీకాంత్ అన్నారు. మండలం లోని కాటూరి జిల్లా పరిషత్ పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు తమ వంతు సహాయంగా దుస్తులను అందజేశారు.సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమాజసేవలో ముందుకు సాగాలన్నారు. విద్యార్థి దేశం నుంచి సేవా పట్ల అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడలను రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించలన్నారు. విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలను ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులకు అందించే అన్ని రకాల సేవలు వారి భవిష్యత్తుకు ఎంతగానో దోహదపడతాయని వివరించారు ఈ క్రమంలోనే తమ వంతు సహాయంగా ఆపదలో ఉన్న విద్యార్థులకు సాయం అందిస్తున్నామని తెలిపారు కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పలువురు పాల్గొన్నారు.

# అమరావతిలో రీజనల్ సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

**సుప్రీంకోర్టు న్యాయవాది కె.రవిశంకర్**

**సూర్య ప్రతినిధి - విజయవాడ**

నూతన రాజధాని అమరావతిలో రీజనల్ సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ మెంబర్, సుప్రీంకోర్టు న్యాయవాది కునుకు రవిశంకర్ డిమాండ్ చేశారు. శనివారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ దక్షిణ భారత ప్రజలకు సుప్రీంకోర్టు సేవలు అందుబాటులో ఉండేలా అమరావతిలో శాశ్వత సుప్రీంకోర్టు బెంచ్ అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. సమావేశ కక్షిదారులు సుప్రీంకోర్టుకు వెళ్లాలంటే అధిక వ్యయ ప్రయాసలకు లోను కావలసిన పరిస్థితి ఉందన్నారు. ఢిల్లీలో మాత్రమే సుప్రీంకోర్టు ఉండటంవల్ల దక్షిణాది రాష్ట్రాల ప్రజలు అందరి సుప్రీంకోర్టుకు వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాలలో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎంతో కాలంగా ఉందన్నారు. అమరావతి రాజధానిలో కాని విజయవాడలో గాని సుప్రీంకోర్టు బెంచ్



ఏర్పాటు చేయాలన్నారు. బెంచ్ ఏర్పాటు చేయడం వల్ల అమరావతి రాజధాని అభివృద్ధి చెందటమే కాకుండా ఆర్థికంగా ఆదాయ వనరులు కూడా పెరుగుతాయని, దక్షిణాది రాష్ట్రాల వారికి సుప్రీంకోర్టు బెంచ్ అందుబాటులో ఉంటుందన్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ ఎం.రాజశేఖర్, వి.బి శంకర్ రావు, టీ.ఎస్ విజయ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జయంతిపురం గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)





**సూర్య ప్రతినిధి-జగ్గయ్యపేట**

జగ్గయ్యపేట మండలం, జయంతిపురం గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరదనీరు ఇళ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య వెంటనే గ్రామానికి వెళ్లి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు.గ్రామంలో వరద నీరు ప్రవాహం ఎలా వస్తోందో స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే గారు, తూములు పెద్దవి చేసి, పూడిక తీసే పనులు చేపట్టి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత రెవిన్యూ అధికారులను ఆదేశించారు.అలాగే వరి తగత్తిన రైతుల సమస్యలను పరిష్కరించేలా తక్షణ చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గారు హామీ ఇచ్చారు.

**పలు శుభకార్యాలకు హాజరైన శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)**



**సూర్య ప్రతినిధి-జగ్గయ్యపేట**

జగ్గయ్యపేట పట్టణం 25వ వార్డు క్రిస్టియన్ పేట కు చెందిన కొండా ఆనందరావు, రమణ గార్ల దంపతుల కుమార్తె వివాహ ప్రధానం కార్యక్రమంలో పాల్గొని నూతన వధువును అక్షింతలు వేసి దీవించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అదేవిధంగా క్రిస్టియన్ పేట కు చెందిన లక్కమాల వెంకటేశ్వర్లు (లేటు), నాగమ్మ గార్ల దంపతుల కుమార్తె శ్రావణి వివాహ ప్రధానం కార్యక్రమంలో పాల్గొని నూతన వధువుకు అక్షింతలు వేసి దీవించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య).ఈ కార్యక్రమంలో 25 వ వార్డు కౌన్సిలర్ కర్ల జోజి, శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఓబీసీలకు ఆరాధ్యుడు గౌతు లచ్చన్న

**పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర**





**సూర్య ప్రతినిధి -పార్వతీపురం**

స్వర్గీయ గౌతు లచ్చన్న ఓబీసీల హక్కులు కోసం ఎన్నో పోరాటాలు చేసారని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర పేర్కొన్నారు. గౌతు లచ్చన్న 116 వ జయంతి సందర్భంగా పార్వతీపురం కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయ్ చంద్ర మాట్లాడుతూ ఓబీసీలకు రిజర్వేషన్లు సాదించడం కోసం కేంద్ర నాయకులతో కలిసి పోరాటం చేసి విజయం సాదించారని తెలిపారు. నేడు ఓబీసీలు అనుభవిస్తున్న హక్కులు గౌతు లచ్చయ్య పోరాటం ద్వారానే వచ్చాయన్నారు. బీసీలు అంటే వెనుకబడిన తరగతులు కాదని, దేశంలోనే ఉన్నత వర్గాలుగా ఉండాలని లచ్చన్న ఆకాంక్షించేవారని ఎమ్మెల్యే విజయ్ చంద్ర తెలిపారు. అలాగే స్వాతంత్ర్యం కోసం సుభాష్ భగత్ సింగ్ నాయకత్వంలో పోరాటం చేసి జైలుకు వెల్లారని గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# అంటు వ్యాధులు సోకకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేశాం - డాక్టర్ నేహా

**సూర్య ప్రతినిధి-తెనాలి**

వాతావరణంలో వచ్చిన మార్పులు వలన ముందస్తు జాగ్రత్తగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు మున్నంగి పీ.హెచ్.సి వైద్యులు డాక్టర్ నేహా గంటా అధ్యర్యంలో ప్రతి గ్రామములో వైద్య శిబిరాలు గత మూడు రోజుల నూండి ఏర్పాటు చేయడం జరిగినదని,ప్రతి గ్రామములో ఏ.యన్.యం. ఒకచోట,యం.యల్.హెచ్.పి.ఒకచోట తప్పనిసరిగా విడివిడిగా ఆరోగ్య శిబిరాలను ఏర్పాటుచేశామని శనివారం డాక్టర్ నేహా తెలిపింది. ఈ సందర్బంగా డాక్టర్ మట్లాడుతూ డాక్టర్ సూచనల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, అంతేకాకుండా ప్రతి ఆషా వర్కర్ వారి వెయ్యి మంది జనాభా పట్ల అప్రమత్తంగా ఉండి ఎటువంటి చిన్న చిన్న వ్యాధులు ప్రబలినా వాతావరణంలో మార్పులు వల్ల వచ్చేటటువంటి వ్యాధుల ను నివారించేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోమని ఆరోగ్య సిబ్బంది అందరికీ తెలియజేయాలని డాక్టర్ నేహా తెలిపారు.జ్వరములు, జలుబు, దగ్గులు, విరోచనాలు ఇంకా ఏదైనా కేసులు వస్తే దగ్గరలో ఉన్నటు వంటి వైద్య శిబిరాలకు ప్రజలను తరలించి చికిత్స అందించాలని నేహా తెలిపారు. అంతే కాకుండా మీ ప్రాంతంలో ఉన్నటువంటి గర్భవతులను,బాలింతలను మరియు బెడ్రెడిన్ కేసులను తప్పనిసరిగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఆరోగ్య సిబ్బంది అందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని పీ.హెచ్.సి డాక్టర్ నేహా



గంటా పీ.హెచ్. సి సిబ్బందికి ఆదేశించారు.

## కే-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

-చూపరులను ఆకట్టుకున్న చిన్నారుల శ్రీకృష్ణ మరియు గోపికల వేషధారణ పాత్రలు



**సూర్య బ్యూరో -పల్నాడు జిల్లా**

నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామ పరిధిలో గల కే-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్లో శనివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్బంగా పలువురు చిన్నారులు బాలకృష్ణుడుగోపికల వేషధారణలో పాఠశాలకు వచ్చి కనుల విందుగా అలరించారు. శ్రీకృష్ణ పరమాత్మ గీతాలకు నాట్యం చేశారు. పిల్లలు కృష్ణుడి గొప్పతనాన్ని గురించి పెద్దలు ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్బంగా స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కృష్ణాష్టమి జరుపుకునే విధానం గురించి తెలియ చేసి పిల్లలకు కృష్ణుడి జీవితం నుంచి నేర్చుకోవలసిన విషయాలను తెలియచేశారు. పిల్లలు అందరు ఎంతో ఉత్సాహంతో ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంతో కోలాహలంగా జరిగిన ఈవేడుకలో స్కూల్ డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ బర్నబాస్, క్యాంపస్ ఇంచార్జి కోట బాపూజీ, మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కొండవీటి వాగులో నీటి ప్రవాహం వేగంగా జరగాలి



**సూర్య ప్రతినిధి - తుళ్లూరు**

కొండవీటి వాగులో పై ఎత్తు నుంచి వస్తున్న నీటిని కృష్ణానదిలోని వేగంగా పంపిచే పనులను ముమ్మరంగా చేపట్టాలని అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) ఛైర్‌పర్సన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి డి.లక్ష్మీపార్థసారథి వారు అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఈ-10, ఈ -14 రోడ్ల మధ్య ఉన్న 5 కల్వర్టులను తెరచి నీటిని దిగువకు పంపిస్తున్న పనులను ఆమె శనివారం పరిశీలించారు. కురగల్లు వద్ద ఎన్-6(పశ్చిమ బైపాస్) వద్ద ఉన్న 3 స్పాన్లలో ఉన్న మట్టి, దాని బ్రిడ్జి కింద ఉన్న అడ్డుకట్టలను వెంటనే తొలగిచేందుకు ఎక్స్‌వేటర్లను ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయాలని నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులను ఆదేశించారు. కొండవీటి వాగులో నీటిని కృష్ణానదిలోని పంపించే ప్రక్రియ శరవేగంగా జరిపేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన మేరకు యంత్రాలను ఏర్పాటు చేయాలని ఏడీసీ ఇంజినీరింగ్ అధికారును ఖచ్చితమైన ఆదేశాలు జారీచేశారు.ఈ పర్యటనలో ఏడీసీ చీఫ్ ఇంజినీర్లు ఆర్.గోపాలకృష్ణారెడ్డి, సీహెచ్ ధనుంజయ, ఎస్‌ఈ నరసింహమూర్తి, ఈఈలు కె.బసవేశ్వరరావు, వైకుంఠరావులు ఉన్నారు.

### అవార్డు అందుకున్న రెంటచింతల విద్యుత్ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్

**సూర్య ప్రతినిధి- గురజాల**



మాచర్ల విద్యుత్ శాఖ పరిధి రెంటచింతల సెక్షన్ బిల్లింగ్ జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తూ, విధుల నిర్వహణ, అధికారులతో మంచి ప్రవర్తనతో పాటు అందుబాటులో ఉంటూ అధికారులకు సమాచారం అందిస్తూ ప్రతిభ కనబరిచిన జొన్నల అనిల్ కుమార్ రెడ్డి( జూనియర్ అసిస్టెంట్), విధుల నిర్వహణ, అధి కారులతో మంచి ప్రవర్తన, అధికారులకు సమాచారం అందిస్తూ ప్రతిభ కన పరిచాడు. శుక్రవారం స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రశంసా పత్రం ను అందుకున్నారు. ఈ మేరకు ఈఈ ఎన్. సింగయ్య, దాచేపల్లి డి ఈఈ తుమ్మల వీరేశ్వరరావు, పిడుగురాళ్ల ఏ ఏ ఓ పి. సందీప్ కుమార్, మాచర్ల ఈఆర్ఓ కార్యాలయం ఏ ఏ ఓ గిరి ముని చంద్రశేఖర్ లు అభినందనలు తెలిపారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ అనే బిరుదులు పొందిన ఏకైక వ్యక్తి డాక్టర్ గౌతు లచ్చన్న

- పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు
- డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు

**సూర్య బ్యూరో - పల్నాడు జిల్లా**



భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి డాక్టర్ గౌతు లచ్చన్న అని పలనాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. పల్నాడు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ గౌతు లచ్చన్న 1909వ సంవత్సరంలో శ్రీకాకుళం జిల్లా, సోంపేట మండలం, బారువా గ్రామంలో జన్మించారని చెప్పారు. వారి తల్లిదండ్రులకు డాక్టర్ గౌతు లచ్చన్న ఎనిమిదవ సంతానమన్నారు. డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న సాహసానికి, కార్యదక్షతకు మెచ్చి ప్రజలిచ్చిన కితాబే సర్దార్ అని పేర్కొన్నారు. . సర్దార్ గౌతు లచ్చన్న, వి.వి.గిరి, నేతాజి సుభాష్ చంద్రబోస్, జయంతి ధర్మతేజ మొదలగు అనేక మంది జాతీయ నాయకులతో కలిసి భారత దేశ స్వాతంత్ర్య పోరాటాలలో పాల్గొని అనేక పర్యాయాలు జైలుకు వెళ్లారని తెలిపారు. టంగుటూరి ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలరెడ్డి మంత్రి వర్గంలో మంత్రి పదవిని కూడ నిర్వహించిన లచ్చన్న మద్యపాన నిషేధం విషయంలో ప్రకాశం పంతులుతో విభేదించి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ప్రకాశం పంతులు ప్రభుత్వ పతనానికి కారణ భూతుడయ్యారని చెప్పారు. తెలుగు వారి రాజకీయ జీవనములో స్వాతంత్ర్యానికి ముందు, తరువాత ప్రభావితము చేసిన నాయకుడు లచ్చన్న అని కొనియాడారు. కేవలం స్కూల్ విద్యకే పరిమితమైనా, ఆచార్య గోగినేని రంగా ప్రథమ అనుచరునిగా తెలుగులో మంచి ఉపన్యాసకునిగా రాజాజీ ఉపన్యాసాల అనువాదకునిగా, చరిత్ర ముద్ర వేయించుకున్న బడుగు వర్గ పోరాట జీవి లచ్చన్న అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ (పరిపాలన) జే.వి సంతోష్, ఏ.అర్ డీఎస్పీ మహాత్మా గాంధీ రెడ్డి, ఎంటి ఆర్.ఐ యస్. కృష్ణ, ఏ.యన్.యస్ ఆర్.ఐ యువరాజ్, పోలీస్ అధికారులు మరియు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ వీర రతన్ అవార్డు అందుకున్న డాక్టర్ స్వర్ణ నాగరాజు

- 79వ స్వతంత్ర దినోత్సవం నాడు మా ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడైన నాగరాజుకు అరుదైన గౌరవం
- జాతీయ వీర రతన్ అవార్డు డాక్టర్ నాగరాజుని అభినందించిన మంత్రి నాదెండ్ల మనోహర్

**సూర్య ప్రతినిధి -నరసరావుపేట**



ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతుల మిన్న అంటూ ఆకలితో ఉన్న యాచకులకి ప్రతిరోజు నిత్యం అన్నదాన కార్యక్రమాలు చేస్తున్నటువంటి నరసరావుపేట పట్టణానికి చెందిన మా ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ స్వర్ణ నాగరాజుకి 79వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని త్రేతాయుగ ఫౌండేషన్ వారు డాక్టర్ స్వర్ణ నాగరాజు చేస్తున్న సేవలను గుర్తించి జాతీయ వీర రతన్ అవార్డును ప్రధానం చేశారు. స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఢిల్లీలో జరుగుతున్న అవార్డుల ప్రధాన ఉత్సవంలో ఢిల్లీ నుంచి నరసరావుపేటకు అవార్డులను డాక్టర్ నాగరాజుకు పర్చువల్ గా అందజేశారు. స్వతంత్ర దినోత్సవ వేడుకలకు నరసరావుపేటకు విచ్చేసిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ యొక్క అవార్డును డాక్టర్ స్వర్ణ నాగరాజు చేస్తున్న సేవా కార్యక్రమాలను తెలుసుకొని అభినందించారు. భవిష్యత్తులో ఇంకా మరెన్నో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న డాక్టర్ స్వర్ణ నాగరాజు మాట్లాడుతూ స్వతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఈ యొక్క అవార్డు అందుకోవటం చాలా సంతోషంగా ఉం దని ఇంతటి గొప్ప అవకాశాన్ని లభించిన నాకు నేను చేస్తున్న సేవా కార్యక్రమాలు ద్వారా ఈ యొక్క గౌరవం లభించిందని తెలియజేసారు. రాబోవు రోజుల్లో కూడా మా ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తానని ఈ యొక్క సేవా కార్యక్రమాలు చేయడానికి సహకరిస్తున్న మా ఛారిటబుల్ ట్రస్టు సభ్యులకు మరియు దాతలకు నా వెన్నుదన్నుండి సహాయ సహకారాలు ఇస్తున్న ప్రతి ఒక్కరికి ఈ యొక్క గౌరవం వారికి అంకితం చేస్తున్నానని దాతల సహకారం మరియు నాతోటి మిత్రుల సహకారంతోనే ఈ యొక్క అవార్డు లభించిందని చెప్పారు. రాబోవు రోజుల్లో కూడా ఈ యొక్క సేవా కార్యక్రమాలు మరింత ఉన్నతంగా చేస్తామని చెప్పారు. అవార్డును అందించినటువంటి త్రేతయుగ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మరియు సహాయ వ్యవస్థాపకులు వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని డాక్టర్ స్వర్ణ నాగరాజు పేర్కొన్నారు.

## చేయి చేయి కలుపుదాం.. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

-వెదుళ్ళపల్లి ఎస్సై భాగ్యరాజ్



**సూర్య ప్రతినిధి-బాపట్ల జిల్లా బ్యూరో**

బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు గంజాయి, మత్తు పదార్థ రహిత సమాజం కోసం డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమాన్ని బాపట్ల నియోజకవర్గం వెదులపల్లి సెంటర్ నందు యువకుల మధ్య వెదురుపల్లి ఎస్ఐ భాగ్యరాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి మరియు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రచారం నిర్వహించడంతో పాటు అవగాహన సదస్సు నిర్వహించారు. యువత మత్తుకు బానిసగా మారి తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని అన్నారు. మత్తు పదార్థాలను వినియోగించడం, సరఫరా చేయడం చట్టరీత్య నేరమని వారు పేర్కొన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలను వినియోగించినట్లు దృష్టికి వస్తే ప్రజలు వెంటనే తమకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా ఎస్ఐ కోరారు.

## గ్రామీణ ప్రాంతాలలో ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా మంచి ప్రయోజనం కలుగుతుంది


- వీరవట్నం గ్రామంలో జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు
- ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**సూర్య ప్రతినిధి - నరసరావుపేట**



గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు కంటి వైద్య శిబిరాల ద్వారా మంచి ప్రయోజనం కలుగుతుందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలియజేశారు. రొంపిచర్ల మండలం వీరపట్నం గ్రామంలో ఎల్.వి ప్రసాద్ ఐ కేర్ ఆస్పత్రి సహకారంతో తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి చల్లా సుబ్బారావు ఆధ్వర్యంలో శనివారం సాగునీటి వినియోగదారుల సంఘ భవనంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ప్రారంభించారు. ఈ కంటి వైద్య శిబిరంలో 220 మంది రోగులకు ఎల్వీ ప్రసాద్ కంటి వైద్య ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 42 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించి వారికి త్వరలో ఉచితంగా కంటి శుక్ల ఆపరేషన్లు చేస్తారని చల్లా సుబ్బారావు తెలిపారు. అదేవిదంగా చల్లా సుబ్బారావు ఆర్థిక సహకారంతో 57 మందికి ఉచితంగా కళ్ళజోడు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ బత్తుల మల్లేష్, డాక్టర్ ప్రసాద్ మునీర్, డాక్టర్ హరీష్ బాబు, డాక్టర్ రమ్యలు పాల్గొని వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మాలంపాటి ఏడుకొండలు, నీటి సంఘాల అధ్యక్షుడు చిరుమామిళ్ల మల్లికార్జునరావు, నాయకులు వల్లిపు ఆంజనేయులు, గొట్టిపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే




**సూర్య ప్రతినిధి-వేటపాలెం**

మండల పరిధిలోని దేశాయిపేట నీలకంఠాపురం అనాధ వృద్ధాశ్రమం 30 వ వార్షికోత్సవం ఆదరింపు సత్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాల కొండయ్య. అనాధ వృద్ధాశ్రమం కమిటీ సభ్యులను అభినందించారు. వ్యవస్థాపకులు సత్రం మల్లేశ్వరరావు , ప్రెసిడెంట్ గుత్తి విశ్వేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహార పంపిణీ చేశారు పారిశుధ్య కార్మికులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్ ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత తెలుగుదేశం పార్టీ స్టేట్ సెక్రెటరీ నాసిక వీరభద్రయ్య కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కోలాహలంగా అన్నదాత సుఖీభవ విజయోత్సవ ట్రాక్టర్ల ర్యాలీ




**సూర్య ప్రతినిధి - ముండ్లమూరు**

దర్శిలో తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతన్నల విజయోత్సవ ట్రాక్టర్ల ర్యాలీ పండుగల సాగింది. ఎక్కడ చూసినా పసుపు జెండాలు రెపరెపలాడుతూ రైతన్నల రథాలు ముండ్లమూరు మండలం పులిపాడు వద్దనుండి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వరకు కిటకిటలాడాయి. పచ్చని వాతావరణంలో పల్లెల నుండి రైతులు కదంతొక్కారు, దర్శి టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి జండా ఊపి రైతుల విజయోత్సవ ట్రాక్టర్ల ర్యాలీని ప్రారంభించారు. అంతేకాక డాక్టర్ లక్ష్మి లలిత సాగర్ లు ట్రాక్టర్ నడుపుతూ రైతన్నలను మరింత ఉత్సాహపరిచారు. దర్శి గడియార స్తంభం కూడలిలో డాక్టర్ లక్ష్మి ఎడ్ల బండి ఎక్కి కాడెద్దుల బండిని నడపటం ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దర్శి పట్టణంలో నేడు జరిగిన రైతుల విజయోత్సవ ర్యాలీ ఎంతో ఉత్సాభరిత వాతావరణం లో కోలాహలంగా సాగింది. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుండి రైతన్నలు స్వచ్ఛందంగా వందలాది ట్రాక్టర్లతో విజయోత్సవ ర్యాలీలో పాల్గొని ర్యాలీని మరింత విజయవంతం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి విజయోత్సవ ర్యాలీ గురించి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమన్నారు. రైతుల అభ్యున్నత కోసం సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని దర్శి మండలం తూర్పు వీరాయపాలెంలో ప్రారంభించి రైతుల ఎకౌంట్లలో నేరుగా అన్నదాత సుఖీభవ నగదు అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు పై దర్శి ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలకు దీటైన కౌంటర్ ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం లో రైతులకు జరిగిన అన్యాయాలపై మండిపడ్డారు. రైతు సమస్యల గురించి మాట్లాడాలంటే ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అసెంబ్లీకి వెళ్లి మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, నూతనంగా నియామకమైన సొసైటీ చైర్మన్లు, ఐదు మండలాల మండల పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, టిడిపి బిజెపి జనసేన నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

# ఉద్యమాల నిప్పుకణిక డా.సర్ధార్ గౌతు లచ్చన్న

- లచ్చన్న వ్యక్తిత్వం యావత్ జాతికి స్ఫూర్తిదాయకం
- రైతులకు, వెనుకబడిన వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేసుకున్న మహానుభావుడు
- సమాజంలో సమానత్వం నెలకొల్పడమే ఆయన ప్రధాన ఆశయం
- సర్ధార్ లచ్చన్న జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది
- లచ్చన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎం ఎం కొండయ్య



**సూర్య ప్రతినిధి-చీరాల**

సమాజంలో అసమానతలను తొలగించేందుకు డా. సర్ధార్ గౌతు లచ్చన్న చేసిన పోరాటాలు, రైతు బడుగు బలహీన వర్గాల కోసం చేసిన నిరసనలు, నిరాహార దీక్షలు, రైలురోకోలు ఆయన ధైర్యసాహసాలకు నిదర్శనమని, గౌతు లచ్చన్న పదవులు కోసం కాకుండా ప్రజల కోసం పోరాడారని అందుకే ఆయనను నేటికీ ఉద్యమాల నిప్పుకణికగా గౌరవంగా స్మరించు కుంటామని చీరాల ఎమ్మెల్యే ఎం ఎం కొండయ్య తెలిపారు. డా. సర్దార్ గౌతు లచ్చన్న 116 జయంతిని ఘనంగా నిర్వహించారు. చీరాలలో సర్దార్ గౌతు లచ్చన్న నూట పదహారవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు ఎం.ఎం.కొండయ్య మాట్లాడుతూ, సర్దార్ గౌతు లచ్చన్న శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం బారువా గ్రామంలో 1909 ఆగస్టు పదహారవ తేదీన జన్మించారు. భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత గౌతు లచ్చన్నకే సర్దార్ అను బిరుదు దక్కింది.బెజవాడ గోపాలరెడ్డి ప్రకాశం పంతులు మంత్రి వర్గంలో ఆయన మంత్రి వర్గాన్ని స్థాపించారు.ఆయన కుమారుడు శ్యామ్ సుందర్ శివాజీ ఎం ఎల్ ఏ గా చాలా కాలం పదవిలో ఉన్నారు. ప్రస్తుతం ఆయన మనవరాలు గౌతు శిరీష ఎం ఎల్ ఏ గా వున్నారు.సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను మనం జరుపుకోవడం మన అదృష్టం అని తెలిపారు. ఈ కార్యక్రమం లో మునిసిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు,ఏ ఎం సి చైర్మన్ కౌతావరపు జనార్ధన్ ,కౌన్సిలైర్ సూరగాని లక్ష్మీ కుమారి,సూరగాని నరసింహారావు, సూరగాని పిచ్చయ్య,సూరగాని హనుమంతరావు,వల్లెపు వేణు,చేబ్రోలు. శరత్ బాబు,బొమ్మిడి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఇక పాన్ 2.0

**సూర్య ప్రతినిధి–ముంబై**

పాన్.. ఇన్‌కం ట్యాక్స్ చెల్లింపులో ఒక అద్భుతం. పన్ను ఎగవేతదారులను పట్టించే ఆయుధం. అయితే ఇప్పటికీ చాలా మంది ఈ పాన్‌ను కూడా దుర్వినియోగం చేస్తున్నారు. పన్ను ఎగవేతకు అడ్డదారులు వెతుకుతున్నారు. పాన్‌లోని లోపాలు వారికి కలిసి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం 2026లో పాన్ 2.0ను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఇది పన్ను సంబంధిత సేవలను ఒకే డిజిటల్ వేదికపై ఏకీకృతం చేయడం ద్వారా పౌరులకు సౌలభ్యాన్ని అందించనుంది. క్యాబినెట్ కమిటీ ఆన్ ఎకనామిక్ అఫైర్స్ (సీసీఈఏ) ఆమోదంతో రూ.1,435 కోట్ల బడ్జెట్‌తో, ఐటీ దిగ్గజం ఎల్‌టీఐమైండ్‌ట్రీ ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసి నిర్వహించనుంది.ప్రస్తుతం, పాన్ (పర్మనెంట్ అకౌంట్ నంబర్), టీఏఎన్ (టాక్స్ డిడక్షన్ అండ్ కలెక్షన్ అకౌంట్ నంబర్) సేవలు ఇన్‌కమ్ టాక్స్ ఈ–ఫైలింగ్ పోర్టల్, యూటీఐఐటీఎస్‌ఎల్, ప్రొటీన్ (గతంలో ఎన్‌ఎస్‌డీఎల్) వంటి బహుళ వేదికలపై విస్తరించి ఉన్నాయి. పాన్ 2.0తో, ఈ సేవలన్నీ ఒకే కేంద్రీకృత డిజిటల్ ఇంటర్‌ఫేస్‌లో అందుబాటులోకి వస్తాయి. ఇది పౌరులకు సమయం ఆదా చేయడమే కాక, కాగితం లేని ప్రక్రియలను ప్రోత్సహిస్తుంది. పాన్ 2.0 వివిధ సంస్కరణలను తీసుకొస్తుంది, ఇవి ఖాతాదారుల అనుభవాన్ని మెరుగుపరుస్తాయి:ప్రస్తుతం పాన్ దరఖాస్తు, సవరణలు, ఆధార్ లింకింగ్, ధ్రువీకరణల కోసం బహుళ వెబ్‌సైట్‌లను ఉపయోగించాల్సి ఉంటుంది, ఇది సంక్లిష్టంగా ఉంటుంది.పాన్ 2.0లో అన్ని సేవలు ఒకే వేదికపై అందుబాటులో ఉంటాయి, ఇది వినియోగదారులకు సౌలభ్యాన్ని, సమయం ఆదాను అందిస్తుంది. ఇప్పటికే పాన్ కార్డు ఉన్నవారు కొత్త దరఖాస్తు చేయనవసరం లేదు. ప్రస్తుత పాన్ నంబర్ పాన్ 2.0 కింద పూర్తిగా చెల్లుబాటవుతుంది. ఇది ఖాతాదారులకు ఆర్థిక, సాంకేతిక భారాన్ని తగ్గిస్తుంది. పాన్ వివరాల సవరణలు ఉచితంగా ఉంటాయి. సవరించిన ఈ–పాన్ నేరుగా రిజిస్టర్డ్ ఈమెయిల్‌కు పంపబడుతుంది. ఇది వేగవంతమైన, ఖర్చు లేని సేవలను అందిస్తూ, డిజిటల్ పరివర్తనను ప్రోత్సహిస్తుంది.పాన్ కార్డులపై ఉన్న క్యూఆర్ కోడ్ కేంద్రీకృత డేటాబేస్ నుంచి తాజా సమాచారాన్ని ప్రదర్శిస్తుంది. గుర్తింపు ధ్రువీకరణ వేగవంతంగా, సురక్షితంగా జరుగుతుంది, మోసాలను తగ్గిస్తుంది. డిజిటల్ ఇండియా మిషన్‌లో భాగంగా, పాన్ బహుళ ప్రభుత్వ సేవలకు యూనివర్సల్ డిజిటల్ ఐడెంటిటీగా మారవచ్చు. ఇది పౌరులకు ఒకే గుర్తింపుతో బహుళ సేవలను యాక్సెస్ చేసే సౌలభ్యాన్ని అందిస్తుంది.ఇప్పటి పాన్ కార్డులు ఎటువంటి మార్పు లేకుండా చెల్లుబాటవుతాయి. క్యూఆర్ కోడ్ లేని కార్డుల ఉన్నవారు, ప్రస్తుత లేదా కొత్త వ్యవస్థలో రీప్రింట్ కోసం దరఖాస్తు చేయవచ్చు. పాన్ 2.0 అమలులోకి వచ్చిన తర్వాత, సవరణలు, ధ్రువీకరణలు వేగవంతంగా, పూర్తిగా డిజిటలైజేషన్ సేవలు అందుబాటులోకి వస్తాయి.

# మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పచ్చి దగా

- మోసం చేయడంలో చంద్రబాబుది మాష్టర్ డిగ్రీ
- వరుదు కళ్యాణి ఫైర్
- నాడు రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచిత బస్సు అని హామీ
- నేడు ఫ్రీ బస్సు పథకానికి అడుగడుగునా షరతులు
- దుర్గమ్మ సాక్షిగా హామీ ఇచ్చి మోసం చేసిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్
- ఇది స్త్రీ శక్తి కాదు స్త్రీ వంచన పథకం
- ఉత్తరాంధ్రా నుంచి తిరుపతి వెళ్లడానికి 13 బస్సులు మారాలా..?
- కూటమి ప్రభుత్వంపై వరుదు కళ్యాణి ఫైర్
- సూపర్ సిక్స్ సూపర్ హిట్ కాదు, సూపర్ చీట్
- మహిళలు, రైతులు, నిరుద్యోగులు సహా అందరికీ మొండిచేయి
- అన్ని బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం అమలు చేయాలి
- దీనికి నెలకి రూ.300 కోట్లు అవసరం
- ఇది మీ స్పెషల్ ఫ్లైట్ల ఖర్చుతో సమానం
- మీకు లేని షరతులు పేద మహిళలకెందుకు ?
- చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్‌ను నిలదీసిన వరుదు కళ్యాణి

**సూర్య ప్రతినిధి–విశాఖపట్నం**

నాడు రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచిత బస్సు అని హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం నేడు ఫ్రీ బస్సు పథకానికి అడుగడుగునా షరతులు విధించడంపై వైయస్సార్సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి తీవ్రంగా మండిపడ్డారు. విశాఖపట్నం వైయస్సార్సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... దుర్గమ్మ సాక్షిగా హామీ ఇచ్చి మోసం చేసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకాన్ని స్త్రీ వంచనగా మార్చివేశారని మండిపడ్డారు. కేవలం 5 రకాల బస్సులకే ఉచిత ప్రయాణాన్ని పరిమితం చేయడాన్ని ఆక్షేపించారు.



**పచ్చి అద్దాలతో మోసం చేసిన కూటమి ప్రభుత్వం**

మహిళా సాధికారత కోసం ఉచిత బస్సు ప్రయాణం పెద్ద, పెద్ద హెడ్డింగులతో అని పత్రికల్లోనూ, ప్రసార మాధ్యమాల్లో కూటమి ప్రభుత్వం ఊదరగొట్టింది. ప్రభుత్వం చేసిన హడావుడి చూసి రాష్ట్రంలో ఉన్న రెండున్నర కోట్ల మంది మహిళలు రాష్ట్రమంతటా ఉచిత బస్సు ప్రయాణం చేయవచ్చని ఎంతో ఆశగా ఎదురు చూశారు. మహిళల ఆశల్ని కూటమి ప్రభుత్వం బస్సు టైర్ల కింద తొక్కిపడేసింది.

మహిళలు పవిత్రంగా భావించే శ్రావణమాసం శుక్రవారం నాడు కూటమి ప్రభుత్వం మహిళలను దారుణంగా మోసం చేసింది. ఎన్నికల మేనిఫెస్టోలోనూ, ప్రతి ఎన్నికల ప్రచార సభలోనూ మహిళలకు రాష్ట్రంలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా ఉచిత బస్సు ప్రయాణం కూటమి పార్టీలు ఊదరగొట్టాయి. తీరా ఇప్పుడు అమల్లోకి వచ్చేసరికి ఉచిత బస్సు కొన్ని ప్రాంతాలకే పరిమితం అంటూ షరతులు విధించి మహిళలను దారుణంగా మోసం చేశాయి.దుర్గమ్మ పాదాల చెంత చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్ లోకేష్ ఇంత దారుణంగా మోసం చేయడం సమంజసమా? గతంలో రాష్ట్రంలో మహిళలు ఎక్కడ నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చని ఇదే దుర్గమ్మ పాదాల చెంత హామీ ఇచ్చారా? లేదా? ఇంత పచ్చి అబద్దాలు చెప్పి.. మహిళలు మోసం చేయడం అత్యంత దుర్మార్గం.

ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలుగా కిరీటాలు పెట్టుకున్న కూటమి నేతలంతా మీ మేనిఫెస్టో చూడండి. ఆ రోజు మీరు చెప్పిందేమిటి? ఇవాళ చేసిందేమిటి? రాష్ట్రంలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా బస్సు ప్రయాణం ఉచితం అని చెప్పారు. ఇప్పుడేమో 16 రకాల బస్సులంటే కేవలం 5 రకాల బస్సుల్లోనే ఉచిత ప్రయాణం, మిగిలిన బస్సుల్లో లేదు అని చెబుతున్నారు. అది కూడా రకరకాల మాటలు మాట్లాడుతున్నారు. ఒకసారి 6,700 బస్సుల్లో ఉచిత ప్రయాణం అని చెబుతున్నారు. మరోసారి 8,300 బస్సులలో ఉచిత ప్రయాణం అని పదే, పదే మాట మారుస్తున్నారు. జిల్లాల పరిధిలో తిరిగే బస్సుల్లోనే ఉచిత ప్రయాణం ఇచ్చారు. ఇది మహిళలను దారుణంగా మోసం చేయడమే కదా?

**సూపర్ హిట్ కాదు. అట్టర్ ఫ్లాప్**

ఇన్ని ఆంక్షలతో ఇచ్చిన ఈ పథకానికి మరలా స్త్రీశక్తి అని గొప్ప పేరు పెట్టి మోసం చేస్తున్నారు. మీరు ఇచ్చింది స్త్రీ శక్తి కాదు, స్త్రీ వంచన అని రాష్ట్రంలో మహిళలందరికీ అర్ధం అయింది. ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉచిత బోగస్ ప్రయాణంగా మార్చేశారు. మీరు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని ప్రచారం చేసుకుంటున్నారు. అది సూపర్ హిట్ కాదు సూపర్ ఛీట్ అన్న విషయం ప్రజలందరూ తెలుసుకున్నారు. అదో సూపర్ డూపర్ ఫ్లాప్ కార్యక్రమం.ఒక్క మహిళకు కూడా 3 సిలిండర్లు ఇవ్వకపోవడం సూపర్ హిట్టా? 30 లక్షల మంది పిల్లలకు అమ్మఒడి ఎగనామం పెట్టడం సూపర్ హిట్టా? తొలి ఏడాది తల్లికి వందనం ఎగనామం పెట్టారు. జగన్మోహన్ రెడ్డి అమ్మఒడి పేరుతో తొలి ఏడాది నుంచే అమలు చేస్తే.. వీళ్లు తొలి ఏడాదే ఈ పథకాన్ని ఎగంగొట్టింది కాక.. రెండో ఏడాది ఈ పథకంలో 30 లక్షల మందికి ఎగ్గొట్టారు, దాన్ని సూపర్ హిట్ అంటారా? అలాగే రెండు కోట్ల మంది మహిళలకు ఆడబిడ్డ నిధి ఎగ్గొట్టారు.

ఆడబిడ్డ నిధి పథకానికి రూ.33 వేల కోట్లు కేటాంచాల్సి ఉండగా.. ఇంతవరకు కనీసం ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం సూపర్ హిట్టా? కోటిమందికి నిరుద్యోగ భృతి ఇవ్వకపోవడాన్ని సూపర్ హిట్ అంటారా? ఒక్క నిరుద్యోగికి కూడా ఉద్యోగం ఇవ్వకపోవడం సూపర్ హిట్టా?ఇక రైతు భరోసా విషయానికొస్తే అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది దానికి ఎగనామం పెట్టారు. రెండో ఏడాది కూడా 7 లక్షల మంది రైతులకు ఎగనామం పెడుతూ... మిగిలిన వాళ్లకు కూడా కేవలం రూ.5వేలు మాత్రమే ఇచ్చారు. మొత్తంగా ఈ రాష్ట్రంలో ఉన్న 53 లక్షల మంది రైతులకు రూ.35 వేలు చొప్పున ఎగనామం పెట్టడం సూపర్ హిట్టా? ఇంత దారుణంగా రాష్ట్ర ప్రజలను మోసం, దగా చేస్తూ సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని ఏ మొహం పెట్టుకుని ప్రకటిస్తున్నారు చంద్రబాబు గారూ? ఆ రోజు ఓట్ల కోసం అనేక మాటలు చెప్పి ఇప్పుడు వాటిని నీటిమూటలు చేసారు. సీఎం అంటే చీఫ్ మినిస్టర్ అని అర్ధం అయితే... చంద్రబాబు చర్యలతో ప్రజలు సీఎం చీటింగ్ మాష్టర్ అని అనుకునేటట్టు చేశారు. మోసం చేయడంలో మాష్టర్స్ డిగ్రీ పొందిన విషయం ప్రజలందరూ గమనిస్తున్నారు. మహిళలను ఈ స్థాయిలో మోసం చేయడం గతంలో ఎప్పుడూ కనీ వినీ ఎరగం.

**కూటమి ప్రభుత్వం కాదు కోతల ప్రభుత్వమిది**

కూటమి పాలన చూసి ప్రజలందరూ ఇది కూటమి ప్రభుత్వం కాదు కోతల ప్రభుత్వం అని, వీరు చేస్తున్నది సుపరిపాలన కాదని శుద్ద దండగ పాలన అని, ఈ ప్రభుత్వం మంచి ప్రభుత్వం కాదు ముంచే ప్రభుత్వమని ప్రజలు అర్ధం చేసుకున్నారు. తాను సేఫ్ డ్రైవర్ని అన్న చంద్రబాబు... మీరు బస్సు ఎక్కి ఎవరైనా టిక్కెట్ అడిగితే ఆరోజు తన పేరుచెప్పమన్నారు. కానీ ఇవాళ కండక్టర్లు కేవలం 5 రకాల బస్సుల్లో తప్ప మిగిలిన అన్ని రకాల బస్సులలో మహిళల నుంచి ముక్కుపిండి టిక్కెట్ వసూలు చేస్తున్నారు. ఇది మోసం కాదా? ఎన్నికల్లో అనేక హామీలిచ్చారు.

# ఫొటోగ్రఫీ పోటీల్లో ఆలోచనలు రేకెత్తించిన ఛాయాచిత్రాలు









- ప్రతి చిత్రం ఒక కళాత్మక సందేశం
- విజేతలకు అభినందనలు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**సూర్య ప్రతినిధి – విజయవాడ**

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం (ఆగస్టు 19) సందర్భంగా నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు పంపిన ఛాయాచిత్రాలు ప్రతిఒక్కరిలో ఆలోచనలు రేకెత్తించేలా ఉన్నాయని.. ప్రతి ఛాయా చిత్రం కళాత్మక సందేశాన్ని అందిస్తున్నాయని.. పోటీల్లో గెలుపొందిన విజేతలకు అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో గెలుపొందిన విజేతల వివరాలను శనివారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కలెక్టరేట్‌లో ఆయన ఛాంబర్ నందు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లలో నైపుణ్యాన్ని మరింత పెంచడంతో పాటు వారిని ప్రోత్సహించేందుకు ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు పర్యాటక, సాంస్కృతిక రంగాలతో పాటు ఉత్తమ ప్రెస్ ఫొటోలతో మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. పోటీల్లో మొత్తం 186 ఫొటో ఎంట్రీలు రాగా వీటిని ఆరుగురు సభ్యులతో కూడిన న్యాయనిర్ణేతల బృందం ఎంట్రీలను పరిశీలించి విజేతలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. మొదటి విభాగమైన పర్యాటక ప్రాంతాలు, స్వచ్ఛాంధ్ర, యోగాంధ్ర అంశంలో జీఎన్ రావు (ది హిందూ), సీహెచ్‌వీ మస్తాన్ (ది హాన్స్ ఇండియా), కేవీఎస్ గిరి (ది హిందూ) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించగా.. సి.మల్లికార్జున్ (ఈనాడు), పి.రాజేష్ (ఆంధ్రజ్యోతి), ఎం.ప్రశాంత్ (ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్), సీహెచ్ నారాయణరావు (దక్కన్ క్రానికల్), పి.ప్రసాద్ (ఎస్‌డీఎంఎస్‌డీ), ఎస్‌ఎస్ విజయబాబు (టైమ్స్ ఆఫ్ ఇండియా) ప్రోత్సాహక బహుమతులు సాధించారని వివరించారు. రెండో విభాగంలో తల్లికి వందనం/విద్య, ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లకు చెందిన ఫొటోల్లో ఎ.రాజేంద్రప్రసాద్ (ఐ అండ్ పీఆర్), జీఎన్ రావు (ది హిందూ), ఆర్‌వీ అప్పారావు (ఫ్రీలాన్సర్)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించగా.. కేవీఎస్ గిరి (ది హిందూ), ఎ.రామచంద్రరావు (ప్రజాశక్తి), బి.మరిడయ్య (ఈనాడు), వైవీవీ సత్యనారాయణ (ఈనాడు), సంపత్ కుమార్ (ఈనాడు), ఎంపీఎస్‌కే దుర్గాప్రసాద్ (ఈనాడు)లు ప్రోత్సాహక బహుమతులు సాధించారన్నారు. మూడో విభాగంలో బెస్ట్ న్యూస్ పిక్చర్‌లో సీహెచ్ నారాయణరావు (దక్కన్ క్రానికల్), జి.మహేశ్ (టైమ్స్ ఆఫ్ ఇండియా), ఎం.ప్రశాంత్ (ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు జీవీ నారాయణ (ఆంధ్రజ్యోతి), ఎన్.కిశోర్ (సాక్షి), బి.మరిడయ్య (ఈనాడు), కె.చక్రపాణి (సాక్షి), డి.లక్ష్మణ్ (ఆంధ్రజ్యోతి), బి.సతీష్‌కుమార్ (ఆంధ్రజ్యోతి)లు ప్రోత్సాహక బహుమతులు సాధించినట్లు కలెక్టర్ లక్ష్మీశ ప్రకటించారు. విజేతలకు ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం కార్యక్రమంలో నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. ఫొటోగ్రఫీ పోటీల్లో పారదర్శకంగా విజేతలను ఎంపిక చేసిన న్యాయ నిర్ణేతలు కె.రవి, సీహెచ్ విజయభాస్కర్, జి.అనిత, టి.శ్రీనివాస్‌రెడ్డి, డి.సీతారాం, కె.రవికుమార్‌లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఫొటోగ్రఫీ పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరిరూ విజేతలేనని.. రాబోయే రోజుల్లో ప్రెస్ ఫొటోగ్రాఫర్లతో పాటు స్టుడియో ఫొటోగ్రాఫర్లు, స్థానిక ఔత్సాహిక ప్రజలకు కూడా పోటీలు నిర్వహించి.. జిల్లాలో పర్యాటక, సాంస్కృతిక, చారిత్రక ప్రదేశాలకు మరింత ప్రాచుర్యం కల్పించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

కార్యక్రమంలో డీఐపీఆర్‌వో కేవీ రమణరావు, డీపీఆర్‌వో ఎస్‌వీ మోహనరావు, డివిజనల్ పీఆర్‌వో కె.రవి, ఏవీఎస్ వీవీ ప్రసాద్, సీనియర్ ఫొటోజర్నలిస్టు సీహెచ్ విజయభాస్కర్, వివిధ ప్రింట్ మీడియా ఫొటో జర్నలిస్టులు పాల్గొన్నారు.

## సామూహిక గోకులం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**సూర్య ప్రతినిధి – నందిగామ**

నందిగామ మండలం, మునగచర్ల గ్రామంలో సామూహిక గోకులం ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొన్నారు. పశుగ్రాసం, సమీకృత దాణా అందించడంలో ఉపయోగపడే ఉపకరణాలను పరిశీలించారు. పాడి రైతులతో ముచ్చటించారు. పశు సంవర్ధక రంగ అభివృద్ధికి, పాడి రైతుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందుబాటులో ఉంచిన పథకాలను సద్వినియోగం చేసుకొని అదనపు ఆదాయాన్ని పొందాలని సూచించారు. ప్రస్తుతం బాగా అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉన్న రంగం పశుసంవర్ధక రంగం అని పేర్కొన్నారు.

## తమిళనాడులో తారాస్థాయికి భాష రగడ

**సూర్య ప్రతినిధి – చెన్నై**

మనదేశంలో రాజకీయ నాయకులు మాత్రమే కాదు గవర్నర్లకు కూడా రాజకీయ వాసనలు ఉంటాయి. గవర్నర్లను కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. రాష్ట్రాలలో జరుగుతున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు తమకు నివేదికల ద్వారా తెలియజేయాలని సూచిస్తుంది. అయితే గవర్నర్లు కొన్ని సందర్భాలలో తమ పరిధులు దాటుతుంటారు. రాష్ట్రానికి ప్రధాన పౌరులం అనే విషయాన్ని మర్చిపోయి.. రాజకీయాలలో వేలు పెడుతుంటారు. దీంతో పరిస్థితులు ఒక్కసారిగా చేయి దాటిపోతుంటాయి. గతంలో తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్, తమిళ సై సౌందరరాజన్ మధ్య కొద్ది రోజులపాటు ఇటువంటి పరిణామాలు జరిగాయి. ఇప్పుడు తమిళనాడులో కూడా అటువంటి పరిస్థితులు నెలకొన్నాయి. తమిళనాడు రాష్ట్రంలో డిఎంకె పార్టీ అధికారంలో ఉంది. స్టాలిన్ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఆ రాష్ట్రంలో ఆర్‌ఎన్ రవి గవర్నర్‌గా కొనసాగుతున్నారు. రవి తమిళ భాషను వ్యతిరేకిస్తారని ఆ రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా డీఎంకే కార్యకర్తలు తీవ్రస్థాయిలో విమర్శిస్తుంటారు. అంతేకాదు ఆయన సమయం దొరికిన ప్రతి సందర్భంలోనూ హిందీ లేదా ఇంగ్లీషులోనే ప్రసంగిస్తుంటారు. సహజంగానే మాతృ భాష మీద విపరీతమైన ప్రేమ ఉండే తమిళులు గవర్నర్ వైఖరిని విపరీతంగా విమర్శిస్తుంటారు. సోషల్ మీడియాలో అయితే గవర్నర్ రవిని ఏకిపారేస్తుంటారు. కొంతకాలంగా గవర్నర్, డీఎంకే ప్రభుత్వానికి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. నీట్ కు వ్యతిరేకంగా డీఎంకే ప్రభుత్వం ఒక తీర్మానం చేసినప్పుడు.. దానిని గవర్నర్ వ్యతిరేకించారు. అప్పట్లో ఇది తమిళనాడు రాష్ట్రంలో సంచలనం సృష్టించింది.తాజాగా ఆ రాష్ట్ర ప్రథమ పౌరుడికి ఓ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో చేదు అనుభవం ఎదురయింది.. డీఎంకే నేత భార్య జీన్ జోసెఫ్ అత్యున్నత విద్యను పూర్తి చేశారు. గవర్నర్ నుంచి డిగ్రీ పట్టా తీసుకోవడానికి ఆమె నిరాకరించారు. వేదిక మీద ఉన్న ఆయనను పట్టించుకోకుండానే వెళ్లి.. వైస్ ఛాన్స్ లర్ చేతుల మీదుగా పట్టా తీసుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. డీఎంకే నేత భార్య వ్యవహరించిన తీరును బిజెపి నాయకులు తప్పు పడుతుండగా.. తమిళనాడు ఆత్మాభిమానాన్ని జీన్ జోసెఫ్ ప్రదర్శించారని డిఎంకె కార్యకర్తలు అంటున్నారు.. ఆమెను తమిళ విప్లవ నాయకిగా అభివర్ణిస్తున్నారు. తమిళనాడులో భాష రాజకీయాలు ఇదే తొలిసారి కాదు. కానీ ఇప్పుడు అవి తారస్థాయికి చేరిపోయాయి. అధికార డిఎంకె కేంద్రంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తోంది. హిందీని బలవంతంగా రుద్దుతున్నారని ఆరోపిస్తోంది. గతంలో ఉన్న కేంద్ర ప్రభుత్వాలు ఇలా చేయడం వల్లే ఉద్యమాలు వచ్చాయని.. ఇప్పుడు కేంద్రం కూడా అదే ధోరణి కొనసాగిస్తున్న నేపథ్యంలో.. అనివార్యంగా ఉద్యమాలు మొదలవుతున్నాయని డీఎంకే నేతలు చెబుతున్నారు. మరోవైపు హిందీని తాము బలవం తంగా రుద్దడం లేదని, లేనిపోని గొడవలు సృష్టించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని డీఎంకే నేతలు భావిస్తున్నారని బిజెపి నాయకులు చెబుతున్నారు.

## డా. సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం

**– జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**సూర్య ప్రతినిధి – విజయవాడ**

దేశ ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ప్రసాదించేందుకు అవిరళ కృషిచేసిన గొప్ప వ్యక్తుల్లో డా. సర్దార్ గౌతు లచ్చన్న ఒకరని.. ఆయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు, అణగారిన వర్గాల ఆశా జ్యోతి డా. సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి కలెక్టర్ లక్ష్మీశ పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంతో పాటు వివిధ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సర్దార్ గౌతు లచ్చన్న పాటుపడ్డారని.. ఆయన పాటించిన విలువలను ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందడుగు వేయాలని సూచించారు. మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు అందించాలనే సంకల్పంతో ఇలాంటి గొప్ప కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించడం జరుగుతోందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

**సహకార సంఘాలు**

# రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

**– డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ**

**సూర్య ప్రతినిధి – దర్శి**

నూతనంగా నియమించబడ్డ సొసైటీ అధ్యక్షులను శనివారం దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ దర్శి మార్కెట్ యాడ్ నందు నిర్వహించిన రైతు సంబర సభ వేదిక పై సన్మానించి వారిని భినందించారు. డాక్టర్ లక్ష్మీతో పాటు... మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి. పాపారావు, ఏపీఎస్ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, ర్శి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ దారం నాగవేణి – సుబ్బారావు గారు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య నియోజకవర్గం లోని మండల పార్టీ అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ రైతులకు మేలు చేసే విధంగా సొసైటీలు పనిచేయాలని, సిబ్బందితో సమన్వయం చేసుకొని పాలకవర్గం రైతులకు సేవ చేయాలని ఆమె కోరారు. రుణాల మంజూరు, తిరిగి చెల్లింపులు, బకాయిల వసూలు వంటి కార్యక్రమాలలో రైతులను నొప్పించవద్దని ఆమె సూచించారు. సొసైటీలను బలోపేతంగా ఉంచాల్సిన బాధ్యతను రైతులకు అవగాహన కల్పించి రైతులకు సహకార సంఘాలుగా సొసైటీలు పనిచేయాలన్నారు. రుణాల మంజూరులో నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని ఆమె కోరారు. అదేవిధంగా సొసైటీల ద్వారా వచ్చే ఎరువులు, విత్తనాలు సక్రమంగా రైతులకు అందేందుకు కృషి చేయాలన్నారు. మన కూటమి ప్రభుత్వంలో మన ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ , వ్యవసాయ శాఖ మాత్యులు అచ్చం నాయుడు రైతుల అభ్యున్నతికి చేస్తున్న కృషిని రైతులకు తెలియజేయాలన్నారు. మంచి చేయాలన్న పాలకులతో పాటు వరుణ దేవుడు కరుణ కూడా తోడైందని సకాలంలో వర్షాలు పడ్డాయని డ్యాములన్ని నిండాయని రైతులకు ఈ ఏడాది వ్యవసాయం లాభసాటిగా ఉండేందుకు సొసైటీలు, వ్యవసాయ అధికారులు, ఎన్‌ఎస్పి అధికారులు సమిష్టిగా పనిచేసి రైతులకు అండగా నిలవాలని డాక్టర్ లక్ష్మీ కోరారు.



**నూతనంగా ఎన్నికైన పిఏసిఎస్ చైర్మెన్‌లు:**

పిఎసిఎస్ దర్శి: కే చంద్రశేఖర్ బాబు, ఈస్ట్ వెంకటాపురం: దామ కృష్ణ, పసుపుగల్లు: పి శ్రీనివాస్ రెడ్డి, ముండ్లమూరు: మేదరమెట్ల వీరనారాయణ, మారెళ్ళ: బిజీ అంజయ్య, ఉమామహేశ్వరపురం: కాటూరి గురవయ్య, బొప్పుడువారిపాలెం: కే రామాంజనేయులు, నాగంబొట్లవారిపాలెం: వి సుబ్బయ్య,మన్నేపల్లి: జి రమణారెడ్డి, వెస్ట్ కంభంపాడు: వి చిన్న చెన్నయ్య, కురిచేడు: పి సీతారామయ్యపాలెం, మన్యం నాగేశ్వరరావు, ఎన్‌ఎస్పి అగ్రహారం: కాట్రాజు చిన్న వెంకయ్య లను సన్మానించిన అభినందించిన డాక్టర్ లక్ష్మీ.ఈ కార్యక్రమం లో ఐదు మండల పార్టీ అధ్యక్షులు మరెళ్ల వెంకటేశ్వర్లు, మోడీ ఆంజనేయులు, పిడతల నేమిలయ్య, కూరపాటి శ్రీను, మేడగం ఓబుల్ రెడ్డి, దర్శి టౌన్ పార్టీ అధ్యక్షులు చిన్న, మహిళా నాయకురాలు శోభారాణి మరియు నియోజకవర్గం లోని వివిధ హొదాల్లో ఉన్నారు కూటమి శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీసంఖ్య లో పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బంది ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

### విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణ్ రావు

సూర్యప్రతినిధి-విజయనగరం

పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా విజయనగరం రూరల్ సర్కిల్ పరిధిలో ఉన్న విజయనగరం రూరల్ , గంట్యాడ పోలీస్ స్టేషన్ సిబ్బందికి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విజయనగరం రూరల్ సి ఐ బి.లక్ష్మణరావు మ్యాక్సి విజన్ మల్టీ స్పెషాలిటి ఆసుపత్రి యాజమాన్యంతో సంప్రదించి రూరల్ మరియు గంట్యాడ పోలీస్ స్టేషన్ సిబ్బందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు ఆగష్టు 16న తెలిపారు. సిబ్బంది వృత్తిలో పడి వైద్య పరీక్షలు



చేయించుకోక పోవడం వలన అనేక ఆరోగ్య సమస్యలను ముందుగా గుర్తించక ఇబ్బంది పడుతున్నారన్నారు. కావున, పోలీసు సిబ్బంది అందరు తరుచూ వైద్య పరీక్షలు చేయించు కోవాలన్నారు. విజయనగరం రూరల్ గంట్యాడ పోలీస్ స్టేషన్ పరిధిలో పని చేస్తున్న సుమారు 40 మంది పోలీసు సిబ్బందికి మ్యాక్సి విజన్ మల్టీ స్పెషాలిటి ఆసుపత్రి యాజమాన్యం వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణ్ రావు తెలిపారు.



# అనర్హుల పింఛన్లపై సర్కార్ ఉక్కుపాదం...!

- అన్నంతపనీ చేసిన కూటమి సర్కార్
- వికలాంగుల్లో అనర్హుల పెన్షన్లకు మంగళం
- జిల్లావ్యాప్తంగా వేల సంఖ్యలో రద్దు
- సచివాలయాలకు అందిన నోటీసులు
- వాటిని వ్యక్తిగతంగా అందజేస్తున్న సిబ్బంది
- ప్రభుత్వ నిర్ణయంపై మెజార్టీ ప్రజలు హర్షం
- అర్హులకు మంజూరు చేయాలని విజ్ఞప్తి

సూర్యప్రతినిధి-విజయనగరం

గతంలో తప్పుడు ధ్రువీకరణ ప్రయోజనాల పత్రాలతో ప్రతినెలా దర్జాగా పెన్షన్ అందుకుంటున్న వికలాంగుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్నంత పనీ చేసింది. అటువంటివారి పెన్షన్లు రద్దుచేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వ్యక్తిగతంగానూ వాటిని వికలాంగులకూ





అందజేసింది. దీంతో,వారంతా లబోదిబోమంటున్నారు. 40శాతానికి పైబడి అంగవైకల్యం ఉంటేనే వికలాంగ పించనుకు అర్హులవుతారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేకమంది అంగవైకల్య పింఛన్లు అందుకునేవారు. రాజకీయ పలుకుబడితో వైద్యులను ప్రభావితం చేసి 40శాతం పైబడి అంగవైకల్యం ఉన్నట్టుగా సదరం సర్టిఫికెట్లు పొందారు. ఇంకొందరు బ్రోకర్ల ద్వారా వైద్యులను మేనేజ్ చేసుకుని తప్పుడు సరిఫికెట్లుతో దర్జాగా పింఛన్లు అందుకునేవారు. ఈసర్టిఫికెట్లు నేపథ్యంలో ఆ ఐదేళ్లు మాఫియా మాదిరి వ్యవస్థ ఒకటి పుట్టుకొచ్చింది అంటే అతిశయోక్తి కాదు. ప్రతి మండలంనుంచి నలుగురైదుగురు బ్రోకర్లు పుట్టుకొచ్చారు. సదరంలో ఎక్కువ



అంగవైకల్యం వేయించేందుకు వీరు గ్రామాల్లో డీల్ కుదుర్చుకొనేవారు. సదరం స్లాట్ బుకింగ్ నుంచి సర్టిఫికెట్ చేతికి వచ్చేంతవరకు మొత్తం బాధ్యతలు చూసుకునేందుకుగాను ఒక్కొక్కరినుంచి డిమాండును బట్టి 8నుంచి 10వేల రూపాయలు వరకూ వసూలుచేసి, వైద్యులకు కొంత ముట్టజెప్పి మిగిలింది నొక్కేసేవారు. జిల్లావ్యాప్తంగా ఇలాంటి మాఫియా నిర్భయంగా నడిచింది. సదరం స్లాట్ బుకింగ్ తేదీ ప్రకటిస్తే ఈ దళారీలకు పండగే. ఒక్కొక్కరూ లక్షల్లో వెన్నకేసుకున్నారంటే ఏస్థాయిలో నడిచిందో ఊహించుకోవచ్చు.

ఇలాఉంటే, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక, ఈ బోగస్ పింఛన్లపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టింది. అనర్హులు ఎక్కువమంది వికలాంగ పింఛన్లు పొందుతున్నట్టు గుర్తించింది. వీటిని ఉన్నపళంగా రద్దుచేస్తే ప్రజా వ్యతిరేకత వస్తుందని భావించి మొత్తం పింఛన్లను పునః పరిశీలన జరిపించి అనర్హుల పింఛన్లు రద్దుకు ఆదేశాలు జారీ చేసింది. వైద్యుల బృందాలను జంబ్లింగ్ పద్ధతిలో ప్రాంతలవారీగా పంపించి రీ ఆసిస్ మెంటు చేయించింది. వైద్యుల పునః పరిశీలనలో బోగస్ సర్టిఫికెట్లు గుట్టు రట్టయింది. 40 శాతం, అంతకుపైబడి అంగవైకల్యం లేని వారి పింఛన్లను తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. పునః పరిశీలన చేసిన వైద్యులనుంచి అధికారులకు అందిన వివరాలమేరకు అనర్హుల జాబితాలు సిద్ధంచేసి వాటిని ఎంపీడీఓ కార్యాలయాల ద్వారా సచివాలయాలకు, అక్కడి సిబ్బంది ద్వారా బోగస్ లబ్ధిదారులకు నోటీసులు చేరాయి. ప్రతి సచివాలయం పరిధిలో 40 నుంచి50 శాతం వరకూ పింఛన్లు రద్దయ్యాయి. వస్తున్న సెప్టెంబర్ నుంచి ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని ఆనోటీసుల్లో స్పష్టం చేశారు. అంటే, సెప్టెంబర్1నుంచి వీరికి పింఛన్లు అందవు. ఈ బోగస్ పింఛన్ల రద్దుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మెజారిటీ ప్రజలు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు. ఐతే, అక్కడక్కడా అర్హుల పింఛన్లు కూడా రద్దవడంపై



ఆక్షేపిస్తున్నారు. అటువంటి వారి విషయంలో ప్రభుత్వం మరోసారి పరిశీలన జరిపించి వారికి న్యాయం జరిగేలా చూడాలని కోరుతు న్నారు. గతంలో జరిగిన పింఛన్ల మాయాజాలాన్ని ఒకసారి చెప్పుకోవాల్సివస్తే.. చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలోని ఒక మండల కేంద్రంలో మూడు సంవత్సరాల బాల బాలికలు, 10,15 శాతం అంగవైకల్యం కూడా లేనివారుకూడా నెలకు దర్జాగా ఆరేసివేల రూపాయల పింఛను అందుకునేవారు. వైసీపీ నాయకులు ఓటుబ్యాంకు పెంచుకునేందుకు అర్హతలతో సంబంధం లేకుండా డాక్టర్లను మేనేజ్ చేసుకొని ఇష్టారాజ్యంగా తప్పుడు సర్టిఫికెట్లు జారీచేయించుకొని పింఛన్లను పప్పుబెల్లాల్లా మంజూరు చేయించేశారు. ఇప్పుడు ఆ పింఛన్లు రద్దయినవారంతా వారికి చెప్పుకుంటే పెన్షన్లు పోనాయి మరేటి సేత్రా%శీ% అంటూ సైడైపోతున్నారు. ఇలాఉంటే, అప్పట్లో తప్పుడు సదరం సర్టిఫికెట్లు జారీచేసిన వైద్యులపైనా చర్యలు తీసుకుంటామని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసిన నేపథ్యంలో వారిలో గుబులు మొదలైనట్టు సమాచారం.

## గురజాడ గ్రంథాలయంలో పుస్తకావిష్కరణ

సూర్యప్రతినిధి-విజయనగరం

పట్టణంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయంలో శనివారం జయంతి స్మారక గ్రంథాలయ సేవాసంస్థ ఆధ్వర్యంలో జరిగిన సాహిత్య సభలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు డా.పి.వి.ఎల్.సుబ్బారావు రచించిన ఆవేదనే నివేదన (పంచపాండవులు) పుస్తకాన్ని సభాధ్యక్షులు, విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రొంగలి పోతన్న ఆవిష్కరించారు. అనంతరం పుస్తక రచయిత సుబ్బారావును సేవాసంస్థ సన్మానించింది. సభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా అధ్యక్షుడు పోతన్న మాట్లాడుతూ సాహితీ రంగాన సుబ్బారావు చేస్తున్న కృషి ప్రశంసించారు. కవి, విమర్శకులు మానాపురం రాజా చంద్రశేఖర్,కవయిత్రి మానాప్రగడసాహితీ, పెద్దాడ సాయి సూర్యసుబ్బలక్ష్మి(చెన్నై) సమీక్షలు చేసారు. ఈకార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జి వి.శ్రీనివాస్, కార్యదర్శి షేక్ గౌస్ భాషా తదితరులు పాల్గొన్నారు.



## రామనారాయణంలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

సూర్యప్రతినిధి-విజయనగరం


ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణం శ్రీమద్రామాయణ ప్రాంగణంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు .వేదమంత్రాలు నిర్మల దేవాలయం అర్చకులు చాణక్య శ్రీహర్ష,కృష్ణ తేజ లు శ్రీకృష్ణునికి పంచామృత అభిషేకాలు చేశారు .ఈ ఉత్సవంలో ఎన్విఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ వాల్మీకి రీసెర్చ్ సెంటర్ కోఆర్డినేటర్ గౌరీ నిత్య తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ ఇష్టం కామేశ్వరీ ఆలయంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణం

సూర్యప్రతినిధి-విజయనగరం

శ్రావణ మాసం కృష్ణాష్టమీ శనివారం కలసివచ్చిన సందర్భంగా శనివారం పట్టణం శివారు సారిక గ్రామంలో శ్రీ ఇష్టం కామేశ్వరీ అనుగ్రహపీఠంలో క్రుష్ణాష్టమీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ఉదయం ఆలయ చైర్మన్ శ్రీ రంగం సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో రుత్విక్కులు పాణంగిపల్లి నరసింహాచార్యులు శ్రీదేవీ భూదేవీ సమేత కలియుగ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వైఖానస ఆగమశాస్త్రానుసారంజరిగిన ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీ స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వేడుకలలో భాగంగా,అమ్రుతవర్షిణినృత్యకళానికేతన్ తెలికిచర్ల వారిచే శ్రీనివాస కళ్యాణం నృత్యరూపకం జరిగింది. ఉట్టికొట్టే ఉత్సవం నిర్వహించారు.



## అంగ రంగ వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

సూర్యప్రతినిధి-విజయనగరం

ఈ రోజు విజయనగరం, ధర్మపురి నందు తన స్వగృహం అయిన సిరి సహస్ర నిలయంలో శనివారం నాడు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు,భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), ఆయన సతీమణి మజ్జి పుష్పాంజలి, తన అల్లుడు ప్రదీప్ నాయుడు,కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర (సిరమ్మ)తో కలిసి కృష్ణ అష్టమి వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కృష్ణ భగవానునికి ప్రత్యేక పూజలు చేసారు.



## యుద్ధ ప్రాతిపదికన కాలువల్లో పూడిక తొలగింపు

సూర్యప్రతినిధి-విజయనగరం

స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంతంలో భవన వ్యర్థాలు,కాలువల్లో పూడిక తొలగింపు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రజారోగ్య సిబ్బంది ప్రత్యేక జెసిబిల సహాయంతో ఈ మధ్య చేపట్టిన ఆక్రమణ తొలగింపులో మిగిలిన వ్యర్థాలు,కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించి వేస్తున్నారు. వెంటనే వాటిని లారీల ద్వారా తరలించి వేస్తున్నారు. ఈసందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా వ్యర్థాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. లీలామహల్ జంక్షన్ నుంచి వైయస్సార్ జంక్షన్ వరకు కాలువల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటికే రహదారి మధ్యలో కాలువ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. అవి దాదాపుగా పూర్తి కావచ్చాయని చెప్పారు. వర్షపు నీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా నీరు రహదారులపై నిలువ లేకుండా సజావుగా ప్రవహించేందుకు కాలువల్లో చెత్త ప్రక్షాళనకు ఉపక్రమించామన్నారు. అయితే జన సమ్మర్థం అధికంగా ఉండడం, ప్రయాణికులు రద్దీ ఎక్కువగా ఉండటంతో చెత్తలను కాలవల్లోనూ రహదారుల పైన పారవేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. స్థానిక వ్యాపారులు ప్రజలు సహకరించి ఇకనుండి చెత్తలను ప్రత్యేక డస్ట్ బిన్ లలో వేసుకోవాలని సూచించారు.



# భావితరాలకు స్ఫూర్తి గౌతు లచ్చన్న-రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

### ఘనంగా సర్దార్ జయంతోత్సవం

సూర్యప్రతినిధి-విజయనగరం

స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న భావితరాలకు స్ఫూర్తి అని, రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ కొనియాడారు. ఆయన బడుగు బలహీన వర్గాలకు దిక్సూచి లాంటివారని పేర్కొన్నారు. సర్ధార్ జయంతోత్సవం కలెక్టరేట్ లో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా లచ్చన్న చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఈసందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, నేటి తరానికి సర్ధార్ గౌతు లచ్చన్న లాంటి మహనీయుల జీవిత చరిత్రలు తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. తను నమ్మిన సిద్ధాంతం కోసం ఎక్కడా రాజీ పడకుండా జీవితాంతం పోరాటం చేసిన వ్యక్తి అని పేర్కొన్నారు. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడి అందరికీ మార్గదర్శకులుగా నిలిచారని చెప్పారు. 1978లోనే చట్టసభలో ప్రతిపక్ష నేతగా ఉన్నారని, పిఏసి ఛైర్మన్‌గా, మంత్రిగా, ప్రజా నాయకుడిగా విశేష సేవలను అందించారని తెలిపారు. జిల్లాలో గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ గౌతు లచ్చన్న గొప్ప సామాజిక కార్యకర్త అని పేర్కొన్నారు. ఆయన గొప్పతనం భావితరాలకు తెలియజేసేందుకు జన్మదినాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అణగారిన వర్గాలకోసం ఆయన చేసిన సేవలను ఎన్నటికీ మరిచిపోలేమని అన్నారు. అణగదొక్కబడిన బాధితుల పక్షాన అలుపెరుగని పోరాటం చేశారని అన్నారు.



ఆయన సమాజానికి చేసిన సేవలను గుర్తించబట్టే, ప్రభుత్వం ఆయన పేరును తోటపల్లి ప్రాజెక్టుకు పెట్టిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ, గౌతు లచ్చన్న ఉద్యమాలకు నిప్పుకణిక అని పేర్కొన్నారు. జీవితమంతా ఉద్యమాలతో సాగిందని,ఏన్నోసార్లు జైలుకు వెళ్లివచ్చారని చెప్పారు. అణగారిన వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు.

తూర్పుకాపు ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల్లోనే సర్ధార్ గౌతు లచ్చన్నకు ఒక ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. కల్లుగీత వృత్తి పరిరక్షణ కోసం కూడా ఆయన కృషి చేశారని చెప్పారు. ముఖ్యంగా నాటి తరానికి విద్యనందించడంలో సర్ధార్ చేసిన కృషి ఆదర్శనీయమని అన్నారు.

ముందుగా జిల్లా బిసి సంక్షేమాధికారిణి జ్యోతిశ్రీ మాట్లాడుతూ గౌతు లచ్చన్న జీవిత చరిత్రను వివరించారు. గౌడ, ఉప కులాల జిల్లా అధ్యక్షులు సిహెచ్ ఆదినారాయణ, రజక సంఘం రాష్ట్ర నాయకురాలు ఇ.విజయలక్ష్మి మాటా ్లడుతూ లచ్చన్న గొప్పదనాన్ని కొనియా డారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, విజయన గరం మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, డిఈఓ మాణిక్యంనాయుడు, ఎబిసిడబ్ల్యూఓలు, వసతి గృహ సంక్షేమాధి.కారులు, ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధి హామీ గత బకాయి బిల్లులు సిద్ధం చెయ్యాలి: ఎమ్మెల్యే

సూర్య ప్రతినిధి-చీపురుపల్లి

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు పనులకు సంబంధించి విత్ హెల్డ్ లో ఉన్న నిధులు తక్షణమే చెల్లించేలా బిల్లులు సిద్ధం చెయ్యాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పెండింగ్ ఉన్న బిల్లులు చెల్లింపు పై చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాలకు చెందిన ఉపాధి హామీ పథకం అధికారులతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014-19లో విత్ హెల్డ్ లో ఉన్న బిల్లులన్నీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కళా వెంకటరావు అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో ఐదు వందల పనులకు గాను రూ.91 లక్షలు వరకు చెల్లించడం జరుగుతుందని అధికారులు ఎమ్మెల్యేకి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, మురికి కాలువ నిర్మాణాలు, అంగన్వాడి భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. అన్ని రంగాల్లో అభివృద్ధి శరవేగంగా చేపట్టేందుకు అధికారులు కృషి చేయాలన్నారు.

ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు రౌతు కామునాయుడు,దన్నాన రామచంద్రుడు, వెన్నె సన్యాసినాయుడు, సన్యాసినాయుడు,పైలా బలరాం,ఆలయ కమిటీ ఛైర్మన్ గవిడి నాగరాజు, ఎంపీడీఓ లు సురేష్, గొర్లె భాస్కరరావు, ఉపాధి హామీ ఏపీవో లు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు,నాలుగు మండలాల ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.



## మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా
# మెగా డాన్స్ పోటీలు

సూర్యప్రతినిధి–విజయనగరం

విజయనగరం జిల్లా చిరంజీవి యువత, అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ మరియు అంజనీ పుత్ర చిరంజీవి బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా రెండోరోజైనా శనివారం ఉదయం మెగా డాన్స్ పోటీలను జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు (బాలు) కనపాక, రితిక్ డాన్స్ స్టూడియో లో నిర్వహించారు. ఈ మెగా డాన్స్ పోటీలకు ముఖ్య అతిధిగా హాజరైన ప్రముఖ సంఘసేవకులు,



యువ వ్యాపార వేత్త, గోవింద్ బ్యాగ్స్ అధినేత కోరాడ గోవింద్ మాట్లాడుతూ.. మెగాస్టార్ చిరంజీవి అభిమానులు దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను సంపాదించుకోవడములో మెగాస్టార్ చిరంజీవికే దక్కిందని, దీనికి నిదర్శనం ప్రపంచ వ్యాప్తంగా సేవాకార్యక్రమాలు జరగడమే నిదర్శనమని, జిల్లా చిరంజీవి యువత ఆధ్వర్యంలో ఈ డాన్స్ పోటీలు విద్యార్థినీ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి ధోహదపడతాయని అన్నారు.



ఈమెగాడాన్స్ పోటీలకు జడ్జిగా ప్రముఖ డాన్సర్ రితిక్ డాన్స్ మాస్టర్ వ్యవహరించిన పోటీల్లో సుమారు ముప్పై మంది పాల్గొన్నారని, గెలుపొందిన విజేతలకు ముఖ్యఅతిధైన గోవింద్ బ్యాగ్స్ అధినేత కోరాడ గోవింద్ బాహూకరించిన స్కూల్ బ్యాగ్స్ ను జిల్లా చిరంజీవి యువత ప్రతినిధులు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు లాలిశెట్టి రవితేజ, యువనాయకుడు లోపింటి కళ్యాణ్ బాహూకరించారు.

## వాసిరెడ్డి కృష్ణమూర్తి జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే శంబంగి

సూర్యప్రతినిధి–బొబ్బిలి




ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంత్రిగా చేసిన కీర్తిశేషులు వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు 103వ జయంతి వేడుకలను కొప్పల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకల్లో బొబ్బిలి మాజీ శాసనసభ్యులు శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పాల్గొని దివంగత వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో గల పేద ప్రజలకు ఆయన చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు.

## బొబ్బిలిలో "బాబు షూరిటీ-మోసం గ్యారంటీ".....

సూర్యప్రతినిధి–బొబ్బిలి

రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం బొబ్బిలి



పురపాలక సంఘం పరిధిలో గల 31వ వార్డు తారకరామ కాలనిలో బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పట్టణ వైసీపీ నాయకులతో కలిసి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు చేస్తూ ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు గుర్తుకు చేస్తూ చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురలీకృష్ణరావు,వార్డు కౌన్సిలర్ చోడగంజి అనసూయ,రాజగోపాల రావు,మాజీ బుడా చైర్మన్ ఇంటి గోపాలరావు,వివిధ వార్డు ఇంచార్జ్ లు,వైసీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు..సందడి చేసిన చిన్నారులు..

సూర్యప్రతినిధి–వంగర

మండలంలోని వంగర,మద్దివలస,అరసాడ,బంగారువలస,కొనండిపాడు తదితరు గ్రామాల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను భక్తులు ఘనంగా జరిపారు. మద్దివలస గ్రామంలో చిన్నారులు, శ్రీకృష్ణుని,గోపికల వేషధారణతో అలంక రించి మైమరిపించారు. మహాభారత యుద్ధాన్ని వినకుం డా నడిపించి, దుష్టశిక్షణ,సిష్టరక్షణ,అన్న గీత ఉపదేశం తో మానవాళికి దిశనిర్దేశం చేసేనా శ్రీకృష్ణ భగవానుడు, మహాభారత యుద్ధాన్ని ముందుండి నడిపించిన మార్గదర్శకుడు శ్రీకృష్ణ భగవానుడు,కావున ఈ కృష్ణాష్టమి రోజున భక్తులు హరే రామ హరే రామ రామ రామ హరే హరే, హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ హరే హరే అంటూ పలు నామ సంకీర్తనలు చేసి సంస్కృతి కార్యక్రమాలు చేపట్టారు.



## వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

సూర్యప్రతినిధి–సాలూరు

వెంకటేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం మంత్రి



సంధ్యారాణి చేతుల మీదుగా బుధవారం చేయించారు. ముందుగా ప్రెసిడెంట్ నాగోలు నరసింగరావు (తాతాజీ), కాళ్ల లక్ష్మి, పేర్ల విశ్వేశ్వరరావు, జంపా సత్యం, గాడి పద్మ, కొట్ని ప్రసాదరావు,దొంగ బాలమ్మ,గొట్టిపల్లి సింహాచలం,తిరికొల్లూరు పద్మజ నెంబర్లుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈసందర్భంగా మహిళ శిశు సంక్షేమ,గిరిజన సంక్షేమ శాఖామాత్యులు గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం నూతన కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు మీరందరూ శక్తివంతం లేకుండా భక్తుల సౌకర్యార్థంతో పాటు, ఆలయాన్ని అభివృద్ధి పదంలో నడిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావుతో పాటు కౌన్సిలర్లు వైకుంతపు హర్షవర్ధన్, మోయిద వైదేహి, బంధపు సీతమ్మ, సీనియర్ నాయకులు పప్పల మోహన్ రావు, బృందావనం అశోక్, కొనిసి చిన్ని, కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ మాజీ ప్రెసిడెంట్ కూనిశెట్టి భీమారావు తదితరులు పాల్గొన్నారు.

## గురజాడ సాహిత్య సంపదను,స్మారక భవనాన్ని కాపాడుకోవాలి-భీశెట్టి
### మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం బాధాకరం

సూర్యప్రతినిధి–విజయనగరం

తెలుగు జాతికి తరగని గొప్ప సాహిత్యాన్ని అందించిన మహోన్నత వ్యక్తి గురజాడ అప్పారావు స్మారక భవనాన్ని,సాహిత్య సంపదను కాపాడు కోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. శనివారం గురజాడ గృహంలో గురజాడ కి ఘన నివాళులు అర్పించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మహాకవి గురజాడ రచనలను భద్రం చెయ్యాల్సిన ఆర్కియాలజీ విభాగం,రాష్ట్ర టూరిజం శాఖ,పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నాయని



రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా గురజాడ గృహాన్ని,గురజాడ సాహిత్యాన్ని కాపాడటంలో పూర్తిగా విఫలమౌతున్నారని, గురజాడ అప్పారావు ఇంటిలో తాగుబోతు హాల్ చల్ చేసి,సాహిత్య సంపదని,వస్తువులను చిందరవందర చేసిన ఘటన తెలిసి కూడా రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి అనిత, విజయనగరం జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్,ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు,జిల్లాలోని ఎమ్మెల్యేలు గాని గురజాడ ఇంటిని సందర్శించడానికి కూడా తీరిక లేని పరిస్థితి లో ఉన్నారని భీశెట్టి మండిపడ్డారు, తెలుగు సాహిత్యాన్ని ప్రపంచం నలుమూలలకు పంపి సుసంపన్నం చేసిన గొప్ప వ్యక్తికి మన నేతలు ఇచ్చే గౌరవం ఇదేనా ?అని ప్రశ్నించారు,గతంలో కూడా గురజాడ ఇంటిలో దొంగలు చొరబడి విలువైన వస్తువులు దోచుకెళ్లారని,మరలా మరోసారి అదే పరిస్థితి వచ్చిందని,మహాకవి ఇంటి పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని పాదచారులు,చుట్టుపక్కల ఉన్నవారు ఉచ్చల దొడ్డి గా ఉపయోగిస్తున్నా కార్పొరేషన్ అధికారులకు కూడా చలనం లేదని పందులు,కుక్కలు కూడా అక్కడే నివాసం ఏర్పర్చుకున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు.

# అబద్ధాలు చెప్పడం మానేసి కోఠియా గ్రామాల సమస్యను పరిష్కరించండి

**-నక్కకి నాగలోకానికి తేడా ఒకటేనా**
**-మహిళల ఆత్మగౌరవాన్ని ఎక్కడ దాచారు**
**-అభివృద్ధి కోసం కౌన్సిలర్లు ఆమోదం తెలిపితే లేదంటారా**
**-మునిసిపల్ కార్యాలయాన్ని జర్జాపు ఈశ్వర రావు హయాంలో కట్టించారు.. రికార్డులు చూసుకోండి**
**-నాకు చేతకాలేదు..ఆరు పదవులు చేసిన సంధ్యారాణి అభివృద్ధి ఏం చేశారో చెప్పాలి**
**-వైయస్సార్ సిపి మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర**

సూర్యప్రతినిధి–సాలూరు

కాంగ్రెస్ పార్టీ హయాంలో నేను ఓడిపోయాను నా చేతకానితనం వల్ల నాకు పదవి రాలేదు, అదే పార్టీలో పదవి చేజిక్కించుకున్న సంధ్యారాణి నియోజకవర్గానికి ఏం అభివృద్ధి చేశారో బహిరంగంగా చెప్పాలని మాజీమంత్రి పీడిక రాజన్న దొర కోరారు.శనివారం ఉదయం మాజీ ఉప ముఖ్యమంత్రి పిడిక రాజన్న దొర క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి సంధ్యారాణి చెబుతున్నవన్నీ అబద్ధాలేనని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకం సూపర్ సక్సెస్ అయ్యిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో పాటు ఇక్కడున్నా మంత్రి కూడా గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. నాలుగు పర్యాయాలు నేను ఎమ్మెల్యేగా, మంత్రిగా వున్నప్పుడు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులన్నీ మంత్రి తానే అభివృద్ధి చేశానని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్, కూటమి ప్రభుత్వ పాలనలో ఆరు పదవులు చేసిన మంత్రి ఈ



నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు. గిరిజన గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా చేస్తామన్న మాటే మర్చిపోయారన్నారు. దశాబ్దాల తరబడి వివాదంలో ఉన్న కోఠియా గ్రామాల సమస్యను పరిష్కరించడానికి ఒడిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తో చర్చలు జరిపిన జగన్మోహన్ రెడ్డి ఏం చేయలేకపోయారని హేళన చేసిన మంత్రి ఇప్పుడు స్టేట్లోని కేంద్రంలోని ఉన్నది వాల్ల ప్రభుత్వమే కనక ఇప్పుడైనా కేంద్రం అనుమతితో కొఠియా గ్రామాల సమస్యను పరిష్కరించడం సులభం అవుతుందని చెప్పుకొచ్చారు. రాష్ట్రంతో పాటు సాలూరు నియోజకవర్గం కూడా రాయలసీమ ఫ్యాక్షనిజం లా కూటమి ప్రభుత్వ నాయకులు మారుస్తున్నారన్నారు. ఎన్నికలలో ఓట్లు కోసం గిరిజన గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా తీర్చిదిద్దుదామని చెప్పిన నాయకులు నేడు ఆ మాటే మరిచిపోయారన్నారు. శ్యామలంబ అమ్మవారి పండగ నిమిత్తం అప్పుగా తీసుకువచ్చిన రెండు కోట్ల నిధులను కౌన్సిలర్ ఆమోదం తెలిపి పనులు చేపడుతున్న కౌన్సిలర్లు ఆమోదం తెలపలేదని మంత్రి అనడం ఆశ్చర్యంగా ఉందన్నారు. అభివృద్ధికి మేము ఎప్పుడు ఆటంకం కాదన్నారు. నియోజకవర్గాన్ని ఎవరు అభివృద్ధి చేశారు చర్చికి రమ్మని పలుమార్లు తెదేపా నాయకులకు బహిరంగంగా సవాల్ విసిరిన ఏ ఒక్కరు ముందుకు రాలేదని వాపోయారు. మంత్రి 100 చెబితే అందులో 90 అబద్ధాలే ఉంటాయని వాళ్ళ నాయకులే బహిరంగంగా చర్చించుకుంటున్నారని అన్నారు. కొట్టక్కి బ్రిడ్జి, మోసూర్ బ్రిడ్జి, పంచాయతీ బ్రిడ్జి, కందులపదం బ్రిడ్జి, తహసిల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయంతో పాటు పలు కార్యాలయాల తన పదవీకాలంలోనే కట్టించారన్నారు. ఇకనైనా అబద్ధాలు చెప్పడం మానేసి నియోజక వర్గాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వంగపండు అప్పలనాయుడు గిరి రఘుతో పాటు నాయకులు పాల్గొన్నారు.

## వర్షాలు పట్ల అప్రమత్తంగా ఉండాలి

సూర్యప్రతినిధి–పార్వతీపురం

జిల్లాలో మోస్తారు నుండి భారీ వర్ష వర్షాలు కురిసే సూచన నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల వలన ఎటువంటి ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు జరగరాదని, ఇందుకోసం ముందుగా గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం సంబంధిత అధికారు లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 17,18 తేదీల్లో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున లోతట్టు, నదీ పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలను దండోరా, మైక్ ద్వారా ప్రచారం చేస్తూ అప్రమత్తం చేయాలని అన్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రజలు స్నానాలు చేయడం, బట్టలు ఉతకడం, పశువులను కడగడం, ఇసుకను త్రవ్వడం వంటి పనులు చేపట్టరాదని తెలిపారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులకు ఎటువంటి పంట నష్టం జరగకుండా చూడాలని, పంట కాలువలు, గట్లు తెగిపోకుండా ఇసుక బస్తాలను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడం, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని అన్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా,దిగకుండా సూచనలు చేయాలని తెలిపారు. శిథిలావస్థలోని భవనాలు,పాఠశాలల్లో ఎవరూ లేకుండా చూసుకోవాలని, విద్యార్థులు ఆరుబయట తిరగకుండా ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాల పట్ల విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ నిత్యం అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీరు,పారిశుధ్యం, వైద్య ఆరోగ్యం పట్ల ఆయా శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. ప్రజలు సమాచారం పొందడం, తీసుకోవడం చేయవచ్చని అన్నారు.

# జిందాల్ మాయలో ప్రజా ప్రతినిధులు అధికారులు

**.పేదరికంతో అలమటిస్తున్న భూ నిర్వాసితులు**
**-నిర్వాసితులను ఆదుకునేందుకు అందరూ ముందుకు రావాలని చల్లా జగన్ డిమాండ్**

సూర్యప్రతినిధి–ఎస్‌కోట

జిందాల్ ముందస్తు కుట్రలో భాగంగా నిర్వాసితులను నమ్మించి మోసం చేసిన జిందాల్ మాయలోనే ప్రజా ప్రతినిధులు అధికారులు ఉన్నారని ఏపీ రైసింగ్ జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం బొడ్డవరంలో నిర్వాసితులు వద్ద ఆందోళనలో పాల్గొన్నారు. ఈసందర్భంగా జగన్ మాట్లాడుతూ ఇప్పటికీ అనేక విషయాలు బయటకు వస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు జండాలు మాయలో ఉన్నారని మరోవైపు రూము తీసుకున్నప్పుడు చెప్పిన మాటల ప్రకారం కంపెనీ కడితే ఉద్యోగాలు వస్తాయని మా బ్రతుకులు బాగుపడతాయని, కంపెనీలో వాటాలు కూడా



ఉండి పేదరికం పోయి ఉన్న స్థితిలో ఉంటామని నమ్మించి మాకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని తీసుకోవడం వల్ల వ్యవసాయం ఆదాయము పోయిందని అందువలన పిల్లలు చదివించుకోవడం బ్రతకడం కూడా భారమైందని ఒక తరమే నష్టపోవాల్సి వచ్చిందని జగన్ అన్నారు.భూములు ఇచ్చిన మేము బిక్షగాలుగా మారితే భూములు తీసుకున్న జిందాల్ యాజమాన్యం మా వద్ద తీసుకున్న భూమిని జిందాల్ యాజమాన్యం ఇండస్ట్రియల్ రియల్ ఎస్టేట్ పేరుతో కోట్లు రూపాయలు ఆదాయం వచ్చే వ్యాపారానికి జెండాలు యాజమాన్యం సిద్ధపడటం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు భూములు కోల్పోయి పేదలుగా మారి అన్నమో రామచంద్ర అన్న నిర్వాసులకు న్యాయం చేయాలని, జిందాల్ చెప్పే మాయ మాటలు తప్పుడు నుండి, జిందాల్ మాయలు మోసాలు చేస్తుంటే బయటపడాలని జగన్ కోరారు.

# బొబ్బిలి నీ పార్వతీపురం మన్యం జిల్లాలో కలపాలి...

**రౌండ్ టేబుల్ సమావేశం లో పలువురు అభిప్రాయం...**

సూర్యప్రతినిధి–బొబ్బిలి

బొబ్బిలి నియోజకవర్గ ప్రాంతాన్ని పక్కనే ఉన్నటువంటి పార్వతీపురం మన్యం జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తూ సిపిఐ. కాంగ్రెస్. బిజెపి. సిపిఐ( ఎం ఎల్) న్యూ డెమొక్రసీ, ఏఐఎస్ఎఫ్. ఏఐవైఎఫ్. రైతు సంక్షేమసంఘం.ఏఐటీయూసీ. ఆధ్వర్యంలో పట్నంలో ఉన్నటువంటి ఒక ప్రైవేట్ స్కూల్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ. బొబ్బిలి నియోజకవర్గ ప్రాంతాన్ని పార్వతీపురం మన్యం జిల్లాలో కలపడం వలన ఆర్థికంగా బౌగోళికంగా ఉపయోగాలు ఉన్నాయని. పార్వతిపురం మన్యం జిల్లా కావడం వలన కేంద్రం నుండి నిధులు ఎక్కువగా వస్తాయని తద్వారా బొబ్బిలి నియోజకవర్గం అభివృద్ధి పరంగా మరింత ముందుకు వెళుతుందన్నారు. మొదటి నుంచి పార్వతి పురం రెవెన్యూ డివిజన్ కావడం వలన ఆప్రాంతంలో ఉన్నటువంటి వ్యక్తులతో ,అధికారులతో పరిచయాలు , బంధుత్వం పరంగా కలిగి ఉన్నాయని రెవిన్యూ సమస్యలపరంగా న్యాయపరమైన సమస్యలు పరంగా వేగంగా పనులు జరగాలంటే పక్కనే ఉన్నటువంటి మన్యం జిల్లాకు 20 కిలోమీటర్ల దూరం ఉండటం వలన



సమయం వృధా కాకుండా ఉంటుందని తెలిపారు. కావున బొబ్బిలి నియోజకవర్గాన్ని పార్వతీపురం మన్యం జిల్లాలో కలిపే విధంగా స్థానిక శాసనసభ్యులు బేబీ నాయన ప్రత్యేక చొరవ కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ సిపిఐ బొబ్బిలి నియోజకవర్గం కార్యదర్శి ప్రముఖ సీనియర్ న్యాయవాది కండాపు ప్రసాదరావు. బిజెపి పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు మరిచర్ల రామారావు. కాంగ్రెస్ పార్టీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ముచ్చల శ్రీనివాసరావు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు పిల్లా. లక్ష్మణరావు. రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మి%శ్రీ% నాయుడు. ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి .శ్రావణ్ కుమార్, ఏఐవైఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న, ఏఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మునకాల శ్రీనివాస్, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి గొల్లపల్లి తౌడు,కొలుసు వెంకట సత్యనారాయణ, పాలూరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 'ఎస్సై విక్రమ్..ది పోలీస్'

**-సర్వీస్‌లో మేటి..సేవల్లో ఘనాపాటి..**
**-విశిష్టమైన భారత్ ప్రభుత్వ అతి ఉత్కృష్ట మెడల్**
**-అందుకున్న ఎస్సై కామవరపు విక్రమరావు..**
**-సర్వీస్ లో ఇప్పటి వరకు 35 క్యాష్ రివార్డ్స్, 15 ప్రశంసా పత్రాలు..**

సూర్యప్రతినిధి–విజయనగరం

ఎస్సై కామవరపు విక్రమ్ రావు అలియాస్ విక్రమ్..పోలీస్ శాఖలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు కలిగిన అధికారిగా



అనేక మందికి సుపరిచితుడు.పోలీస్ శాఖలో ఆయన సమర్థత, అంకిత భావం,సమాజంతో ఆయన స్నేహ భావం,సేవా భావం ఆయనలోని ప్రత్యేకతలు.ఒక పోలీస్ అధికారి సమాజానికి ఆదర్శంగా ఎలా ఉండాలో ఎస్సై విక్రమ్ వృత్తి,ప్రవృత్తి, వ్యక్తిత్వంలో గోచరమౌతాయి. పోలీస్ శాఖలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలని ప్రతీ పోలీస్ అధికారి కాంక్షిస్తూ ఉంటాడు. కానీ ఆ ప్రత్యేక గుర్తింపును సాధించుకోవాలంటే కేవలం విధులు నిర్వర్తిస్తే సరిపోదు.ఆ విధుల్లో నిజాయితీ,అంకితభావం, సామర్థ్యం, సమర్థత అంతకుమించి ప్రజలతో మమేకం,నేర నియంత్రణ,శాంతి భద్రతల పరిరక్షణ వంటి వాటిలో ఎక్కడా రాజీపడని నైజంతో పని చేయాలి. అదే నిజమైన పోలీసింగ్. అటువంటి అధికారినే " ది పోలీస్ " అంటాం. అలా 'ఎస్సై విక్రమ్..ది పోలీస్' అనిపించుకునేలా విశిష్టమైన " భారత ప్రభుత్వ అతి ఉత్కృష్ట " మెడల్ ను సాధించుకున్నారు ఎస్సై విక్రమరామ రావు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేతుల మీదుగా విక్రమ్ ఈ మెడల్ తన యునిఫాంపై ధరించారు. ఆయన పోలీస్ సర్వీస్ లో ఇదొక వర్ణించలేని సంతోషకరమైన జ్ఞాపకం. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్సై వరకు సాగిన తన సర్వీస్ కాలంలో లెక్కకు మించి అనగా 35 క్యాష్ రివార్డులు, 15 ప్రశంసా పత్రాలతో పాటు విశిష్టమైన రాష్ట్ర పోలీస్ సేవా పతకాన్ని కూడా అందుకున్నారు. అలాగే అనేక సేవా సంస్థలచే ఎన్నో సన్మానాలు, పురస్కారాలు పొందుకున్నారు. కానీ వాటి అన్నింటి కంటే..తాజాగా భారత ప్రభుత్వ హోం ఎఫైర్స్ నుంచి అతి ఉత్కృష్ట మెడల్ అందుకోవడం




పోలీస్ అధికారిగా ఆయన సేవాతత్పరతకు, విధుల పట్ల అతడి నిబద్ధతకు కొలమానంగా చెప్పుకోవచ్చు. ఎస్సై విక్రమ రావుకి ఈ మెడల్ రావడం పట్ల పోలీసు శాఖలోని ఆయన సహచర అధికారులు, సిబ్బంది, స్నేహితులు, బందులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# దేశం కోసం తొలి ప్రాణత్యాగం ఆదివాసీది : ఆదివాసీపార్టీ

సూర్య.ప్రతినిధి.చింతపల్లి.

భారత దేశ స్వాతంత్ర్యం కోసం తొలుత ప్రాణ త్యాగం చేసింది ఆదివాసీ అయినా బాబా తిల్కా మాంఝీ అని,కానీ చరిత్రలో ఆ విషయం చెప్పడం లేదని భారత్ ఆదివాసీపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు ఆవేదన వ్యక్తం చేశారు.1600 సంవత్సరంలో వ్యాపారం కోసం భారత దేశంలోకి వచ్చిన బ్రిటీష్ వారు దేశాన్ని హస్తగతం చేసుకొని పరిపాలన కొనసాగిస్తున్న తరుణంలో మొట్టమొదట బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా 1784లో బాబా తిల్కా మాంఝీ పోరాడి బ్రిటీష్ ప్రభుత్వం చేత ఉరి తీయబడ్డాడు,కానీ చరిత్రలో ఈ విషయాన్ని చెప్పడం లేదని,1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటులో మంగళపాండే కన్నా 73 సంవత్సరాల ముందే బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన బాబా తిల్కా మాంఝీ1750 ఫిబ్రవరి 11 న ఉమ్మడి బీహార్ రాష్ట్రంలో గల సుల్తాంగంజ్ లో జన్మించారని,1770లో విపరీతమైన కరువు కారణంగా మరియు విలియం పిట్ ది యంగర్ చేత ప్రభావితమైనా కోర్టు ఆఫ్ డైరెక్టర్స్ ఆదేశాలు అనుసారంగా కోర్టు ఆఫ్ డైరెక్టర్ జమీందారుకి పదేళ్ల సెటిల్మెంట్ 1800 జారీ చేసింది.దాంతో స్థానిక జమీందార్లు మరియు సంతాలు గ్రామస్తుల మధ్య చర్చలు జరిపేందుకు అవకాశం దక్కింది.

స్వాతంత్ర్యం అనంతరం బాబా తిల్కా మాంఝీనీ ఉరితీసిన ప్రదేశంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి,బగల్పూర్ గ్రామానికి ఆయన పేరు పెట్టడం జరిగిందని,బగల్పూర్ విశ్వ విద్యాలయానికి ఆయన పేరుతో తిల్కా మాంఝీ బగల్పూర్ విశ్వ విద్యాలయం అని పేరు మార్చారని,అలాగే రాజ్యాంగ రచన కమిటీలో సభ్యుడు మరియు 5,6 వ షెడ్యూల్డ్ రూపశిల్పి అయినా జైపాల్ సింగ్ ముండా పేరుని కూడా ఎక్కడ ప్రస్తావించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.





# శ్రీకాకుళం జిల్లాకు డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న పేరు పెట్టాలి...ఏకుల వెంకటేష్ గౌడ్ అధ్యక్షులు

## ఉత్తరాంధ్ర డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న గీత సహకులాల యువజన సంఘం

సూర్య ప్రతినిధి గాజువాక

ఈరోజు గాజువాక షీలానగర్ జంక్షన్ వద్ద ప్రముఖ స్వతంత్ర సమరయోధులు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గీత కులాల ముద్దుబిడ్డ డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ఉత్తరాంధ్ర డాక్టర్ సర్దార్ గౌత లచ్చన్న గీత సహకులాల యువజన సంఘం. అధ్యక్షులు ఏకుల వెంకటేష్ గౌడ్ తొలిత గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఆయన మాట్లాడుతూ గౌతు లచ్చన్న ఒక మారుమూల గ్రామంలో జన్మించి భారతదేశం లోనే ముఖ్య నాయకుల్లో ఒకరు వారికి ప్రత్యేకమైన స్థానం ఉంది. దేశంలోనే మొట్టమొదటి పాదయాత్ర చేపట్టిన మహా నేత ఆయన ఎన్నోసార్లు పార్లమెంట్




సభ్యునిగా రాష్ట్ర మంత్రిగా శాసనసభ సభ్యునిగా ప్రతిపక్ష నేతగా వారు కొనసాగారు..అయితే వారి జయంతి ఉత్సవాలను అధికారకంగా నేడు విజయ వాడలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపట్టడం ఉత్తరాంధ్ర వాసులకు చాలా సంతోషకరమైన విషయం.కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ఉప ముఖ్యమంత్రి కొణిదె ల పవన్ కళ్యాణ్‌కి టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్‌కి రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు. ముఖ్యంగా త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల విభజన కార్యక్రమం కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉన్న పలాస ప్రాంతాన్ని జిల్లాగా మార్చబోతున్నారు. కనుక స్వాతంత్ర సమరయోధులు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పెన్నిధి అయినటువంటి డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న పేరుమీద జిల్లాని ప్రకటించాలని ఎప్పటినుండో ఉత్తరాంధ్ర వాసులు అనేకమార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నారు దయచేసి ఆ పోరాట యోధునికి పేరుమీద జిల్లా ప్రకటిస్తారని ఉత్తరాంధ్ర వాసులు కూటమి ప్రభుత్వం వైపు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ నాయకులు అల్లు రమణారావు. తమిరె శివ ప్రసాదరావు.అత్తిలి లక్ష్మణరావు గౌడ్.పోతన వెంకటేశ్వరరావు.దాట్ల శ్రీనివాసరాజు. కాకి లోకేష్ తదితరులు పాల్గొని ఆ మహానేత గౌతు లచ్చన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

# "సర్దార్" పోరాటాలు..నేటి తరం తెలుసుకోవాలి...

## సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి ఘనంగా నివాళులు : జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, సూర్య ప్రతినిధి

సర్దార్ గౌతు లచ్చన్న పోరాటాలు భావితరాలకు తెలియాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా శనివారం డే అండ్ నైట్ కూడలి వద్ద గల ఆయన విగ్రహానికి స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్, మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజిలతో కలసి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్దార్ గౌతు లచ్చన్న జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వ వేడుకలుగా గుర్తించి ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. జిల్లాలో స్వాతంత్ర్య సమరయోధులు స్వాతంత్ర్యో ద్యమ సమయంలో మహాత్మా గాంధీ ఎలా చేశారు .జిల్లాలోనూ అదే ఉద్యమం సాగించారన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒక బీసీ వర్గం కోసం మన పార్లమెంట్, అసెంబ్లీ దృష్టికి తీసుకు వెళ్లిన తర్వాత సుప్రీంకోర్టు వరకు కూడా వెళ్ళింద న్నారు. అప్పటి నుంచి బిసి వర్గానికి రిజర్వేషన్ రావడంలో సర్దార్ గౌతు లచ్చన్న కీలకపాత్ర పోషించినట్లు వివరించారు. ఇచ్ఛాపురం నుండి చెన్నై వరకు పాదయాత్ర చేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న యువతకు, భావితరాలకు సర్దార్ గౌతు లచ్చన్న చేసిన త్యాగాలు గుర్తి తెలియజేయాలన్నారు. ఇలాంటి గొప్ప నాయకులు జిల్లాలో పట్టడం జిల్లాకే గర్వకారణమన్నారు. మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజి మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రత్యేకంగా ముఖ్య మంత్రి, మంత్రివర్గ సభ్యులు మంత్రివర్గంలోని చర్చించి ఇది రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలోని జరగాలని, ప్రతి సంవత్సరం జరగాలనే ఉద్దేశం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, లోకేష్ కి దానిని గురించి కృషి చేసినటువంటి మంత్రివర్గ సభ్యులు ముఖ్యంగా బీసీ వెల్ఫేర్ మినిస్ట్రీ సవిత, అందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతోత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నట్లు వివరించారు. ఇచ్ఛాపురం నుండి ఉమ్మడి మద్రాసు వరకు 5 వేల మందితో పాద యాత్ర చేసినట్లు చెప్పారు. సర్దార్ గౌతు లచ్చన్నకు రాజగోపాలాచారితో గారితో ఉన్న అనుబంధాన్ని ఆయన వివరించారు. నరసన్నపేట శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న ఎన్నో పోరాటాలు చేశారన్నారు. స్వాతంత్ర్య ఫలాలు బడుగు బలహీన వర్గాలకు చేరాలనే ఆశయమని, ఆయన ఆశయాలకు అనుగుణంగా అందరము నడుచుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని విషయాల్లో కూడా సాక్షాత్తు ఒక స్నేహితుని ఇక్కడికి తీసుకొచ్చి ఎన్జీ రంగా ఎంపీగా కూడా గెలిపించినటువంటి ఉన్న తమైనటువంటి మనసున్న మహోన్నతమైన వ్యక్తి శ్రీకాకుళానికి దేశవ్యాప్తంగా పేరుంది అంటే అది సర్దార్ గౌతు లచ్చన్న పేరు తప్పక తప్పదన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష, మున్సిపల్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు పైడిశెట్టి జయంతి సర్దార్ గౌతు లచ్చన్న చేసిన పోరాలు, నేటి తరం ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. చౌదరి బాబ్జీ, రమణమాదిగ, తదితరులు మాట్లాడారు. నివాళులు అర్పించిన వారిలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఆర్డీవో కె. సాయి ప్రత్యూష, మాజీ మంత్రి గౌతు శ్యామసుం దర శివాజి, మున్సిపల్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు పైడిశెట్టి జయంతి, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పివివిడి ప్రసాదరావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి అనూరాధ, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు సర్దార్ గౌతు లచ్చన్నను ఆదర్శంగా తీసుకోవాలి

## - జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

సూర్య ప్రతినిధి విశాఖపట్నం

భావితర పౌరులందరూ సర్దార్ గౌతు లచ్చన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ విద్యార్థులకు పిలుపుని చ్చారు. సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా శనివారం ఉదయం గ్రీన్ పార్క్ హెూటల్ జంక్షన్ వద్ద గల సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమా లలంకరణ చేసి జయంతి వేడుకలను ప్రారంభించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికీ సర్దార్ గౌతు లచ్చన్న జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలి



యజేశారు. దేశభక్తితో ఎన్నో త్యాగాలను, ఉప్పు సత్యాగ్రహం వంటి అనేక పోరాటాలు చేసి మనకు స్వాతంత్ర్యం రావడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 35 సంవత్సరముల పాటు శాసనసభ్యులుగా పనిచేసి ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం, ప్రజల కోసం పోరాడిన యోధుడని అన్నారు. అటువంటి మహనీయుని పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను రాష్ట్ర పండుగగా జరుపుకోవడానికి అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వంకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా బీసీ స్టడీ సర్కిల్లో ఉన్న విద్యార్థుల సౌకర్యార్థం కంప్యూటర్లు, కాంపిటేటివ్ ఎగ్జామ్స్ ప్రిపేర్ అవుతున్న వారికి స్టడీ మెటీరియల్ అందజేస్తామని కలెక్టర్ తెలిపారు ఈ కార్య క్రమంలో సర్దార్ గౌతు లచ్చన్న కుటుంబ సభ్యులు యార్లగడ్డ వెంకన్న చౌదరి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, ప్రొఫెసర్ వివేకానందమూర్తి, కేశాని వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ సంఘం ప్రెసిడెంట్ గుత్తుల మధుసూదన రావు, శ్రీశయన సంఘం సెక్రటరీ ఒమ్మిడి రమణ, ఇతర అధికారులు, బీసీ సంక్షేమ హాస్టల్స్ విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నారా లోకేష్ దృష్టికి గిరిజన ప్రాంత సమస్యలు

అల్లూరి బ్యూరో,సూర్య ప్రతినిధి :

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనయుడు నారా లోకేష్ దృష్టికి గిరిజన ప్రాంతంలోని విద్య, వైద్య రంగాలతో పాటు మౌలిక వసతుల కల్పనకు చేపట్టవలసిన పలు అంశాలను తీసుకొని వెళ్ళినట్లు జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ తెలిపారు. ఉండవల్లి లోని నారా లోకేష్ స్వగృహంలో ఆయనను శనివారం మర్యాదపూర్వకంగా కలిసిన కిడారి శ్రావణ్ కుమార్ జిసిసి



నూతనంగా తయారుచేసిన గిఫ్ట్ ప్యాక్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఏజెన్సీలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు.జిసిసి బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, అదే విధంగా ఉద్యోగాలు కల్పన, మహిళా సంఘాలకు జిసిసి ద్వారా చేయూతను అందించే పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకుని వెళ్ళగా కార్యచరణకు హామీ ఇచ్చారన్నారు. అదేవిధంగా గిరిజన ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని నారా లోకేష్ తెలిపినట్లు కిడారి శ్రావణ్ కుమార్ తెలిపారు. అరకు పార్లమెంట్ పరిధిలో పార్టీలో నెలకొన్న పలు అంశాలను ఆయన దృష్టికి ఈ సందర్భంగా తీసుకున్నట్లు శ్రావణ్ తెలిపారు.

# జలపాతాల వద్ద సందర్శనకు ప్రవేశం లేదు

అల్లూరి బ్యూరో(అనంతగిరి ),
సూర్య ప్రతినిధి

వాతావరణం శాఖ సూచనల మేరకు అల్లూరి జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జల పాతాల వద్దకు పర్యాటకుల సందర్శనకు అనుమతి లేదని తహసిల్దార్ వీరభద్రాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.



అనంతగిరి మండలంలోని సరియా,కటికి, తాడిగుడ జలపాతాల వద్దకు సందర్శకులు ప్రవేశాన్ని మూడు రోజులపాటు నిషేధిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ మేరకు సరియా జలపాతానికి వెళ్లే రహదారిలో దేవరపల్లి పోలీస్ చెక్ పోస్ట్ వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే కటికి, తాటిగుడ జలపాతాలు వద్దకు సందర్శకులకు ప్రవేశం లేదని విషయాన్ని పర్యాటకులు గమనించి సహకరించాలని ఆయన కోరారు. జలపాతాల వద్ద వరదలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా ఈ చర్యను తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

# కిటకిటలాడిన పర్యాటక కేంద్రాలు

అల్లూరి బ్యూరో, సూర్యప్రతినిధి

అల్లూరి జిల్లాలో పర్యటక కేంద్రాలు శనివారం సందర్శకులతో కిటకిటలాడాయి. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం, కృష్ణాష్టమి, ఆదివారం వరుసగా మూడు రోజులు సెలవు దినాలు రావడంతో అల్లూరి జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలైన బొర్రా గుహలు, డమకు, గాలికొండ వ్యూ పాయింట్లు, అరకులోయ మ్యూజియం డుంబ్రిగుడ చాపరాయి వంటి ప్రాంతాలు సందర్శకులతో కిటికిటలాడాయి. మైదాన ప్రాంతాల



నుంచి పెద్ద ఎత్తున వాహనాలలో పర్యాటకులు రావడంతో ఘాట్ రోడ్ లో పలుచోట్ల ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు రెండు కిలోమీటర్ల మేర ఎక్కడకక్కడే వాహనాలు బారులు తీరాయి.ముఖ్యంగా డముకు వ్యూ పాయింట్, గాలికొండ వ్యూ పాయింట్, సుంకరమెట్ట ఉడెన్ బ్రిడ్జ్ వంటి ప్రాంతాల్లో వాహనాల రద్దీ అధికంగా ఉండడంతో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ హిమగిరి నేతృత్వంలో పోలీసులు ఎప్పటికప్పుడు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. శనివారం ఉదయం భారీ వర్షంతో కూడిన వాతావరణం ఉండగా మధ్యాహ్నం నాటికి పొగ మంచు అలముకొని సందర్శకులకు ఆహ్లాద భరితమైన వాతావరణాన్ని అందించింది.వరుస సెలవులు నేపథ్యంలో పర్యాటకులు ఒక్కసారిగా పోటీ ఎత్తడంతో వ్యాపారులలో జోష్ నింపింది.

# శ్రీ వేణుగోపాల స్వామి ప్రత్యేక పూజలు చేసిన అదిప్ రాజ్



సూర్య ప్రతినిధి పెందుర్తి

పెందుర్తి మండలం పురుషోత్తపురం లో గల శ్రీ వేణుగోపాల స్వామి వారికి శ్రీకృష్ణ జన్మాష్టమి పుష్కరించుకుని మాజీ ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదిప్ రాజు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి తీర్థ ప్రదేశాలు స్వీకరించి. భక్తులకు ప్రసాద విస్తరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గం ఉన్న ప్రజలందరికీ ఆ శ్రీకృష్ణుడి దీవెనలు ఎప్పుడూ ఉంటాయని, అందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఉప్పిలి కనకరాజు,గండి రవికుమార్,జిల్లా ఉపాధ్యక్షులు దేవి సాంబ,పెందుర్తి మండల పార్టీ అధ్యక్షులు గోరపల్లి శ్రీను,వార్డు అధ్యక్షులు రాపర్తి మాధవరావు,తమర్ల నర్సింగ్,ఆలయ కమిటీ చైర్మన్ కోరాడ చందు యాదవ్,ఆబోతు శ్రీను, యలమంచిలి శ్రీను,వేపాడ శ్రీను పాల్గొన్నారు.

# భావితరాలకు స్ఫూర్తి గౌతు లచ్చన్న

## - డిఆర్వో వై.సత్యన్నారాయణ రావు

అనకాపల్లి సూర్య జిల్లా బ్యూరో

స్వాతంత్ర్య సమర యోధులు సర్ధార్ గౌతు లచ్చన్న భావితరాలకు స్ఫూర్తి అని జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యన్నారాయణ రావు అన్నారు శనివారం ఉదయం కలక్టరేట్ సమావేశ మందిరంలో సర్దార్ గౌతు లచ్చన్న 116 వ జన్మదిన వేడుకలను జిల్లా



వెనుకబడిన తరగతల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యన్నారాయణ రావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్రి బాబు, జిల్లా వెనుకబడిన తరగతు సంక్షేమ మరియు సాధికారిత అధికారిణి కె. శ్రీదేవి, సహాయ వెనుక బడిన తరగతు సంక్షేమ అధికారి వి.గోపి సాధిరావు, వసతి గృహ సంకేము అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా డి అర్వో వై. సత్యన్నారాయణ రావు మాట్లాడుతూ నేటి తరానికి సర్ధార్ గౌతు లచ్చన్న లాంటి మహనీయుల జీవిత చరిత్రలు తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. మళ్ల సురేంద్ర బాబు మాట్లాడుతూ స్వాతంత్ర్య సముపార్చనలో గాంధీ వెంట ఉండి ఉప్పు సత్య గ్రహం, క్విట్ ఇండియా ఉద్య మాలలో పాల్గొన్నారని. రెండు పర్యాయములు జైలుకి వెళ్లారని, స్వాతంత్రం అనంతరం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసము నిర్విరాము కృషి చేసారని, అలాంటి వారి జీవితం రాబోయే తరాల వారికి ఆదర్మము అని చెప్పారు.

# నగర ప్రముఖులకు వజ్రోత్సవ సత్కారం

## నాగావళి ఎండి కొండబాబు

(శ్రీకాకుళం: సూర్య ప్రతినిధి)

జిల్లా వజ్రోత్సవాల సందర్భంగా నగర ప్రముఖులకు జిల్లా యంత్రాంగం సత్కారం చేసింది. సుదీర్ఘ చరిత్ర కలిగిన నగరంలో ప్రముఖ త్రి స్టార్ హెూటల్ అయిన నాగావళి ని మూడు దశాబ్దాల క్రితం వరదా కొండబాబు నిర్మాణం చేపట్టి ఎంతోమందికి మార్గదర్శకులు



అయ్యారు.. ఆ రోజుల్లో హెూటల్ నిర్మాణంలో ఆయన చూపించిన దూరదృష్టి కిజిల్లా యంత్రాంగం గుర్తింపు చేసి వజ్రోత్సవ సత్కారం చేసింది. అలాగే వావిలపల్లి జగన్నాధ నాయుడును కూడా జిల్లా అంతరంగం గుర్తించింది. ఈయన గతంలో చేసిన సేవలకు గుర్తింపుగా శుక్రవారం శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియంలో సన్మానించారు. వీరితోపాటు మరికొంతమందికి కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఘనంగా సత్కరించారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చన్నాయుడు.. జిల్లా కలెక్టర్ స్వాప్నిల్ దినకర్ పుండ్కర్,ఎస్పీ మహేశ్వరరెడ్డి, శ్రీకాకుళం, నరసన్నపేట, ఎచ్చెర్ల శాసనసభ్యులు గొండు శంకర్,బగ్గు రమణ మూర్తి, నడికుదిటి ఈశ్వరరావు, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, జాయింట్ కలెక్టర్ జోనైల్ అహ్మద్ అహ్మద్ తదిరులు పాల్గొన్నారు.

# కృష్ణాష్టమి మహెూత్సవాలలో ముఖ్యఅతిథిగా బెహరా

సూర్య ప్రతినిధి గోపాలపట్నం

92 వ వార్డు వెంకటాపురంలో శ్రీ శ్రీ శ్రీ వేణుగోపాల మహాగణపతి, అభయాంజనేయ స్వామి, సుబ్రహ్మణ్యస్వామి, సాయిబాబా వారి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి మహెూత్సవము లు ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కర రావు



స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉప్పిలి కనకరాజు, గొంతిన నాగరాజు, బెహరా సత్యనారాయణ అట్ట శంకర్, హరి, పల్లా సూరిబాబు, వురుకూటి అప్పలరాజు, నూకరాజు ఉరుకూటి రాజేష్, ఉరుకూటి సురేష్, ఉరుకుటి మహాలక్ష్మి, నూనెల అప్పల నాయుడు, కోన రాజు, నూనెల కనకరాజు, ఎలమంచిలి దుర్గారావు, కనకరాజు, వాసు, కోండ్రి వెంకటేష్, ఉప్పిలి వెంకటేష్, రాజేష్ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన బెహరా



సూర్యాపేట నిధి గోపాలపట్నం

91 వ వార్డు పాత గోపాలపట్నం లో శ్రీ వేణుగోపాల స్వామి సహిత జగన్నాథ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పంచరాత్రి మహెూత్సవములు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కర రావు విచ్చేసి, స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే 98 వ వార్డు అప్పన్నపాలెంలో శ్రీ శాంతి గీత సేవా సంఘం వారి ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ గోపీజన వల్లభ స్వామి దేవాలయంలో బెహరా భాస్కర రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొంతిన నాగరాజు, బెహరా సత్యనారాయణ, అట్టా శంకర్, గొలగాన కనక రాజు, కొండబాబు, నైదాన ఈశ్వరరావు, శ్రీను, రాజు, రాము, సంతోష్, రామకృష్ణ, నాగేశ్వరరావు ఒమ్మి సత్యారావు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విశాఖ నగరంలో మరో రెండు ఔట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు! రౌడీలు లేని నగరంగా తీర్చిదిద్దుతాం

## విశాఖ నగరపోలీస్ కమిషనర్ శంక బ్రతభాక్షి వెల్లడి!.

సూర్య క్రైమ్ బ్యూరో, విశాఖపట్నం

విశాఖపట్నం నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో మరో రెండు ఔట్ పోలీస్ స్టేషన్ లను ఏర్పాటు చేయనున్నట్లు నగర పోలీస్ కమిషనర్ శంక బ్రత భాక్షి వెల్లడించారు. నగరంలోని పోలీస్ స్టేషన్ల పర్యవేక్షణలో భాగంగా మీడియా కి ఇచ్చిన ఇంటర్వ్యూలో సిపి మాట్లాడుతూ, విశాఖ జిల్లా, నగర పరిధిలో నివసించే ప్రజలు ప్రశాంతంగా ఉండాలని తాను విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. రౌడీలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలన్నదే! తన ప్రధాన ధ్యేయమని, రౌడీలకువిశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్థానం లేదన్నారు. ప్రస్తుతం విశాఖలో యాక్టివ్ రౌడీలు లేరని, రౌడీయిజం చేస్తే తాటతీయడమే గాక, వారు ఉంటే జైల్లో ఉండాలి... లేదంటే వేరే జిల్లాలో ఉండాలి తప్ప! విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉండడానికి వీలులేదని కమిషనర్ హెచ్చరించారు. శాంతిభద్రతలు పరిరక్షణ ,దొంగతనాల నివారణ విషయమై ఇప్పటికే 89 ద్విచక్ర వాహనాలను తెప్పించి ఆ వాహనాల ద్వారా సిబ్బందితో పర్యవేక్షణ చేయడమే గాక, రౌడీల, నేరస్తుల కదలికలపై డ్రోన్ల ద్వారాడేగ కన్నువేస్తున్నట్లు తెలియజేశారు. నగర ప్రజల కోరిక మేరకు గత ఏడేళ్ల నుండి జ్ఞానాపురంలో అవుట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన లో భాగంగాఅవుట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని ,అలాగే కప్పరాడ, కరా స ప్రాంతాలలో ఔట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎటువంటి పరిస్థితుల్లో నైనా రౌడీయిజం చేస్తే సహించేది లేదని, వీరి కదలికలపై ఎప్పటికప్పుడు లిఖితపూర్వకంగా సంబంధిత ఎస్ హెచ్ ఓ ల నుండి సమాచారం తెప్పించుకుంటున్నట్లు సి.పి.చెప్పారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా విశాఖ నగరం ప్రశాంతంగా ఉంటూ ప్రజలు ధైర్యంతో, క్షేమంగా ఉండాలన్నదే! తనతపనని పోలీస్ కమిషనర్ మీడియాకు తెలియజేశారు.



# దివ్యాంగులు ఆత్మస్థైర్యమేగా జీవితం కొనసాగించాలి : ప్రముఖ పారిశ్రామికవేత్త బోడేపూడి



సూర్యప్రతినిధి,ఆగిరిపల్లి:
పుట్టుకతో గాని ప్రమాదం వల్ల గాని శరీర అవయవ భాగాలను కోల్పోయిన దివ్యాంగులు వివిధ సంస్థలు అందజేయుచున్న కృత్రిమ అవయవాలను వినియోగించుకుని ఆత్మస్థైర్యంతో జీవితాన్ని కొనసాగించాలని ప్రముఖ పారిశ్రామికవేత్త బోడేపూడి శివ కోటేశ్వరరావు అన్నారు. దిగవంత ఎ.లక్ష్మణరావు జ్ఞాపకార్థం వారి మిత్రులు జి.శ్రీబ్రహ్మయ్య తదితరులు అందజేసిన విరాళముతో మండలంలోని తోటపల్లి గ్రామం లో గల హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన బొక్క.సాయిరాం ప్రకాశం జిల్లాకు చెందిన పోకా. ప్రవీణ్ కుమార్, గుంటూరు జిల్లాకు చెందిన చల్లా.శివ శంకరరావు, మచిలీపట్నం కు చెందిన సైనా గోపాలకృష్ణ లకు కృత్రిమ కాళ్ళను అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దాతలసహకారంతో హీల్ సంస్థ అందజేయుచున్న హైటెక్ కృత్రిమ కాళ్ళు దీర్ఘకాలం మన్నుతాయన్నారు.
హీల్ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటివరకు 752 కృత్రిమ కాళ్ళను అమర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దార్థ అకాడమీ నుండి తాడిపనేని రమేష్, యూకె కు చెందిన నీహా, మరియు కృత్రిమ అవయవకేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రి క్షేత్రంలో భక్తులకు మెరుగైన వైద్యసేవల ఏర్పాటు



సూర్యప్రతినిధి ఇంద్రకీలాద్రి
శ్రీ దుర్గా మల్లేశ్వరుల దర్శనం కోసం ఇంద్రకీలాద్రి కి విచ్చేసే భక్తులకు ఏదైనా ఆరోగ్య అత్యవసర పరిస్థితి ఏర్పడితే తక్షణమే స్పందించి వైద్య సేవలు అందేలా దేవస్థానం వైద్య కేంద్రానికి జవ సత్వాలు కల్పిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి. కె. శీనానాయక్ పేర్కొన్నారు. శనివారం ఉదయం దేవస్థానం ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. వైద్యులు పూర్తి స్థాయిలో లేకపోవడం, రోగుల వివరాల నమోదు లో లోపాలు,అవసరమైన మందులు లోటు గమనించి, అర్హత గలిగిన నర్సింగ్ సిబ్బంది కేటాయించినా ఇంకా ఆరోగ్య కేంద్రం పరిస్థితి లో మార్పురాకపోవడంపై ఈవో అసహనం వ్యక్తం చేశారు. ఇరుకు గదిలో ఆరోగ్యకేంద్రం నిర్వహించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ, తగినంత గాలి వెలుతురు వచ్చేలా విశాలంగా మార్పు చేయాలని ఇంజనీరింగ్ సిబ్బంది ని ఆదేశించారు. ఈ తనిఖీ లో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సి హెచ్ రంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. రాంబాబు పాల్గొన్నారు.

# భావితరాలకు స్ఫూర్తి.. అణగారిన వర్గాల ఆశాజ్యోతి కీ.శే. సర్దార్ గౌతు లచ్చన్న

సూర్యప్రతినిధి రాజమహేంద్రవరం
ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసి, తను నమ్మిన సిద్దాంతం కోసం ఎక్కడా రాజీ పడకుండా బడుగు, బలహీన వర్గాలకు దిక్సూచిగా నిలిచిన సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తిదాయకమైన జీవిత చరిత్రను భావి తరాలకు తెలపాల్సిన అవసరముందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్వాతంత్ర్య సమరం, రాజకీయ ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించిన కీ.శే. సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి వేడుకలను పురస్కరించుకొని శనివారం రాజమహేంద్రవరం వై జంక్షన్ లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి మంత్రి కందుల దుర్గేష్ ఘన నివాళులర్పించారు.తెలుగు జాతికి గర్వకారణమైన సర్దార్ గౌతు లచ్చన్న లాంటి గొప్ప వ్యక్తి జయంతిని ఏటా అధికారికంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షనీయమన్నారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసిన సర్దార్ గౌతు లచ్చన్నను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.గౌతు లచ్చన్న ఆశయాలు ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్న రాజమండ్రి గౌడ, శెట్టి బలిజ సంఘానికి అభినందనలు తెలిపారు. స్వాతంత్ర్యం ముందు, తర్వాత ప్రజలను ప్రభావితం చేసిన గొప్ప వ్యక్తి గౌతు లచ్చన్న



జయంతిని జీవో నంబర్ 83 ద్వారా అధికారికంగా, రాష్ట్ర పండుగగా నిర్వహించుకునే అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లకు ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ ధన్యవాదాలు తెలిపారు. గౌతు లచ్చన్న పేరు వింటేనే ఉద్యమానికి నిలువెత్తు రూపంగా నిలుస్తారని మంత్రి దుర్గేష్ అభివర్ణించారు. భారతదేశ రాజకీయాల్లో సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ బిరుదు పొందిన మహనీయులు గౌతు లచ్చన్న అని గుర్తుచేశారు.సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో 7 పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా నెగ్గారని, మంత్రిగా కూడా చేశారని వివరించారు. ప్రజల తరపున పోరాడిన ఘటనలు కోకొల్లలు అని వెల్లడించారు. కల్లుగీత కార్మికుల పక్షాన నిలబడి వారి హక్కుల సాధనకు కృషి చేశారని పేర్కొన్నారు. 96 సంవత్సరాల తన జీవిత కాలంలో రాష్ట్ర ప్రజలను ఎంతగానో ప్రభావితం చేశారని నాడు పలాసలో ఒక్కడే అఖిల భారత కిసాన్ సభను నిర్వహించి పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. మెట్రిక్యులేషన్ చదువుతున్న సమయంలో మహాత్మా గాంధీజీ పిలుపుమేరకు ఉద్యమంలోకి అడుగుపెట్టారని, అనేక పర్యాయాలు ప్రజల కోసం జైలుకు వెళ్లారని, అలాంటి ఎందరో గొప్ప వ్యక్తుల త్యాగనిరతి వల్లే నేడు మనం స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నామని తెలిపారు. గౌతు లచ్చన్నను సముచితంగా గౌరవించుకునేలా సీఎం చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయంతో రాబోయే రోజుల్లో జయంతి వేడుకలు మరింత అద్భుతంగా నిర్వహించుకుంటామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. దేశ, రాష్ట్ర ప్రజలకు మార్గదర్శకుడైన లచ్చన్న లాంటి నాయకుడి గొప్పతనాన్ని తెలియజేసే అవకాశాన్ని పొందుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా జోహార్ గౌతు లచ్చన్న అని మంత్రి కందుల దుర్గేష్ నినదించారు.

## ఘనంగా గౌతు లచ్చన్న జయంతి



సూర్య ప్రతినిధి. చాట్రాయి.
చాట్రాయి మండలం పర్వతాపురం గ్రామంలో చాట్రాయి మండలం గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న 116 వ జయంతి కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించడం జరిగింది. జిల్లా తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ కార్యనిర్వ కార్యదర్శి తల్లాడ. శ్రీనివాసరావు ,టీడీపీ మండల కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బూబత్తుల .చెన్నారావు లు మాట్లాడుతూ సర్దార్ లచ్చన్న గాంధీజీ పిలుపు మేరకు క్విట్ ఇండియా, ఉప్పు సత్యాగ్రహం,విదేశీ వస్తువు బహిష్కరణ ఉద్యమాలలో పాల్గొనటం జరిగింది అని గుర్తు చేసారు. చాట్రాయి మండలం గౌడ సంఘం అధ్యక్షులు చింతగుంట్ల .వెంకటేశ్వరావు మాట్లాడుతూ స్వతంత్ర ఉద్యమం లోనే కాకుండా బడుగు బలహీన వర్గాల అభ్యునతి కోసం, దళితులపట్ల అంటరానితనం నిర్ములన కోసం పాటుపడ్డారని అన్నారు. ఈకార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు సభ్యులు గౌడ కులస్తులు పర్వతాపురం సర్పంచ్ మిద్దె. శివరామకృష్ణ, పలాగని. రఘు నాదం, నారాయణ, శివ, మిద్దె వీరయ్య, అర్జునరావు, సాంబశివరావు, సర్వేశ్వరావు, బూబత్తుల తాతారావు, బయగాని చెన్నారావు, లక్ష్మణారావు, గోపాలస్వామి, గోపయ్య మిద్దె వాసు , గౌడ సంఘయులు పాల్గొన్నారు.

# గౌతు లచ్చన్న పోరాట పటిమ మార్గదర్శకం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

సూర్య ప్రతినిధి – రాజమహేంద్రవరం :
ప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ రాజకీయ నాయకుడు గౌతు లచ్చన్న పోరాట పటిమ మనకే కాదు, భవిష్యత్తు తరాలకు కూడా మార్గదర్శకం అని రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే శ్రీ ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా కూటమి ఆధ్వర్యంలో అధికారికంగా స్థానిక వై జంక్షన్ లోని గౌతు లచ్చన్న విగ్రహం దగ్గర జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసు పాల్గొని పూలమాల వేసి నివాళు లర్పిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత "సర్దార్" అనే గౌరవ బిరుదు పొందిన ఏకైక తెలుగు నాయకుడు లచ్చన్న అని అన్నారు. గత ఐదేళ్లు వైసిపి పాలనలో బీసీలను పట్టించుకోలేదు సరికదా, ప్రజా నాయకుడైన గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలన్న కనీస ఆలోచన కూడా వారికి రాలేదని ఆయన ఎద్దేవా చేసారు. కూటమి ప్రభుత్వం లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించి, జీవో కూడా ఇచ్చిందని ఆయన అన్నారు. గౌతు లచ్చన్న కుటుంబానికి, మా కుటుంబ సభ్యులకు సన్నిహిత సంబంధం ఉందని ఆయన ప్రస్తావించారు. లచ్చన్నతో మా మామయ్య... కేంద్ర మాజీ మంత్రి



స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు, కలిసి పని చేశారని, వారిద్దరికీ అత్యంత సన్నిహిత సంబంధం ఉందని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఇక లచ్చన్న కుమారుడు గౌతు శ్యామ్ సుందర్ శివాజీతో మా నాన్న ఆదిరెడ్డి అప్పారావు ఎమ్మెల్సీగా ఉన్నపుడు కల్సి పనిచేశారని, ఇప్పుడు నేను, లచ్చన్న మనవరాలు గౌతు శిరీష శాసన సభలో ఉన్నామని ఎమ్మెల్యే వాసు గుర్తుచేశారు. మూడు తరాలుగా ఒకే కుటుంబంతో ఇలా అనుబంధం ఉండడం ఆనందంగా ఉందన్నారు. గీత కులాలకు ఆరాధ్యదైవం అయిన గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం జరుగుతోందని ఎమ్మెల్యే వాసు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వానికి ఆయన పట్ల, బీసీ కులాల పట్ల ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. మహనీయులు అందరివారని ఆయన అన్నారు. ముఖ్యంగా రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గ కుడుపూడి సత్తిబాబు నియమితులయ్యారని ఆయన గుర్తుచేసారు. కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ బీసీలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే వాసు చెప్పారు. గతంలో బీసీల కోసం ఆదరణ పథకాన్ని అమలు చేసి బీసీలకు వారి వృత్తి పరమైన పని ముట్ల అందించడం జరిగిందని, అధికారం చేపట్టిన జగన్ ఆ ఆదరణ పథకాన్ని అటకెక్కించారని ఎమ్మెల్యే వాసు విమర్శించారు. అలాగే రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, కూడా గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజానికి గౌతుల చిన్న చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## హై స్కూల్ కు వైభవ్ జ్యువెలర్స్ వారు మైక్ సెట్ వితరణ




సూర్య ప్రతినిధి కే కోటపాడు
ప్రభుత్వ పాఠశాలకు మైక్ సెట్ వితరణ ఇచ్చిన వైభవ్ జ్యూయలర్స్ యజమానులు అభినందనీయులని ప్రధానోపాధ్యాయురాలు ఎస్వీ పద్మావతి కొనియాడారు. మండల కేంద్రం కే కోటపాడు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మైక్ సెట్ సౌండ్ సిస్టం అందించడం పట్ల పాఠశాల విద్యార్థులు అందరి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పద్మావతి తెలిపారు. పాఠశాలలో పనిచేస్తున్న సైన్స్ అసిస్టెంట్ బత్తి విజయలక్ష్మి ప్రోత్సాహంతో పాఠశాలకు ఈ మైక్ సెట్ ను అందించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్



సూర్యప్రతినిధి జిల్లా బ్యూరో ఏలూరు
ఏలూరు పట్టణ ఏటిగట్టులోని యాదవ సంఘం భవన్ లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య కు స్థానిక యాదవ సంఘం సభ్యులు ఘన స్వాగతం పలికారు. శ్రీకృష్ణునికీ ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ అందరికి సౌభాగ్యం, ఆనందం, ఆరోగ్యం, విజయాలు కలగాలని కోరుకుంటూ శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలుపారు. ఎంపి, ఎమ్మెల్యే చిన్నారులు, మహిళలతో కలిసి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నరు.ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ కృష్ణాష్టమి అంటే తనకు ఎంతో ఇష్టమని, చిన్నప్పటి నుంచి తాను కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనేవాడినని, ఆ శ్రీకృష్ణ భగవానుని ఆశీస్సులతో అందరూ ఆనందంగా, క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నానని ఎంపీ తెలిపారు.

## కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న యార్లగడ్డ



సూర్యప్రతినిధి– గన్నవరం :
విజయవాడ రూరల్ మండలం ఎనికెపాడు గ్రామంలోని జెండాల చెట్టు సెంటర్ వద్ద స్థానిక యాదవ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. వేడుకల్లో పాల్గొన్నందుకు శనివారం సాయంత్రం గ్రామానికి వచ్చిన యార్లగడ్డకు ఆలయ కమిటీ సభ్యులు, యాదవ యూత్ నాయకులు ఘన స్వాగతం పలికారు. కృష్ణయ్యను దర్శించుకున్న యార్లగడ్డ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొని గ్రామ ప్రజలను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులతోపాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భవిష్యత్తులో విమాన ఇంధనంగా పామాయిల్

### -శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో రైతులకు శుభవార్త చెప్పిన ఎంపీ మహేష్ కుమార్

సూర్య జిల్లా బ్యూరో ఏలూరు
శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు దెందులూరు నియోజకవర్గంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా దెందులూరు మండలం, చల్ల చింతలపూడి గ్రామ కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. స్థానిక గ్రామంలోని వేణుగోపాలస్వామి, వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ ఎంపీ మహేష్ కుమార్ తమ నియోజకవర్గానికి, ఈ రోజు రావటం చాలా సంతోషం అని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి తనకు శ్రీకృష్ణాష్టమి అంటే ఇష్టమని, ఈసారి ఇక్కడ గ్రామస్థులతో కలిసి శ్రీకృష్ణజ న్మాష్టమి వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం కూడా ఏలూరు నియోజకవర్గంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని, గత సంవత్సరం కూడా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్నట్లు గుర్తు చేసారు. ఈ సందర్భంగా గిట్టుబాటు ధర కోసం ఇబ్బందులు పడుతున్న పామాయిల్ రైతులకు ఎంపి శుభవార్త చెప్పుతూ, రాబోయే కాలంలో విమాన ఇంధనంలో పామాయిల్ కలిపి వాడే విధంగా శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధనలు విజయవంతం అయ్యాయని,



వచ్చే 10-12 ఏళ్లలో విమాన ఇంధనంగా పామాయిల్ వాడే పరిస్థితి వస్తే,ఆయిల్ పామ్ రైతుల కష్టాలు తీరిపోతాయని చెప్పారు. అప్పుడు ఆయిల్ పామ్ ధర టన్నుకు 50 వేలకు చేరే అవకాశం ఉందని, కాబట్టి ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని రైతులు ఆయిల్ పామ్ పంటను విరివిగా సాగు చేయాలని ఎంపీ మహేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి సత్యనారాయణ, జనసేన, బీజేపీ నేతలు మరియు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### డా. వంపూరు గంగులయ్య రాష్ట్ర జానపద కళలు సృజనాత్మకత అకాడమి చైర్మన్ పదవి ప్రకటన తో

# పాడేరులో జనసేన పార్టీ నాయకుల సంబరాలు

సూర్య ప్రతినిధి కొయ్యూరు
అల్లూరి సీతారామరాజు జిల్లా జనసేనా పార్టీ కార్యాలయంలో గౌరవ రాష్ట్ర జానపద కళలు సృజనాత్మకత అకాడమి చైర్మన్ పాడేరు జానసేనా పార్టీ ఇన్చార్జి డాక్టర్! వంపూరు గంగులయ్యని పాడేరు జి.మాడుగుల ముఖ్య నాయకులు జిల్లా కమిటినాయకులు మండల అధ్యక్షులు ఈరోజు ఘనంగా సత్కరించడం జరిగింది జనసేన పార్టీ కార్యకర్తలు అభిమానులు థింసా నృత్యలతో బండ్ బజలతో తమ నాయకునికి రాష్ట్ర చైర్మన్ హెూదా రావడం మాకు ఎంతో ఆనందంగా భనసంచలు కాల్సి సంబరాలు చేసుకున్నారు ఈసందర్భంగా గౌరవ డాక్టర్ గంగులయ్య మాట్లాడుతూ తప్పకుండా నాకు అప్పగించిన భత్యతను నిరవేరుస్తు ప్రజలకు అందుబాటు లో ఉంటామని జానపద కళలు యొక్క జానపద కళలలను పునర్వైభం తీసుకువస్తానని తెలిపారు జి మాడుగుల చైర్మన్



ప్రమాణ స్వీకారం కోసం గంగులయ్య దిశా నిర్దిషణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా ఉప అధ్యక్షురాలు కిట్లంగి పద్మ ఐటీ ఇన్చార్జి సాలేబు అశోక్ మార్కెట్ యడ్ డైరెక్టర్ పాంగి శివాజీ. డైరెక్ట్ వంపూరు రమేష్ మండల అధ్యక్షులు నందోలి మురళీ కృష్ణ ఉప అధ్యక్షులు సీసాల భూపాల్ వీర మహిళా దివ్యలత.పట్టణ అధ్యక్షుడు మజ్జి నగేష్ .ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులు వంపూరు సురేష్.జి.మాడుగుల చైర్మన్ తల్లే త్రిమూర్తులు జి మాడుగుల మండల అధ్యక్షులు మసాడ భీమన్న పాడేరు మండల నాయకులు కుంచే దేవేంద్ర ప్రసాద్ నిలయదొర కోటి కమలహసన్ సాయి. లంకెల పవన్ కొర్ర భానుప్రసాద్ సాగేని బాలకృష్ణ వీర మహిళలు ముఖ్యనాయకులు జనసైనకులు పాల్గొన్నారు.

# గంజాయి రవాణా వినియోగంపై కలిగే నష్టాలపై వివరణ

రాజవొమ్మంగి సూర్య ప్రతినిధి
రాజవొమ్మంగి మండలం జడ్డంగి చైతన్య నగర్ గ్రామానికి వెళ్లి గ్రామ ప్రజలతో సబ్ ఇన్స్పెక్టర్ చిన్నబాబు సమావేశం నిర్వహించారు . గ్రామస్తులతో చర్చించి పలు అంశాలపై అవగాహన కల్పించాము. గంజాయి సాగు, రవాణా, వినియోగం వలన కలిగే నష్టాలను వివరించి, అలాంటి అక్రమ కార్యకలాపాలలో పాల్గొనకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాము. బాల్యవివాహాలు బాల్యవివాహాలు చట్టపరంగా నేరమని, వాటి వల్ల పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుందని తెలియజేసి, ఇలాంటి వివాహాలను అరికట్టాలని గ్రామస్తులను కోరాను.వ్యవసాయ పొలాల్లో విద్యుత్ వైర్లు



వేయడం- పశువులను, అడవి జంతువులను చంపే ఉద్దేశ్యంతో పొలాల్లో విద్యుత్ వైర్లు వేయడం ప్రాణాంతకం అవుతుందని, ఇలాంటి అక్రమ చర్యలు చేస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాము. ఉద్యోగ మోసాలు ఉద్యోగ వంచనలు తప్పుడు హామీలతో డబ్బులు తీసుకొని ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసే వారి నుండి జాగ్రత్తగా ఉండాలని, ప్రభుత్వ పరీక్షలు, నోటిఫికేషన్ల ద్వారానే నిజమైన ఉద్యోగాలు వస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రి క్షేత్రంలో జరిగే దేవి శరన్నవరాత్రులకు..

**ప్రభుత్వ శాఖలన్నీ స్వచ్ఛందంగా, సేవ చేయాలని శ్రీకృష్ణ భగవానుడికి, వినతిపత్రం సమర్పించిన ఇంద్రకీలాద్రి పరిరక్షణ సమితి**



సూర్య ప్రతినిధి విజయవాడ
విజయవాడ, ఇంద్రకీలాద్రి క్షేత్రంలో జరిగే దేవి శరన్నవరాత్రులకు అన్ని ప్రభుత్వ శాఖలు స్వచ్ఛందంగా సేవ చేయాలని, ఈ పండుగను రాష్ట్ర పండుగ చేసి, నిధులు కేటాయించాలని.. శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా, ఆ శ్రీకృష్ణ పరమాత్మునికి ఇంద్ర కీలాద్రి పరిరక్షణ సమితి సభ్యులు వినతిపత్రం సమర్పించారు. ఇంద్ర కీలాద్రి పరిరక్షణ సమితి సభ్యులు ఆవేదన చెందుతూ... హిందువుల అతి పెద్ద పండుగ అయిన దసరా నవరాత్రులకు, సేవలు అందించే అన్ని శాఖల వారు...దీనికి భిన్నంగా సేవలందిస్తున్నారు...ప్రజాస్వామ్య ప్రభుత్వాలు భక్తులు చేసుకునే వేడుకలకు ప్రభుత్వ శాఖ ఉద్యోగిగా సేవలందించాలని.. కానీ భక్తులు వేసిన కానుకల నుండి దసరా నవరాత్రులకు ఉద్యోగిగా సేవలందించినందుకు గాను, వారి జీతభత్యాలు పొందడం చాలా బాధాకరమని... ఇప్పటికైనా అన్ని శాఖల వారు స్వచ్ఛందంగా ప్రభుత్వ శాఖ ఉద్యోగిగా సేవ చేసే విధంగా.. ఆ శ్రీకృష్ణ పరమాత్ముడు వారికి సంకల్పం కలుగజేయాలని, ఆ శ్రీకృష్ణ పరమాత్ముని సమితి సభ్యులు వేడుకోవడం జరిగింది.

## ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు...

సూర్య ప్రతినిధి రంపచోడవరం



రంపచోడవరం జీవీకే పాఠశాల నందు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం కృష్ణాష్టమి సందర్భంగా జీవీకే పాఠశాల నుండి అంబేద్కర్ సెంటర్ వరకు పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక రామాలయం వద్ద పిల్లలతో కోలాట కార్యక్రమం చేపట్టారు. అనంతరం పాఠశాల వద్ద ఉట్టిని ఏర్పాటు చేసి పిల్లలచే ఉట్టిని కొట్టించారు. ఈ సందర్భంగా పాఠశాల పిల్లలు రాధాకృష్ణ వేషధారణలో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచారకులు గుడ్లఅంక శ్రీనివాస్ రెడ్డి నల్లమిల్లి రామారెడ్డి అర్చకులు అద్దంకి వెంకటేశ్వరరావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి



చింతపల్లి. సూర్య. ప్రతినిధి.
చింతపల్లి .మండలంలో గల స్థానిక విజ్ఞాన భారతి .పాఠశాల ఆఫ్ బి.వి. కె లో శ్రీ కృష్ణ జన్మాష్టమి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ జి. మోహన్ రావు గారు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండి విద్యార్థిని ,విద్యార్థులకు భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, విద్యాతో పాటుగా భారతీయ విలువలు నేర్పించాలనే ఉద్దేశ్యంతో పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఎంతో శ్రద్ధగా గోపికలు గా, చిన్ని కృష్ణులుగా అలంకరించుకొన్ని పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు పి.వెంకటేష్ , చింతపల్లి ఖండ కార్యవహ కె. శ్రీనివాసరావు గారు, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

12
సూర్య
విజయవాడ
ఆదివారం 17
ఆగష్టు 2025

# లక్కీ గోవిందు ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు

సూర్య ప్రతినిధి పెందుర్తి

శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా పురుషోత్తపురం గ్రామ ప్రజలు పెద్దలు ఆలయ కమిటీ మరియు లక్కీ గోవింద్ ఆహ్వానం మేరకు శాసనసభ్యులు పెందుర్తి పంచకర్ల రమేష్ బాబు విచ్చేసి కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని దేవుని దర్శించుకోవడం జరిగింది.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గ ప్రజలందరకి ఆ శ్రీకృష్ణుడు దీవెనలు ఉండాలని.. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని, ఈ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నందుకు ఒక అదృష్టంగా ఉంది అంటూ ఆనందం వ్యక్తం చేశారు..ఈ కార్యక్రమంలో పెందుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉరిటి లక్కీ గోవింద్ లి కోటిబని శ్రీను, చందు యాదవ్, జగన్ మోహన్, యలమంచిలి వెంకట శ్రీను, చీర అప్పలరాజు, ఆబోతు శ్రీను, చీర రాజు, ఆబోతు రమణ, ఉరిటి శ్రీను, పిల్లల రాజు, పిల్లల శ్రీను, దాకారపు కృష్ణ బమ్మిడి, సత్యనారాయణ, చీర కన్నా రావు, విజయ్, నమ్మి హర్షవర్ధన్, దాకారపు ఈశ్వరరావు, పల్ల కళ్యాణ్, చైర్మన్ అయితి సింహాచలం, మోటూరి చైతన్య, రాపర్తి కిషోర్, వరూధిని, వెంకటేష్, ఆలయ కమిటీ మరియు గ్రామ పెద్దలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.



# చిన్ని కృష్ణుని ఆశీర్వదము, చల్లని దీవెనతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి: మంత్రి కొలుసు పార్థసారధి

సూర్యప్రతినిధి, ఆగిరపల్లి

మండల పరిధి వివిధగ్రామాలలో వెంచివున్న శ్రీ కృష్ణుని గుడి సన్నిధానంలో నిర్వహించిన శ్రీకృష్ణుని జన్మదిన ఏడుకల్లో (నెక్కలం గొల్లగూడెం, ఎస్, ఎ, పేట, ఆగిరిపల్లి,వడ్లమాను) కృష్ణాష్టమి సందర్భంగా శ్రీ కృష్ణుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన రాష్ట్ర గృహనిర్మాణ మరియు సమాచార పౌరసంబంధాల మంత్రి కొలుసు పార్థసారధికి తొలుత వేదపండితులు, అర్చకులు మేల, తాళలతో,పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించి,దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. తదనంతరం సంస్కృత కార్యక్రమాలు తిలకించిన మంత్రి శ్రీ మురళీ కృష్ణ కోలాట భజన సంఘము వారిచే చిన్నారులతో కోలాటలు పలు సంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల నృత్యాలు కోలాటాలు తిలకించి చిన్నారులను ఆశీర్వదించిన మంత్రి, ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో పూర్వం అందరూ కలిసి మెలిసి కోలాటాలు కర్రసాము పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా అందరూ కలిసి మెలిసి అన్నదమ్ములలా ఉండేవారని తద్వారా ఆరోగ్యము, ఆనందము, సంతోషంగా జీవించేవారని అన్నారు ఈ ఆధునిక జీవనంలో ప్రతీ ఒక్కరూ బిజీ జీతం గడపడం ద్వారా ఈలాంటి సంస్కృత కార్యక్రమాలు లేక కొంత కుటుంబ నైతిక విలువలు వుండడంలేదని ఇకనుండైన ఈ లాంటి



సాంస్కృతిక కార్యక్రమాలు సాంప్రదాయాలు పాటించడం మంచిదని చూసించారు. తద్వారా కుటుంబ వ్యవస్థ మెరుగు పడి సహోదర ప్రేమ కల్గి తద్వారా మెరుగైన సమాజం ఏర్పడుతుందని, అది అందరికీ మంచిదని తెలిపారు. భక్తులకు అన్నప్రసాధాలు వడ్డించి భక్తులకు అభివాదం చేసిన మంత్రి శ్రీ కృష్ణుని కరుణా కటాక్షంతో జిల్లా రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో సుభిక్షంగా జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి తద్వారా రాష్ట్ర రైతాంగం అంతా పాడి పంటలతో వర్ధిల్లాలని,శ్రీ కృష్ణుడు ఎంతో మహిమ గల దైవం అని కోరిన కోర్కెలు వెంటనే చిద్దించునని, శ్రీ కృష్ణుని కరుణా కటాక్షంతో ప్రజలు, రైతులు మరియు గొర్రెలు, మేకలు, ఆవులు, గేదలు, పశు సంపద అంతా దిన దిన అభివృద్ధి చెంది తద్వారా ప్రజలంతా ఆర్థికంగా బలపడాలని ఆకాంక్షించారు.శ్రీ కృష్ణుడి దయతో రాష్ట్ర ప్రజలు ఆరోగ్యం,అష్టైశ్వర్యాలతో సంతోసధాయకమైన జీవితం గడపాలని,అలాగే చిన్ని కృష్ణుడి దీవెన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రభుత్వం మెండుగా ఉండాలని, తద్వారా మంచి పరిపాలన అందించాలని అన్నారు మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత బహుళ జాతి పరిశ్రమలు మన రాస్త్రానికి తరలి వస్తున్నాయని,త్వరలో వాటిని నెలకొల్పడం ద్వారా యువతీ యువతకు లక్షల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు వచ్చి రాష్ట్రం ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు అపార అనుభవం దూరదృష్టి చిత్తశుద్ధి కల్గిన ఆర్థిక నిపుణుడైన మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు రాకతో రాష్ట్రం సంక్షేమం అభివృద్ధిలో ముందుకెళుతుందని అన్నారు అలాంటి నాయకుడికి ఎల్ల వేళలా శ్రీ కృష్ణుడి కరుణా కటాక్షం ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పండితులు,ఆయా గ్రామాల తెలుగుదేశం,జనసేన,బి జె పి నాయకులు కార్యకర్తలు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రి క్షేత్రంలో ఉట్టి కొట్టే వేడుకలు



సూర్యప్రతినిధి, ఇంద్రకీలాద్రి

కృష్ణాష్టమి సందర్భంగా శనివారం ఇంద్రకీలాద్రి పై ఉట్టి కొట్టే వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ కృష్ణ జననం గురించి ధార్మిక ఉపన్యాసం అనంతరం రాజ గోపురం ముందు ఉట్టి పాత్ర వద్ద స్థానాచార్య ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం జరిగిం ది. తదుపరి ఆలయ కార్య నిర్వహణాధికారి శీనానాయక్ ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొని, ఉట్టి కొట్టారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మన పండుగలు ఆధ్యాత్మిక, ధార్మిక సంప్రదాయములకు ప్రతీక గా నిలుస్తున్నాయని, మన ఆచారవ్యవహారములలో ఆరోగ్యం, ఆధ్యాత్మికతలు ఇమిడి ఉన్నాయని అన్నారు.భవిష్యత్ తరాలకు సనాతన సంప్రదాయములు తెలిసేలా ఇటువంటి వేడుకలు నిర్వహించే బాధ్యత దేవాలయముల మీద ఉందని శీనా నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో పలువురు దేవాలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# విపత్తు నిర్వహణలో జీవీఎంసీ అత్యంత అప్రమత్తం : జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్



సూర్య ప్రతినిధి విశాఖపట్నం

భారీ వర్షాలు, వరదలు, గాలివానలు, వడగళ్ల వాన వంటి సహజ విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ అన్ని విభాగాలు తక్షణ చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించడమైనదని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పత్రికా ప్రకటన ద్వారా శనివారం తెలియజేశారు.ఈ సందర్భంగా కమిషనర్ వివరిస్తూ భారత వాతావరణ శాఖ -అమరావతి వాతావరణ కేంద్రం సమాచారం మేరకు రాష్ట్రంలో వర్షాలు అధికంగా కురుస్తున్నాయని, మూడు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. విశాఖ నగరంలో భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున ఇప్పటికే జీవీఎంసీ అప్రమత్తంతో ముందస్తుగా ప్రత్యేక చర్యలను చేపట్టిందన్నారు.కొండవాలు, లోతట్టు, మురికివాడ ప్రాంతాల ప్రజలకు రక్షణ కల్పించే దిశగా శిధిలావస్థలోనున్న భవనాలను గుర్తించి నగరంలో గల పటిష్టమైన సామాజిక భవనాలు, పాఠశాల భవనాలను అత్యవసర ఆశ్రయాలుగా సిద్ధం చేసామని,నగరంలో డ్రైనేజీ లైన్లు, మేన్ హోల్స్ , అధికంగా నీరు పారే ప్రదేశాలను గుర్తించి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవడమైనదని ,త్రాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా ,అలాగే నీటి కాలుష్యం జరగకుండా చర్యలు చేపట్టాలని ,వర్షాల కారణంగా దెబ్బతిన్న వీధి దీపాలను వెంటనే మరమ్మతు చేయడం , కూలిన, విరిగిపడిన చెట్లను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టడమైనదని, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున నగరంలో శిధిలావస్థలోనున్న హోర్డింగులను గుర్తించి వాటిని వెంటనే తొలగించే ప్రక్రియ చేపట్టాలని, అగ్ని ప్రమాదాలు సంభవించినట్లయితే ప్రజల రక్షణ దిశగా జీవీఎంసీ రీజినల్ అగ్నిమాపక అధికారి తగు చర్యలు చేపడుతున్నారని, అత్యవసర పరిస్థితుల్లో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తో అవసరమగు తక్షణ చర్యలు చేపట్టాలని, అలాగే వర్షాలు కారణంగా అప్రమత్తంగా ఉండేందుకు జీవీఎంసీ వాహనాలను, జనరేటర్ లను, చెట్లను తొలగించే యంత్రాలను, జెసిబిలను, ట్రక్కులను, ఇంధనాలను , సమాచార రేడియో హ్యాండ్ సెట్ లను, తదితర అవసరమగు పరికరాలను సిద్ధం చేయాలని, అలాగే జోనల్, సచివాలయ పరిధిలో గల అధికారులను, ఉద్యోగులను, సిబ్బందిని రక్షణ చర్యలు దిశగా సిద్ధంగా ఉండాలని జీవీఎంసీ అధికారులకు, ఇంజనీర్లకు, జోనల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేయడమైనదని కమిషనర్ తెలిపారు. అలాగే ప్రజా అవగాహన దిశగా నగరంలో గల ప్రజలు గృహాల్లో విద్యుత్ పరికరాలను జాగ్రత్తగా వాడాలని, పిల్లలను నీరు నిలిచిన ప్రదేశాల్లో ఆడనివ్వకూడదని, చెట్లు,హోర్డింగులు, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు క్రింద,శిధిలావస్థ భవనాల్లో ప్రజలు ఉండరాదని ప్రజలకు కమిషనర్ సూచించారు. అత్యవసర సహాయ కేంద్రంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల సిటీ ఆపరేషన్స్ సెంటర్ నందు జీవీఎంసీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడమైనదని ప్రజలు ఎటువంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే జీవీఎంసీ కంట్రోల్ రూమ్ లో గల టోల్ ఫ్రీ నెంబర్ 1800 4250 0009 కు ప్రజలు సమాచారం తెలిపి సంప్రదించాలని, అలాగే జోనల్ కార్యాలయాల్లో కూడా సంప్రదించవచ్చునని ,జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు,సిబ్బంది సమన్వయంతో ప్రజలకు తక్షణ సహాయం అందిస్తారని ప్రజలకు కమిషనర్ పత్రికా ప్రకటన ద్వారా సూచిస్తూ తెలిపారు.

# శ్రీ గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ప్రారంభం

**రాయచోటి పెద్దాయన స్వర్గీయ పాలకొండ్రాయుడు చే ఆలయ నిర్మాణం**

**విగ్రహ ప్రతిష్టలోపాల్గొన్న రాయుడు కుమార్తె, అల్లుడు**



సూర్యప్రతినిధి - రాయచోటి టౌన్

రాయచోటి నియోజకవర్గం బడుగు బలహీనవర్గాలకు ఆశాజ్యోతి పెద్దాయన మాజీ ఎమ్మెల్యే మాజీ ఎంపీ స్వర్గీయ సుగవాసి పాలకొండ రాయుడు రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులో శ్రీ గంగమ్మతల్లి దేవాలయం నిర్మించారు. శనివారం నుంచి సోమవారం వరకు విగ్రహ ప్రతిష్ట(అభిషేకములు, అలంకరణ, దర్శనము) అన్న ప్రసాద వితరణ కలదు, కావున మొదటిరోజు పూజ కార్యక్రమాలు పెద్దాయన పాలకొండ్రాయుడు కూతురు అల్లుడు కదిరి రేవతి, కదిరి ఉదయ్ భాస్కర్ లు పాల్గొని వేదపండితులతో కలిసి నిర్వహించారు.ఈ దైవ కార్యక్రమాలలో యావన్మంది భక్తాదులు విరివిగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని పాలకొండ్రాయుడు కుమారులు సుగవాసి బాల సుబ్రమణ్యం, సుగవాసి ప్రసాద్ బాబు లు ఆహ్వానించారు.

# ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా గౌతు లచ్చన్న

శ్రీకాకుళం సూర్య ప్రతినిధి

ఉద్యమాల రౌతుగా, బలహీన వర్గాల బలమైన గళంగా ఖ్యాతిగాంచిన సర్దార్ గౌతు లచ్చన్న తను అలంకరించిన పదవులు, పాటించిన రాజీలేని రాజకీయ పోరాటాలతో సిక్కోలు, ఉత్తరాంధ్ర విశిష్టతను మరింతగా ఇనుమడింపజేశారు. 1909 ఆగష్టు 16వ తేదీన సోంపేట దరి బారువాలో జన్మించిన గౌతు, యువ్వన దశ నుంచే రైతుకూలీ ఉద్యమం, స్వరాజ్య సమరం, ఉప్పు సత్యాగ్రహం, జమీందార వ్యతిరేక పోరాటంలో చురుకైన పాత్ర పోషించి జాతీయస్థాయిలో ఆచార్య ఎన్.జి. రంగా శిష్యునిగా గుర్తింపు పొందారు. విశాఖ-గోదావరి కార్మిక నియోజకవర్గం నుంచి ఒకసారి (1948 ఉప ఎన్నికలో), సోంపేట స్థానం నుంచి అయిదు సార్లు శాసనసభకు, శ్రీకాకుళం స్థానం నుంచి ఒకసారి లోక్ సభకు, ఒకసారి శాసనమండలికు ఎన్నికైన గౌతులచ్చన్న ఆంధ్రరాష్ట్ర రాజకీయాల్లో మూడున్నర దశాబ్దాలపాటు క్రియాశీలకమైన పాత్ర పోషించారు. స్వాతంత్ర వచ్చిన సందర్భంగా, 1947 ఆగష్టు 15వ తేదీన ఆంధ్రా యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ నిర్వహించిన విజయోత్సవ వేడుకలకు గౌతు, ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు.1952లో మద్రాస్ శాసనసభలో కృషికార్ లోక్ పార్టీ శాసనసభ పక్షనేతగా వ్యవహరించారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత టంగుటూరి ప్రకాశం నేతృత్వంలోని ప్రప్రథమ కేబినెట్లో 1953-54లో మంత్రిగా వ్యహరించారు. 1955లో బెజవాడ గోపాలరెడ్డి నేతృత్వంలోని కేబినెట్లో కూడా మంత్రిగా సేవలందించారు. కార్మిక, సాంఘిక సంక్షేమ, విద్యుత్, వ్యవసాయ, పోర్టుల తదితర శాఖలను ఆ సమయంలో పర్యవేక్షించారు. ఆంధ్రప్రాంతం, తెలంగాణ ప్రాంతం కలిసి ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడినపుడు 'పెద్దమనుషుల ఒప్పందం'లో కీలకభూమిక వహించారు. కృషికార్ లోక్ పార్టీ, డెమొక్రటిక్ పార్టీ, స్వతంత్ర పార్టీ, భారతీయ క్రాంతి దళ్, భారతీయ లోకదళ్ పార్టీలకు రాష్ట్ర స్థాయిలో నాయకత్వం వహించారు. జనతా పార్టీ, జనతాదళ్, బహూజన సమాజ పార్టీ తదితర జాతీయ పార్టీల్లో కూడా రాష్ట్రంనుంచి కీలకంగా వ్యహరించారు. కృషికార్లోక్ పార్టీ, స్వతంత్ర పార్టీలో ఆంధ్రప్రదేశ్ శాసనసభలో శాసనసభ పక్షనేతగా పలుమార్లు బాధ్యతలు నిర్వర్తించిన గౌతు లచ్చన్న 1978లో ఏపీ శాసనసభలో జనతా పార్టీ తరుపున ప్రధాన ప్రతిపక్ష నేతగా కూడా వ్యవహరించారు. 1985 తర్వాత ప్రత్యక్ష ఎన్నికలకు దూరం అయినప్పటికీ మరో దశాబ్ధకాలము పాటు బహుజన, ప్రత్యామ్నాయ రాజకీయాల్లో పాల్గొన్నారు. ఆంధ్ర, నాగార్జున విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించబడిన గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19వ తేదీన విశాఖ లో తుది శ్వాస విడిచారు.

# స్ఫూర్తి ప్రదాత సర్దార్ గౌతు లచ్చన్న : యార్లగడ్డ

సూర్యప్రతినిధి-గన్నవరం :

స్వాతంత్ర్య సమరయోధులు, బడుగుల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తి ప్రదాత అని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కొనియాడారు. గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా శనివారం సాయంత్రం విజయవాడ రూరల్ మండలం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సర్దార్ లచ్చన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా బలహీన వర్గాలు, రైతులు, కార్మికులకు అండగా నిలిచి అనేక ఉద్యమాలకు గౌతు లచ్చన్న నేతృత్వం వహించారని తెలిపారు. పోరాటాలు ఉద్యమాలకు చిరునామగా ఉండేవారని అణగారిన వర్గాల అభ్యున్నతికి అనునిత్యం కృషి చేశారని కొనియాడారు. రైతాంగ పోరాటాలకు దిక్సూచి సర్దార్ గౌతు లచ్చన్న అని తెలిపారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని యార్లగడ్డ పిలుపునిచ్చారు. సర్ధార్ గౌతు లచ్చన్న జయంతిని ప్రతి ఏటా 16 వ తేదీన అధికారిక ఉత్సవంగా నిర్వహించాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. తెలుగు నేల ఉన్నంత కాలం గౌతు లచ్చన్న కీర్తి అజరామరంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండల టిడిపి అధ్యక్షులు గొడ్డల్ల చిన్న రామారావు, గన్నవరం మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసిమోహన్, గన్నవరం వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, వైస్ చైర్మన్ కొండేటి వెంకటేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు బెజవాడ రామకృష్ణ, కొండేటివెంకటరత్నం, బండి వెంకట్రావు, కలపాల కిరణ్, పొదిలి లలిత, మేడేపల్లి రమ, నెక్కంటి శ్రీదేవి, అద్దేపల్లి సాంబశివరావు, నబిగాని కొండయ్య, అడుసుమిల్లి నవీన్, కానూరు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



# మంగళగిరి కేంద్ర కార్యాలయంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

## - పాల్గొన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు



సూర్యప్రతినిధి - మంగళగిరి

మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొని గోపాలకృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీకృష్ణుడు ధర్మానికి అండగా నిలిచి సమాజానికి న్యాయం చేశాడు. శ్రీకృష్ణుడి గీతా సూత్రాలు యుగయుగాలపాటు మనకు మార్గదర్శకాలుగా నిలుస్తాయి. తెలుగుదేశం పార్టీ కూడా అదే మార్గాన్ని అనుసరిస్తోందన్నారు.రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో సుపారిపాలన అందిస్తున్నామని, 40 రోజుల్లో సుపారిపాలన తొలి అడుగు కార్యక్రమం ద్వారా కోట్లాది ప్రజల ఇళ్లను సందర్శించి వారి అభిప్రాయాలను సేకరించామని పేర్కొన్నారు. ప్రజల్లో చంద్రబాబు గారి పాలనపై అపార విశ్వాసం నెలకొందని ఆయన వివరించారు.సూపర్ సిక్స్ హామీలలో 90% అమలు చేయడం ద్వారా ప్రభుత్వ నిబద్ధతను చూపించామన్నారు. ముఖ్యంగా మహిళల కోసం ప్రారంభించిన స్త్రీశక్తి ఉచిత బస్సు సేవ లక్షలాది కుటుంబాలకు ఊరటనిస్తోందని, ఇది మహిళల గౌరవానికి, భద్రతకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని పల్లా స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో అణచివేత, అరాచకాలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు రాష్ట్రంలో స్వేచ్ఛా వాతావరణం నెలకొని, సంక్షేమం-అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అశోక్ బాబు, నేతలు పరుచూరి కృష్ణ, పార్టీ ప్రధాన కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. చిన్నారులకు మిఠాయిలు, పుస్తకాలు పంపిణీ చేశారు..

# వైఎస్ భారతి కూడా పులివెందుల నుంచి అమరావతికి ఫ్రీగా రావచ్చు: పీతల సుజాత



సూర్యబ్యూరో - అమరావతి

మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' పథకంపై వైసీపీ నేతలు విమర్శలు చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని టీడీపీ నాయకురాలు, రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్ పీతల సుజాత తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఆడబిడ్డలను అభివృద్ధి పథంలో నడిపించాలన్నదే తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమని ఆమె స్పష్టం చేశారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ మహిళల హక్కుల కోసం ఎన్నో సంస్కరణలు తెచ్చారని, ఆ స్ఫూర్తితోనే ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా సంఘాలకు బీజం వేశారని గుర్తు చేశారు. నేడు కోటి మంది మహిళలు ఆ సంఘాల ద్వారా తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని ఆమె కొనియాడారు. మహిళలకు అవకాశం ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారని పీతల సుజాత అన్నారు. రాష్ట్రంలోని మహిళల తరపున 'స్త్రీ శక్తి' పథకాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ లకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. రాఖీ పండుగలాగే ఈ పథకాన్ని కూడా మహిళలు చిరకాలం గుర్తుంచుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఇంత మంచి పథకంపై వైసీపీకి చెందిన పేటీఎం బ్యాచ్ దుష్ప్రచారం చేయడం బాధాకరమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని సుజాత తెలిపారు. గత ప్రభుత్వంలా కాకుండా, ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేశామని వివరించారు.

# ఏజెన్సీలో తీరని డోలి కష్టాలు

## అరచేతిలో ప్రాణాలు అడ్డుపెట్టుకొని హాస్పిటల్స్ కు ప్రయాణాలు





చింతపల్లి..సూర్య.ప్రతినిధి.

వర్షంలో పాత ఇల్లు గోడ కూలి సిదేరి లక్ష్మి అనే పాప పై పడింది. ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలని గిరిజన సంఘం డిమాండ్. గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన. చిరంజీవి .మాట్లాడుతూ అల్లూరి జిల్లా .చింతపల్లి. మండలం. అంజలి శనివారం పంచాయతీ .తాటిబంద. గ్రామానికి చెందిన సిదేరి. సత్తిబాబు కుమార్తె. సీదేరి. లక్ష్మి 8 సంవత్సరాలు బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఆడుకోవడానికి పాత ఇల్లు పై రేకులు తీసేసి గోడ కూల్చకుండా వదిలేసిన గోడ దగ్గరకు తోటి పిల్లతో ఆడుకోవ టానికి వెళ్ళింది సిదేరి లక్ష్మి అనే పాప గోడకి దగ్గరగా ఉండటం వలన లక్ష్మి అనే పాప పై గోడకూలి పడిపోవడంతో స్ప కోల్పోయింది మిగతా పిల్లలు గోడకి దూరంగా ఉండటంతో మిగతా పిల్లలకు ప్రమాదం లేదు సిదేరి సత్తిబాబు కుమార్తె సిదేరి లక్ష్మి ప్రాణం కాపాడుకోవడానికి నాలుగు కిలోమీటర్లు రహదారి సౌకర్యం లేక. లక్ష్మి తండ్రి సత్తిబాబు. బుచ్చంత గ్రామం వరకు వర్షం కురుస్తున్నప్పటికీ మోసుకొని వచ్చి ఆటోలో అక్కడినుంచి దౌనురు పిహెచ్సి వరకు తీసుకొని వెళ్లడమైనది అక్కడ వైద్యులు వైద్య సదుపాయం అందించి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి అంబులెన్స్‌లో పంపించారు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి నుంచి విశాఖ కే జి హెచ్ కు రిఫరల్ చేస్తారు అక్కడ వైద్యులు వైద్యం అందిస్తున్నారు అయినప్పటికీ లక్ష్మి లేవలేని పరిస్థితి ఉందని అని అన్నారు గ్రామానికి రోడ్డు సదుపాయం లేనందున నాలుగు కిలోమీటర్లు దూరం నడుచుకుంటూ రావాలి ఆ సమయంలో వర్షం కురుస్తున్నప్పటికీ కూతురు లక్ష్మి ప్రాణం కాపాడుకోవడానికి సిదేరి సత్తిబాబు నాలుగు కిలోమీటర్లు నడిచి మో సుకుని వచ్చారన్నారు. రహదారి సౌకర్యం బాగుంటే ప్రమాదం జరిగిన వెంటనే ఆస్పత్రికి తీసుకొని వెళ్లేవారని అప్పటికే ఆల్సమైందని అని అన్నారు.

ప్రభుత్వం నిర్లక్ష్యం తోనే మారుమూల గ్రామంలో రోడ్డు సదుపాయం లేవన్నారు ఇప్పటికైనా మారుమూల గ్రామాల్లో రోడ్డు సదుపాయం కల్పించాలని గోడకూలి అవస్థలు పడుతున్న లక్ష్మిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకొని మెరుగైన వైద్యం అందించే విధంగా చర్య తీసుకోవాలని అలాగే మారుమూల గ్రామాలకు ప్రభుత్వం రోడ్డు సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వానికి గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి. సాగిన. చిరంజీవి విజ్ఞప్తి చేస్తారు.



## ఉద్యోగుల సమస్యల పరిష్కారం లో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ముందంజ

### - యూనియన్ గుర్తింపు దినోత్సవం వేడుకలో జెండా ఆవిష్కరణ

సూర్యప్రతినిధి – రాయచోటి

ఉద్యోగుల సమస్యల పరిష్కారం లో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ముందంజ లో ఉందని అన్నమయ్య జిల్లా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుర్తింపు దినోత్సవం సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, ఆదేశాలతో జిల్లా కేంద్రమైన అన్నమయ్య జిల్లా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ అధ్యక్షతన శనివారం జెండా ఎగరవేసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ నేటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి గుర్తింపు వచ్చి ఆరు సంవత్సరాల అయిందని ఈ ఆరు సంవత్సరాల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యూనియన్ తరఫున అనేక కార్యక్రమాలు చేసి విజయం సాధించామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డాక్టర్ లక్ష్మీప్రసాద్, జిల్లా కార్యదర్శి గురుప్రసాద్, తాలూకా అధ్యక్షులు ఓ సాయికుమార్, కోశాధికారి సురేష్ బాబు, ఉ పాధ్యక్షులు నాగేంద్ర ప్రసాద్, వేణు, పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు రాజా, సంఘం సభ్యులు రమేష్, శ్రీను, మణికంఠ, నాగదేవ, రవీంద్ర పాల్గొన్నారు.



# శ్రీ బాల సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో వైభవంగా ఆడికృత్తిక మహోత్సవాలు

సూర్య ప్రతినిధి – రేణిగుంట

రేణిగుంట మండలంలోని గాజుల మండ్యం లో వెలసిన శ్రీ బాల సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో శనివారం ఆడికృత్తిక మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం మూడు రోజులపాటు జరిగే మహోత్సవాలలో భాగంగా 14 వ తేదీ గురువారం ధ్వజారోహణ తో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉత్సవాల్లో చివరి రోజు ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారికి మూలవిరాట్ కు తెల్లవారుజామున అర్చకులు సుగంధ ద్రవ్యాలు,పంచామృత అభిషేకం నిర్వహించి స్వామివారిని శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ఉంజల సేవ నిర్వహించి,మేళ తాళాలు మంగళ వాయిద్యాలు బాణాసంచా పేలుళ్ల మధ్య స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. ఇంటింట భక్తులు కాయ కర్పూరం సమర్పించి స్వామివారిని కొలిచారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు మాట్లాడుతూ ఎంతో ప్రాశస్త్యం కలిగిన స్వామి వారిని భక్తితో దర్శించి కోరితే మండలం రోజుల్లోనే వారి కోరిక నెరవేరుతుందనేది భక్తుల ప్రగాఢ నమ్మకమని అన్నారు. గ్రామం నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామం నుంచి



కూడా స్వామివారి దర్శనానికి భక్తులు రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి మంగళవారం స్వామివారికి అభిషేక పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వామివారికి మహోత్సవాలకు నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు,భక్తులు పాల్గొన్నారు.

# ఒక వ్యక్తికి ఒకే ఓటు

సూర్యప్రతినిధి – కడప అర్బన్

ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి ఎలక్షన్ కమిషన్ ను డిమాండ్ చేశారు. శనివారం ఏఐసిసి, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నినాదాలు చేసుకుంటూ అంబేద్కర్ సర్కిల్ వరకు వెళ్లి అక్కడ మీడియాతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ గారు చేపట్టిన ఓట్ చోరీ కార్యక్రమం చాలా గొప్ప ఈ కార్యక్రమాన్ని భారత దేశ ప్రజలందరూ స్వాగతించాలని ప్రతి ఒక్క మనిషికి ఒక ఓటు మాత్రమే ఉండాలని అంతేకాకుండా రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే ప్రతి పౌరునికి ఒక్క ఓటు మాత్రమే ఉండే విధంగా చూస్తాడని ప్రస్తుతము ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఓటు వేసుకునే హక్కును కోల్పోతు న్నారని ఎవరి ప్రభుత్వం రావాలంటే వారి ఇష్టారాజ్యంగా ఓట్లు వేసుకుంటు ప్రజాస్వామ్య వ్యవస్థను కూని చేస్తున్నారని వీటిని అన్నిటిని వ్యతిరేకిస్తూ లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఒక ఉద్యమం చేపట్టారని. దానికి అందరూ మద్దతు ఇచ్చి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని కోరారు ప్రజలందరికీ న్యాయం జరగాలంటే ఒక కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి




వస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ సయ్యద్ గౌస్ పీర్,కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గం ఇన్ ఛార్జి ధ్రువ కుమార్ రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్ ఛార్జి శివ మోహన్ రెడ్డి , ప్రొద్దుటూరు నియోజకవర్గం ఇన్ ఛార్జి ఇర్ఫాన్, రాష్ట్రకాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ అలీ ఖాన్ కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్, కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీలు సులోచనమ్మ, ఏకాదశి రెడ్డి ,రాష్ట్ర మైనార్టీ జనరల్ సెక్రటరీలు మైనుద్దీన్, కమల్ భాష, కడప నగరం డివిజన్ ఇన్ ఛార్జి లు హరి ప్రసాద్, ముబారక్ భాషా, నీలం గఫార్, అమీద్, అమిద్ అలీ, సిద్దిక్ ,హుస్సేన్ భాష , కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లూరు భాష, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారునికి ఆర్థిక సహాయం



సూర్యప్రతినిధి – బద్వేలు

స్థానిక దూదేకుల వీధికి చెందిన క్రికెట్ ఆటగాడు మౌలాలి (రైలు) గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన లెజెండ్ క్రికెట్ టీం తరఫున మౌలాలికి శనివారం ఆర్థిక సహాయం అందించారు. మౌలాలి హాస్పిటల్ ఖర్చుల కొరకు బద్వేల్ లోని క్రికెట్ క్రీడాకారులు తమ వంతు సహాయంగా కొంత నగదును అందించడం జరిగింది. ఈ మేరకు ఆయన ఆరోగ్యం బాగుపడి త్వరగా కోలుకుని ఆసుపత్రి నుంచి ఇంటికి రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మౌలాలి మాట్లాడుతూ తనపై ప్రేమతో క్రీడాకారులు అందించిన సహాయానికి ఎల్లవేళలా తాను రుణపడి ఉంటానని తెలిపారు. తనకు సహాయం అందించిన ప్రతి ఒక్క క్రీడాకారునికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు తప్పవు

**కూరగాయల మార్కెట్ ను సందర్శించిన మున్సిపల్ కమిషనర్**

సూర్యప్రతినిధి – రాయచోటి టౌన్



జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని కూరగాయల మార్కెట్ ను శనివారం మున్సిపల్ కమీషనర్ రవి సందర్శించారు. అక్కడ కూరగాయల వ్యాపారులతో మమేకమై,పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మార్కెట్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు మార్కెట్ కి వచ్చేటప్పుడు విధిగా గుడ్డ సంచి లేదా జూట్ బ్యాగ్ వెంటతెచ్చుకోవాలని సూచించారు. పట్టణ పరిశుభ్రత లో ప్రతిఒక్కరు తమవంతు సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# సబ్ జైలు నుంచి అంతర్రాష్ట్ర రిమాండ్ ఖైదీ పరార్

సూర్య ప్రతినిధి – ప్రొద్దుటూరు

స్థానిక సబ్ జైలు నుంచి అంతర్రాష్ట్ర దొంగ పరారయ్యాడు. 40 అడుగుల ఎత్తైన గోడ దూకి జైలు నుంచి తప్పించుకున్నాడు. మూడు రోజుల క్రితం అరెస్టైన ఈ ఖైదీపై ఇప్పటికే 25కు పైగా కేసులు నమోదు అయ్యాయి. ప్రొద్దుటూరు సబ్ జైలు నుంచి రిమాండ్ ఖైదీగా ఉన్న అంతర్రాష్ట్ర దొంగ మహమ్మద్ రఫీ పరారయ్యాడు. 40 అడుగుల ఎత్తైన జైలు గోడను దూకి అతను తప్పించుకున్నట్లు సమాచారం. రఫీపై ఆంధ్రప్రదేశ్లోని పలు జిల్లాల్లో దొంగతనాలు, చోరీలకు సంబంధించి 25కు పైగా కేసులు ఉన్నాయని పోలీ సులు వెల్లడించారు. మూడు రోజుల క్రితం కడప జిల్లా రాజుపాలెం మండలం టంగుటూరు గ్రామంలో జరిగిన చోరీ కేసులో పట్టుబడ్డాడు. పట్టపగలే దొంగ తనం చేస్తుండగా గ్రామస్థులు పట్టుకొని




దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ నెల 13న రాజుపాలెం పోలీసులు అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి ప్రొద్దుటూరు సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న రఫీ, శనివారం ఉదయం తప్పించుకున్నాడు. ఈ ఘటనపై జైళ్ల శాఖ ఉన్నతాధికారులు జైల శాఖ ఐజి రవికుమార్ సబ్ జైలుకు శనివారం 9 గంటల ప్రాంతంలో పరిశీలించారు. దొంగ పరారి పై కడప జైలర్ అమర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. విధుల్లో ఉన్న సిబ్బందిపై ప్రభుత్వం సీరియస్ గా ఉన్నదని, విచారణ నివేదికను అధికారులకు పంపిన జైలర్ అమర్. ఉన్నదికారులకు ఆదేశాల మేరకు ముగ్గురి సిబ్బందిపై ఇలాంటి చర్యలు తీసుకుంటారు వేచి చూడాల్సి ఉంది. జైలు నుంచి పదాలైన దొంగ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

సూర్య ప్రతినిధి – కలసపాడు



మండల కేంద్రంలోని శ్రీకృష్ణ మందిరంలో శనివారం మద్ భగవద్గీత సత్సంగ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ శ్రీకృష్ణునికి అభిషేకం, అష్టోత్తరం, భగవద్గీత పారాయణం, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కె.సుదర్శన్, గౌరవాధ్యక్షుడు మలిపెద్దు నాగరాజా, ప్రధాన కార్యదర్శి జె.నారాయణ, వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు టి.సత్యవతమ్మ, గ్రామంలోని భక్తులు పాల్గొన్నారు.

## బద్రి వెంకటరమణ భౌతిక కాయానికి ఎమ్మెల్యే నివాళి

సూర్య ప్రతినిధి – సుండుపల్లి



సుండుపల్లి మండలం రాయవరం గ్రామపంచాయతీ వైయస్సార్సీపి నాయకుడు బద్రి రమేష్ తండ్రి వెంకటరమణ భౌతిక కాయానికి శనివారం రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి నివాళులర్పించారు. అనంతరం బద్రి రమేష్ ని వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. వీరి వెంట జడ్పిటిసి ఇస్మాయిల్, రెడ్డమ్మ, ఎంపీటీసీ నసీమా భాను, రాయవరం ఎక్స్ ఎంపీటీసీ రషీద్ భాష, రాయవరం వైఎస్ఆర్సిపి మైనార్టీ నాయకుడు రషీద్ భాష, వైఎస్ఆర్సిపి ఎస్టి నాయకులు చంద్ర నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి వాజపేయి సేవలు మరువలేనివి

## - బిజెపి రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ

సూర్యప్రతినిధి – విజయవాడ

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ పాల్గొన్నారు.బిజెపి రాష్ట్ర నాయకులు ఉప్పలపాటి శ్రీ నివాస్ రాజు మాట్లాడుతూ భారతీయ జనసంఘ్ భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక సభ్యుడిగా, పార్టీ అభివృద్ధి కోసం కీలకపాత్ర వహించారని అన్నారు. దేశ ప్రధానిగా అవినీతి లేని నైతిక విలువలతో కూడిన ఆదర్శనీయమైన సేవలు అందించారు. దేశ సత్వర అభివృద్ధి కోసం పరితపించి, గ్రామీణ సడక్ యోజన, రోడ్, పోర్ట్సు, ఎయిర్, కనెక్ట్ విటిలతోఅనుసంధానం చేసి ఎంతో అభివృద్ధి చేసారు. దేశంలో అట్టడుగున్న ఉన్న ఏమీ లేని వారికి అంత్యోదయ కార్యక్రమం కింద 30 కేజీలు బియ్యం ఉచితంగా ఇచ్చే కార్యక్రమం చేపట్టారు. అమెరికా సాటిలైట్ కి అందకుండా పోక్రాన్‌లో అణు పరీక్షలు జరిపి భారతదేశం ప్రపంచ అణు శక్తి దేశాలలో భాగస్వామిని చేశారు. అమెరికా మన దేశంపై విధించిన అనేక ఆంక్షలను




ఆ దేశం బేషరతుగా ఎత్తివేయడం జరిగింది. నైతిక విలువలు ఉన్నత ఆశయాలతో రాజకీయ నాయకులు ఏ విధంగా పనిచేయాలో ఆయన జీవితంలో ఆచరించి చూపించారు. వాజ్‌పాయ్ గారు దేశ అభివృద్ధికి చేసిన విశేష సేవలకు ఆయనకు భారతరత్న అవార్డు ఇవ్వడం జరిగిందని వక్తలు అభిప్రాయపడ్డారు. మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ డి విల్సన్, కార్యాలయ కార్యదర్శి పవన్ జీ తదితరులు పాల్గొన్నారు

## రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలి హెల్మెట్ ధరించాలి


సూర్యప్రతినిధి – సుండుపల్లి



వాహనాలు నడిపేవారు రికార్డులు సక్రమంగా ఉంచు కోవాలని అలాగే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు మండల కేంద్రంలోని భైరవగుట్ట వద్ద వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు ఆర్ సి ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు రికార్డులు సక్రమంగా లేని వాహనాలకు జరిమానాలు విధించారు.వాహనదారులకు పలు సూచనలు సలహాలు తెలియజేశారు.

## వెంకటాపురంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**-కృష్ణుడి వేషధారణలో అలరించిన చిన్నారులు**



సూర్య ప్రతినిధి – రేణిగుంట

రేణిగుంట మండలం వెంకటాపురం గ్రామ పంచాయతీలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని సీతారాముల దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి గ్రామంలోని ప్రతి ఒక్కరికి పండుగ వాతావరణాన్ని భక్తిని తలపించేలా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సుమారు 200 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి వెంకటాపురం గ్రామములోని ప్రతి వీధిలో దేవుడి ఊరోగింపుని కొనసాగించారు తదుపరి ఏర్పాటు చేసిన ఉట్టి కార్యక్రమంలో యువకులు, మహిళలు, ఉత్సాహంగా పాల్గొని ఉట్టినికొట్టి సంతోషంగా పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

## వాంపల్లి చెరువు వద్ద ఎన్ హెచ్ 67 జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

**-కారు బైకును ఢీకొనడంతో తృటిలో తప్పిన పెను ప్రమాదం**

సూర్య ప్రతినిధి – బ్రహ్మంగారిమఠం



బ్రహ్మంగారిమఠం మండలం రేకలకుంట పంచాయతీలోని వాంపల్లి చెరువు వద్ద శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో వాంపల్లి చెరువు వద్ద బైక్ పై వెళుతున్న వ్యక్తి రోడ్డును దాటుకునే క్రమంలో బద్వేలు వైపు వెళుతున్న కారును ఢీకొట్టడం జరిగింది బైక్ పై వెళుతున్న వ్యక్తిని కారు తగలకుండా తప్పించే ప్రయత్నంలో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది ఈ ప్రమాదంలో బైకు ముందు భాగము పూర్తిగా దెబ్బతినగా కారు కుడివైపు ముందు భాగం కొంచెం దెబ్బతింది అయితే అదృష్టవశాత్తు ఇరువురికి ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో బాధితులు ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బైక్ పై వెళ్తున్న వ్యక్తి మైదుకూరు దగ్గర ఉన్నటువంటి కేషాపురం కాగా కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు ప్రొద్దుటూరు కు చెందిన వ్యక్తులుగా సమాచారం.

## సుబ్బరాజా ను పరామర్శించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి

సూర్యప్రతినిధి – చిన్నమండెం



చిన్నమండెం టౌన్‌లో టిడిపి కార్యకర్త ముల్లంగి నవీన్ తండ్రి ముల్లంగి సుబ్బరాజా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన,సర్వీసులశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వారి ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించి వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. త్వరగా కోళికోవాలని ఆకాంక్షించారు.

## హెడ్ కానిస్టేబుల్ పై చర్య తీసుకోవాలి - ఎస్ఐకి కూటమి వినతి

సూర్య ప్రతినిధి – సుండుపల్లి



స్వాతంత్ర దినోత్సవం రోజున మండల కేంద్రంలో హెడ్ కానిస్టేబుల్ ర్యాలీని అడ్డుకున్న జరిగిన సంఘటన చాలా భాధకరం బిజెపి మండల అధ్యక్షులు రమణ గౌడ్ పేర్కొన్నారు. గౌరవనీయులైన ప్రధానమంత్రి మోడీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని దేశవ్యాప్తంగా తిరంగా ర్యాలీలు దేశమంతా చేయాలని పిలుపునిచ్చారు. లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ వారు ప్రతి సంవత్సరం లాగే పిల్లలు జాతీయ వాదాన్ని పెంపొందించే ఆలోచనలతో వివిధ స్వాతంత్ర్య పోరాట యోధులు వేషధారణలతో ప్రతి సంవత్సరం చేసే కార్యక్రమాన్ని హెడ్ కానిస్టేబుల్ సాధిక్ అలీ అడ్డుకోవడం అనేది జాతీయ వాదాన్ని ప్రశ్నించడమే? జాతీయ జెండాకు సెల్యూట్ చేసే అధికారే ఇలా చేయడం అనేది ఎంతవరకు సబబు ఇటువంటి అహంకారపు హెడ్ కానిస్టేబుల్ సాదిక్ అలీ ని విధులనుండి తప్పించి వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఐ శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్బరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాచరాయుడు, బీజేవైఎం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిచెర్ల శంకరయ్య,ఉపాధ్యక్షులు రెడ్డి ఆచారి, పెంచలయ్య, గాలి భాస్కర్, సుధాకర్, వెంకటేష్, ప్రతాప్ రెడ్డి,చంద్రమోహన్, వేణుగోపాల్,జనసేన రామ శ్రీనివాస్, శ్రీనివాసరాజు, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

## కలసపాడు యువకునికి సిజిసి మెడల్

సూర్య ప్రతినిధి – కలసపాడు



కలసపాడు మండలం కొండపేటకు చెందిన పాలకొలను నారాయణ్ రెడ్డి వీరమ్మ కుమారుడు రమణారెడ్డి పాకిస్తాన్లో చిక్కుకున్న మన దేశ జాలర్లను 2024 నవంబర్లో భారత్ నేవీ సిబ్బంది ఆహాసోపేతంగా రక్షించిన విషయం తెలిసిందే, ఆ న్యావిదలంలో ఉన్నటువంటి రమణారెడ్డి సేవలను గుర్తించి రాష్ట్రపతి ద్రౌపతి ముర్మా స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా సిజిసి (కాన్స్పిక్యస్ గ్యాలంట్రీ క్రాస్ )మెడల్ అందించాలని ఆదేశించారు. సాధారణ పేద కుటుంబంలో జన్మించి దేశ సేవలో మంచి పేరు సంపాదించిన రమణారెడ్డిని పలువురు అభినందించారు కడప జిల్లాలోని కలసపాడు మండల వాసి ప్రాణాలు పణంగా పెట్టి మత్స్యకారుల కుటుంబాలను కాపాడడం అభినందనీయమని మండలంలోని కొనియాడారు మరో మూడు రోజులలో సంబంధిత ఉన్నతాధికారుల చేతుల మీదుగా సిజిసి మెడల్ అందుకోనున్న రమణారెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేస్తున్న కొండపేట గ్రామ కలసపాడు మండల వాసులు.

## వివాహ వేడుకలల్లో పాల్గొన్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

సూర్యప్రతినిధి – సంబేపల్లి



మండలంలోని గురిగింజ కుంట గ్రామం, నాయన వారిపల్లె లో జరిగిన అలిపినేని పవన్ కళ్యాణ్ నాయుడు,నందిని ల వివాహ వేడుకలలో రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన సర్వీసుల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## బ్రహ్మంగారి సన్నిధిలో తెదేపా నాయకులు కానాల మల్లికార్జున్ రెడ్డి

సూర్యప్రతినిధి – బ్రహ్మంగారిమఠం



బ్రహ్మంగారిమఠం మండలం కేంద్రంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా మండలంలోని ముడుమాలలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాన్ని మరియు బ్రహ్మంగారిమఠంలో కాలజ్ఞాని జగద్గురు శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని, అలాగే జగన్మాత ఈశ్వరి దేవి అమ్మవారిని పలు ఆలయాలను దర్శించుకొని స్వాముల వారి తీర్థప్రసాదాలను స్వీకరించిన మండల తెదేపా నాయకుడు పారిశ్రామికవేత్త కానాల మల్లికార్జున రెడ్డి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే కాజీపేట తెదేపా నాయకులు సహకార సంఘం చైర్మన్ హరినాధ రెడ్డి, మైదుకూరు మండలం శెట్టివారిపల్లె తెదేపా నాయకుడు శివశంకర్ రెడ్డి కూడా ఉన్నారు. అనంతరం వారు మండల తెదేపా అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి , సోమిరెడ్డిపల్లె వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ సాంబశివారెడ్డి తో కలిసి చర్చించారు.

# శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా శ్రావణ శనివారం వేడుకలు

## - ప్రత్యేక పూజలు, అన్నదానంలో పాల్గొన్న సుగవాసి ప్రసాద్ బాబు



సూర్యప్రతినిధి - రాయచోటి టౌన్

శ్రావణమాసం 4వ శనివారం సందర్భంగా అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం మాండవ్య నది ఒడ్డున ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో 4వ శనివారం వేడకలు ఘనంగా నిర్వహించారు. కాగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు రాయచోటి నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి శ్రావణ శనివారం నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వారందరికీ అన్నదానం చేశారు, రామనామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రసాద్ బాబు ని ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన ప్రసాద్ బాబు కి ఆలయ కమిటీ వాకా అన్నయ్య ఆత్మీయ స్వాగతం పలికి శాలువా గజమాలతో ఘనంగా సన్మానించారు.

# ఆర్థిక, మౌలిక సంస్కరణలతో దేశ రూపురేఖలు మార్చిన నేత వాజ్ పేయి- మంత్రి నారా లోకేష్



సూర్యప్రతినిధి - అమరావతి

భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి వర్ధంతి సందర్భంగా విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ నివాళులర్పించారు. తాను నమ్మిన సిద్ధాంతాలకు చివరి వరకూ కట్టుబడిన వ్యక్తి వాజ్ పేయి అని, తనకు ఎదురైన అన్ని కష్టాలను ఓర్పుతో భరిస్తూ అద్భుతమైన దార్శనికత ప్రదర్శించారని కొనియాడారు. ఆర్థిక, మౌలిక సంస్కరణలతో దేశ రూపురేఖలు మార్చారని, వాజ్ పేయి దూరదృష్టి కారణంగా దేశం వికసిత్ భారత్ దిశగా అడుగులు వేసేందుకు పటిష్టమైన పునాది ఏర్పడిందమొ గుర్తుచేశారు. పార్లమెంట్ లోపలా వెలుపలా తనదైన ప్రసంగాలతో అందరినీ మంత్రముగ్ధులను చేసేవారని, ప్రధానిగా దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

# శ్రీశ్రీశ్రీ నాగారపమ్మ విగ్రహ ప్రతిష్టలో మంత్రి మండిపల్లి



సూర్యప్రతినిధి - రాయచోటి టౌన్

పట్టణంలోని ఎస్టీ కాలనీలో నూత నంగా నిర్మించిన శ్రీ శ్రీ నాగరపమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహెూత్సవ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన సర్వీసుల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిపాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృప, దయతో ప్రజలు సుఖః సంతోషాలతో, సుభిక్షమగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మిట్ట సంజీవరెడ్డి, టీడీపీ నేతలు, కార్యకర్తలు,గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## - ప్రజాదర్బార్‌లో మంత్రి మండిపల్లి



సూర్యప్రతినిధి - చిన్నమండెం

ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన సర్వీసుల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తన స్వగ్రామమైన బోరెడ్డిగారిపల్లి లో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి తక్షణమే అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి సకాలంలో సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. మీ గ్రామాలలో ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకొని వస్తే పరిష్కార మార్గం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొంతమంది అధికారులు, నేతలు, ప్రజలు మంత్రికి శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సత్కరించి సన్మానించారు.

# మహిళా ఉద్యోగులకు ఉచిత బస్సు పథకం అమలు చేయడం హర్షణీయం

## - మంత్రి మండిపల్లిని కలిసి అభినందించిన ఎన్.టి.ఏ నేతలు




సూర్యప్రతినిధి - రాయచోటి టౌన్

స్త్రీ శక్తి పథకం కింద మహిళా ఉద్యోగులకు కూడా ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ కూటమి ప్రభుత్వం విధివిధానాలను తీసుకురావడం పట్ల నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఎన్టిఏ నేతలతో కలిసి రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డినిమర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి సర్కార్ సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా స్త్రీ శక్తి పథకం అమలు చేయడమే కాకుండా ఉచిత బస్సు సౌకర్యం ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు కూడా వర్తించే విధంగా నియమ నిబంధనలు తయారుచేసి అమలు చేస్తున్నందుకు వారు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న యాప్ ల సమస్యలపైన,2025 సాధారణ బదిలీలలో భాగంగా బదిలీ ఉత్తర్వులు పొంది రిలీవర్ రాకపోవడంతో రిలీవ్ కానీ ఉపాధ్యాయుల స్థానాలలో డిఎస్సి ఉపాధ్యాయులను నియమించి వారికి న్యాయం చేసే విధంగా విద్యాశాఖ మంత్రి లోకేష్ తో చర్చించి న్యాయం చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి మండిపల్లి తప్పకుండా అలాంటి ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తానన్నారు. అదేవిధంగా గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న డిఏ బకాయిలలో కనీసం రెండు డీఏ లను ఇప్పించే విధంగా ప్రభుత్వంతో చర్చించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ నేతలు మడితాడి నరసింహారెడ్డి, బచ్చల శ్రీనివాసులు,కొండూరు మురళి మోహన్ రాజు,వంగిమళ్ళ వేణుగోపాలరావు,కదిరి హరినాథ్,చిన్న రెడ్డయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీ శక్తి పథకంతో మహిళలకు ఆర్థిక భరోసా,భద్రత!

## - రాజంపేట పార్లమెంటు జనసేన ఇన్ ఛార్జి యల్లటూరు.శ్రీనివాస రాజు



సూర్యప్రతినిధి - రాజంపేట అర్బన్

స్త్రీ శక్తి పథకంతో మహిళలకు ఆర్థిక భరోసా,భద్రత కలుగుతుందని రాజంపేట పార్లమెంటు జనసేన ఇన్ ఛార్జి యల్లటూరు.శ్రీనివాస రాజు పేర్కొన్నారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులున్నా కూటమి ప్రభువం హామీలను అమలు చేస్తోందని, తమ ప్రభుత్వం పై ప్రజలుపెట్టుకున్న విశ్వాసాన్ని నిలబెట్టుకుంతున్నామని పేర్కొన్నారు. అలాగే బస్సుల్లో సీసీ కెమెరాలు పెట్టి పూర్తిస్థాయి భద్రత కల్పిస్తామని, స్త్రీ శక్తి పథకం తో మహిళలు జీరో ఫేర్ టిక్కెట్ తో రాష్ట్రమంతటా ఉచితంగా ప్రయాణం చేయవచ్చని పేర్కొన్నారు.

# అవినాష్ విషయంలో సిబిఐ సంశయం - డీఐజీ ప్రవీణ్ దూకుడు

- ఢిల్లీ సిబిఐ కి వివేకా కేసు చిక్కుముడిని విప్పారు
- వాడు..... వీడు.... సంబోధన పై లీగల్ చర్యలు
- పులివెందుల జడ్పిటిసి ఎన్నికల పోలింగ్ సజావుగా నిర్వహించిన డిఐజి
- ఉమేష్ చంద్రను మించి ప్రశంసల వెల్లువ
- ఇక పూర్తిస్థాయిలో దూకుడు పెంచనున్న ప్రవీణ్



సూర్యబ్యూరో - అమరావతి

వివేకానంద రెడ్డి హత్య సంఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మరికొంతమందిని అరెస్టుకు సిబిఐ సర్వం సిద్ధం చేసుకుని హైదరాబాద్, కడప, కర్నూల్, పులివెందులలో మకాం వేసిన టచ్ చేయలేకపోయారు. కర్నూల్ లో అప్పటి ఎస్పీ మాత్రం రాష్ట్రం అల్లకల్లోలం అవుతుందని, సిబిఐ అరెస్టు చేసిన అనంతరం జరగబోయే పరిణామాలకు తాము బాద్యులు కాబోమని చేతులెత్తేశారు. అలాగే కడపలో సిబిఐ అధికారుల మకాంతో ప్రాణాలతో బయటపడాలంటే కడప వదలాలని హుకుం జారీ చేయడం, సిబిఐ అధికారులు మెల్లగా జారుకున్నారు. అయితే పులివెందుల జడ్పిటిసి ఎన్నికల సందర్భంగా ప్రజాస్వామ్య నిమిత్తం, ఫ్రీ అండ్ ఫెయిర్ పోలింగ్ నిర్వహణకు కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ తనకు సహాయకుడిగా ఒక గన్ మెన్ (పిఎస్ఓ) ను తీసుకొని నేరుగా పులివెందులకు వెళ్లి అవినాష్ ఎక్కడ ఉన్నాడో వాకబు చేసి పోలీసులను నివాస గృహం కు పంపారు అక్కడ కనిపించకపోవడంతో పార్టీ కార్యాలయంలో ఉన్నారని తెలుసుకొని నేరుగా కార్యాలయానికి చేరుకున్నారు. తొలుత కార్యాలయం మూతతో అతి కష్టం మీద డోర్ తెరిపించుకొని ప్రవీణ్ అవినాష్ పక్కనే కూర్చుని నింపాదిగా నీళ్లు తాగుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహణకు సహకరించాలని హౌస్ అరెస్టా, మా సిబ్బందితో వెళతారా అని హుకుం జారీ చేశారు. టిడిపి తరపున ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి ని హౌస్ అరెస్ట్ చేశామని, ప్రజాస్వామ్య దేశంలో తమకు అందరూ సమానమేనని డిఐజి హెచ్చరిస్తూ... సామాన్య కానిస్టేబుల్ సహాయంతో డిఐజి కస్టడీలోనికి తీసుకెళ్లి పులివెందులను దాటించేసి పోలింగ్ అనంతరం విడిచిపెట్టారు. దీంతో అవినాష్ అన్నయ్య జగన్మోహన్ రెడ్డితో సహా పలువురు వైసీపీ సీనియర్లు కోయా ప్రవీణ్ చర్యలతో అన్ని రాజకీయ పార్టీ నేతల్లో గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. పులివెందుల జడ్పిటిసి ఎన్నికల్లో 7638 ఓట్లు పోలింగ్ కాగా టిడిపి అభ్యర్థికి 6716 ఓట్లు రాగా వైసిపి అభ్యర్థి 683 ఓట్లు మాత్రమే వచ్చి చివరికి వైసిపి అభ్యర్థికి డిపాజిట్ గల్లంతయ్యింది. 30 ఏళ్ల తర్వాత స్వేచ్ఛగా ఎన్నికలు జరగగా ప్రశాంతంగా ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యం వచ్చిందని మేధావులంటున్నారు. ఇంత కాలానికి బ్యాలెట్ పేపర్ చూశామని డిఐజి కోయ ప్రవీణ్ పుణ్యమా అని ప్రజలు డీఐజీని ప్రశంసలతో ముంచెత్తుతూ గతంలో కడపలో ఎస్పీ చదలవాడ. ఉమేష్ చంద్ర గుర్తుకొస్తున్నారని, నాడు ఉమేష్ చంద్ర రాజారెడ్డి, రాజశేఖర్ రెడ్డిని వెంబడించి శాంతి భద్రతలను అదుపులోనికి తీసుకొని రావడం అసాంఘిక శక్తులను ఎంకౌంటర్ పేరుతో హెచ్చరికలు జారీ చేశారు. ఉమేష్ జిల్లాలో ఎక్కడికి వెళ్లినా 25 మంది పైబడి అంగరక్షకులతో వెళతారు. ఎన్కౌంటర్లతో ఉమేష్ చంద్ర బెదరగొట్టి శాంతి భద్రతలను అదుపులోనికి తీసుకొచ్చారు. ఇకపోతే డిఐజి కోయా ప్రవీణ్ ఉమేష్ చంద్రకు భిన్నంగా ఆచీ చూచి ఆలోచించి అడుగు వేస్తూ అధరరు, బెదరరు ఒంటరిగానే కేవలం ఒక అంగరక్షకునితో క్యాంపులు వెళతారు. ప్రవీణ్ పోలీసు అధికారులు సిబ్బంది ప్రజలతో మమేకమే క్షేత్రస్థాయి నుంచి అసాంఘిక కార్యకలాపాలకు, ఫ్యాక్షనిస్టులకు, గుండాలు, రౌడీలు, క్రికెట్ బుకీలు, పేకాటరాయుళ్ళకు చెక్ పెట్టారు. దారిలో రానివారికి పోలీసు దెబ్బ చూపించడమే తరువాయి ఫ్యాక్షనిస్టులను ఆధిపత్య పోరు గ్రామాలలో ఉన్నవారికి మర్యాదగా వాళ్ళలో ఉండండి లేదా ఊరి పొలిమేర్ల దాటి వెళ్ళాలి లేని పక్షంలో ఎన్కౌంటర్ తప్పదని హెచ్చరించారు. ఇక అధికార ప్రతిపక్ష నేతలు క్రింది స్థాయి పోలీసు పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చిన హుకుం జారీ చేస్తే డిఐజి ఎంతటి వారినైనా విడిచిపెట్టరు ఇక జగన్ వంతు వచ్చిందనే భావనతో ఇప్పటికే డిఐజి తో సిబిఐ అధికారులే టచ్ తో ఉన్నట్లు తెలిసింది. ఇక పులివెందుల జడ్పిటిసి ఎన్నికల నిర్వహణలో రోడ్డు మ్యాప్ బందోబస్తు తయారుచేసి ఎటువంటి అల్లర్లు చోటు చేసుకున్న కబడ్దార్ అని తన శాఖ అధికారులనే హెచ్చరించారు. ఇక రాజకీయ పార్టీ నేతలకు అల్లర్లకు పాల్పడి తలలు పగలగొట్టుకోవద్దని హెచ్చరిస్తూ వచ్చారు. 30 ఏళ్ల తర్వాత ఓటు హక్కు వినియోగించు కొన్నామని ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహణ జరిగిందని ప్రవీణ్ ధైర్యంగా ఒక్కరే అవినాష్ ను అదుపులో తీసుకుని టిడిపి నేతలను హెచ్చరించడంతో ఎన్నికల పోలింగ్ రీపోలింగ్ కౌంటింగ్ ఫలితాల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహణపై పులివెందుల ప్రజలు జిల్లా ప్రజలు యావత్తు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు శభాష్ డిఐజి హ్యాట్సాఫ్ అంటూ మెసేజ్లు యూట్యూబ్లో ప్రదర్శనలు నింగికి ఎగసి ప్రశ్నించెలు అందుతున్నాయి. అయితే వైసీపీ నేతలకు గెలవలేకపోయామని అక్కస్సుతో రాయలేని భాషలో వాడు వీడు అంటున్నారు ఆ వ్యాఖ్యలపై న్యాయస్థానాలకు ప్రజలే ఫిర్యాదులు చేస్తున్నారు.

# జగన్ కు టార్గెట్ పెనుకొండ సింగం కడప ఇన్ ఛార్జి మంత్రి సవితనే

- పులివెందుల జడ్పిటిసి టిడిపి గెలుపుతో జగన్ సవిత పై విసుర్లు
- ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో దేనికైనా తగ్గేదేలేదంటున్న మంత్రి
- సవిత కూడా రాజకీయ కుటుంబమే - సంపన్నులే
- ఏపీలోని ఎస్.కే విద్యాలయంలో పట్టా పొందిన ధైర్యాశాలే



సూర్య బ్యూరో - కడప

పెనుకొండ సింగం వైయస్సార్ కడప జిల్లా ఇన్ చార్జ్ మంత్రి, రాష్ట్ర మంత్రి, సంజీవరెడ్డిగారి సవితను వైసీపీ నేతలు, ప్రత్యేకించి మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి టార్గెట్ చేసి ఆరోపణలు చేస్తున్నారు. జగన్ సొంత ఇలాఖాలో తరచూ మంత్రి సవిత పర్యటించడం, ఈమధ్య పార్టీ అధిష్టానం కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యి ఏడాది పూర్తయ్యి ప్రభుత్వం సాధించిన ప్రగతిపై సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రజలకు వివరించాలని ఆదేశించింది. దీంతో మంత్రి సవిత పులివెందులపై ప్రత్యేక దృష్టి సారించారు. సవిత పెన్షన్లను, ఉచిత గ్యాస్, తల్లికి వందనం, కార్యక్రమాలపై విస్తృతంగా ప్రజల్లోనికి తీసుకెళ్లి అర్హులు ఎవరైనా ఉన్నట్లయితే వారిని సైతం దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించి, ప్రజలతో మమేకమయ్యారు. సవిత తండ్రి ఎస్.రామచంద్ర రెడ్డి 1983,1985 వరుసగా పెనుకొండ నుంచి గెలుపొంది ఎన్టీఆర్ పాలనలో రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 1996లో ఎంపీగా కూడా పనిచేశారు. సవిత ఏపీలోని ఎస్.కె. యూనివర్సిటీలో పట్టభద్రురాలు. ఆర్థికంగా, కుల సామాజిక వర్గంగా బలవంతులు. 2024 పెనుకొండ నుంచి మంత్రిగా ఎదిగి వైఎస్ఆర్ కడప జిల్లా ఇన్ ఛార్జి మంత్రిగా వైసీపీ నేతలను ఎదిరిస్తూ ముచ్చెమటలు పట్టిస్తున్నారు. తాజాగా పులివెందుల జడ్పిటిసి ఎన్నికలు రావడం, జగన్ సొంత మండలం కావడం, ఈ ఎన్నికలను జగన్‌తో పాటు సవిత ప్రతిష్టాత్మకంగా తీసుకొని పులివెందుల మండల వ్యాప్తంగా అభ్యర్థిని బిటెక్ రవి సతీమణి లతారెడ్డిని వెంటపెట్టుకొని ఇళ్ళు ఇళ్ళు తిరగడం వ్యూహాత్మకంగా పథకం వేసుకొని గెలిపించుకొని చివరికి వైసిపి అభ్యర్థికి డిపాజిట్ కూడా దక్కనివ్వలేదు. పులివెందుల అంటే ఫ్యాక్షన్ గడ్డ, జగన్ అడ్డా.. అని పేరు ఉండగా ఆమె కూడా ధైర్య సాహసాలు కలిగి ఢీ అంటే ఢీ అనడంతో వైసిపి నేతలను పరుగులు తీయించారు. పులివెందులలో వైసీపీ అభ్యర్థి ఓటమితో ఏ ఒక్కరు జీర్ణించుకోలేకపోతున్నారు. జగన్ కూడా ఢీలాపడి మంత్రి సవిత పై చట్టాలు, ప్రజాస్వామ్యంపై ప్రశ్నిస్తుంటే 30 ఏళ్ల తర్వాత అందరూ ఓటును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడమని జగన్ తాటాకు చప్పుళ్లకు ఎవరు భయపడే పరిస్థితులలో లేరని కౌంటర్ ఇచ్చారు. గతంలో జగన్ స్థానిక సంస్థలలో టిడిపి వారిని నామినేషన్లను వేయించకుండా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసి, ఇప్పుడు నీతులు, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడమా అని ప్రశ్నించారు. అలాగే ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరపడం వల్లనే పులివెందుల, ఒంటిమిట్టలో వైకాపా అభ్యర్థులు నామినేషన్లు వేసుకోగలిగారని గుర్తు చేశారు. మొత్తం మీద సవిత వైసిపి నేతల ఆరోపణలకు ఘాటుగా సమాధానం ఇస్తూ, కౌంటర్ ఇస్తూ వైసిపి నేతలకు వణుకు పుట్టిస్తున్నారు.

# ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు

## సముద్రపు నీరుతో ఉప్పు తయారుచేసి ఆ డబ్బుతో ఉద్యమాన్ని నడిపిన వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న - అదనపు ఎస్పీ వెంకటాద్రి



సూర్యస్టాఫ్ - రిపోర్టర్

జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం సర్దార్ గౌతు లచ్చన్న "జయంతి" సందర్భంగా.. ఆయన చిత్రపటానికి అదనపు ఎస్పీ యం. వెంకటాద్రి పూలమాల వేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్దార్ గౌతు లచ్చన్న ఆగష్టు 16, 1909 సం.లో బారువా గ్రామం, సోంపేట మండలం, శ్రీకాకుళం జిల్లాలో జన్మించారు, భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి లచ్చన్న అని కొనియాడారు. లచ్చన్న సాహసానికి, కార్యదక్షతకు మెచ్చి ప్రజలిచ్చిన కితాబే సర్దార్. సర్దార్ గౌతు లచ్చన్న, వి.వి.గిరి, నేతాజి సుభాష్ చంద్రబోస్, జయంతి ధర్మతేజ, మొదలగు అనేకమంది జాతీయ నాయకులతో కలిసి భారత దేశ స్వాతంత్ర్య పోరాటాలలో పాల్గొని, అనేక పర్యాయాలు జైలుకు వెళ్ళారు. తెలుగు వారి రాజకీయ జీవనములో స్వాతంత్ర్యానికి ముందు, తరువాత ప్రభావితము చేసిన నాయకుడు లచ్చన్న. ఆయన మెట్రిక్యులేషన్ చదువుతుండగానే 21వ ఏట గాంధీజీ పిలుపు విని విద్యకు స్వస్తి చెప్పి స్వాతంత్ర్యోద్యమంలో చేరాడు. 1930 లో మహాత్మాగాంధీ ఉప్పు సత్యాగ్రహానికి పిలుపునిచ్చారు. దీనికి ప్రభావితుడైన లచ్చన్న బారువా సమీపంలో ఉన్న సముద్రపు నీరుతో ఉప్పు తయారుచేసి ఆ డబ్బుతో ఉద్యమాన్ని నడిపారని గుర్తుచేశారు. 1932 వ సంవత్సరంలో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొంటున్న లచ్చన్నను బంధించి రాజమండ్రి జైల్లో ఐదు మాసాలు ఉంచారు. గాంధీజీ నడిపిన ఉద్యమాలలో భాగమే అంటరానితనం నిర్మూలన. ఆ ఉద్యమం లో బాగమైన లచ్చన్న అంటరానితనం మీద కత్తి ఝుళిపించారు. స్వాతంత్ర్యోద్యమంలో చివరి పోరాటం అయిన క్విట్ ఇండియా ఉద్యమం. 1942లో జరిగిన ఈ ఉద్యమంలో పాల్గొన్న లచ్చన్నగారిని ప్రభుత్వం అతి ప్రమాదకరమైన వ్యక్తిగా గుర్తించి, ఆయనను పట్టి ఇచ్చిన వారికి పదివేల రూపాయల బహుమతిని ప్రకటించింది. చివరకు ప్రభుత్వమే అతనిని బంధించి మూడేళ్ళు జైల్లో ఉంచి 1945 అక్టోబరులో విడుదల చేసింది. ఆనాటి నుంచి లచ్చన్న గారు ఆంధ్ర అగ్రనాయకులలో ఒకరైనారు. ఒక నాయకుడిగా, గౌతు లచ్చన్న ఎప్పుడూ పేద ప్రజల సంక్షేమం కోసమే కృషి చేశారు. రాజకీయాలలో పారదర్శకత, నిజాయితీ, ప్రజాసేవకు ఆయన ఒక మంచి ఉదాహరణ. ఆయన ఆశయాలను, సిద్ధాంతాలను మనం అందరం అనుసరించాలి. ఈ సందర్భంగా, ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకుని, మనం కూడా మన వంతుగా సమాజ సేవలో పాలుపంచుకో వాలని. అదనపు ఎస్పీ వెంకటాద్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్, వి.జె.రామ కృష్ణ, యస్ఐ లు, ఆర్ఎస్ లు, పోలీసు సిబ్బంది, హెూంగార్డులు పాల్గొని "సర్దార్ గౌతు లచ్చన్న" చిత్ర పటానికి పుష్పాలు సమర్పించి, ఘనంగా నివాళులు అర్పించారు.

# దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కు అవతరించిన అవతార పురుషుడు శ్రీ కృష్ణ భగవానుడు

## - శ్రీకృష్ణనికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి

సూర్యప్రతినిధి - రాయచోటి రూరల్

దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కు అవతరించిన అవతార పురుషుడు శ్రీ కృష్ణ భగవానుడని రాష్ట్ర రవాణా, క్రీడా, యువజనసర్వీసుల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం శ్రీ కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా వరిగ రోడ్ లో నూతనంగా వెలిసిన శ్రీ శ్రీ దేవకి యశోద కృష్ణ ఆలయం లో మంత్రి శ్రీకృష్ణనికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు.

సూర్య సినిమా స్పోర్ట్స్

# విరాట్, రోహిత్ రిటైర్మెంట్ వెనుక కుట్ర..

- మాజీ క్రికెటర్ సంచలన వ్యాఖ్యలు
- కోహ్లీ, రోహిత్‌ల టెస్ట్ రిటైర్మెంట్‌పై మాజీ క్రికెటర్ కర్సన్ ఘవ్రి సంచలన ఆరోపణలు
- వారిద్దరూ స్వయంగా తప్పుకోలేదని, బీసీసీఐ బలవంతంగా పంపించిందని వ్యాఖ్య
- బీసీసీఐలోని అంతర్గత రాజకీయాలే దీనికి కారణమని ఘవ్రి ఆరోపణ
- విరాట్ కోహ్లీకి కనీసం వీడ్కోలు మ్యాచ్ కూడా ఇవ్వలేదని విమర్శ
- సెలక్షన్ కమిటీ, బీసీసీఐ తీరు వల్లే వారు ముందస్తు రిటైర్మెంట్ ప్రకటించారన్న ఘవ్రి



సూర్య, స్పోర్ట్స్ డెస్క్: భారత క్రికెట్ దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు అనూహ్యంగా వీడ్కోలు పలకడం వెనుక బీసీసీఐ అంతర్గత రాజకీయాలు ఉన్నాయంటూ మాజీ క్రికెటర్ కర్సన్ ఘవ్రి సంచలన ఆరోపణలు చేశారు. వారు స్వచ్ఛందంగా రిటైర్మెంట్ ప్రకటించలేదని, వారిని బలవంతంగా తప్పుకునేలా చేశారని ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం భారత క్రికెట్ వర్గాల్లో పెను దుమారం రేపుతున్నాయి. 2025 మేలో ఇంగ్లండ్‌తో సిరీస్‌కు కొన్ని రోజుల ముందు కోహ్లీ, రోహిత్ టెస్టుల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ నిర్ణయం వారిది కాదని, బీసీసీఐ, సెలక్షన్ కమిటీలోని కొందరి ఒత్తిడి వల్లే ఇది జరిగిందని కర్సన్ ఘవ్రి ఒక ఇంటర్వ్యూలో ఆరోపించారు. "బీసీసీఐలోని అంతర్గత రాజకీయాలను అర్థం చేసుకోవడం చాలా కష్టం. ఈ కుటిల రాజకీయాల కారణంగానే వారు ముందస్తు రిటైర్మెంట్ ప్రకటించాల్సి వచ్చింది. నిజానికి వాళ్లు ఆడాలని అనుకున్నారు. కానీ సెలక్టర్లు, బీసీసీఐ ఆలోచనలు వేరుగా ఉన్నాయి" అని ఘవ్రి వ్యాఖ్యానించారు.విరాట్ కోహ్లీ లాంటి గొప్ప ఆటగాడికి కనీసం వీడ్కోలు మ్యాచ్ కూడా ఇవ్వకపోవడంపై ఘవ్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "కోహ్లీ సులభంగా మరో రెండేళ్లు ఆడగలడు. కానీ ఏదో తీవ్రమైన ఒత్తిడి అతడిని రిటైర్మెంట్ వైపు నెట్టింది. భారత క్రికెట్‌కు, అభిమానులకు ఎంతో సేవ చేసిన అటువంటి గొప్ప ఆటగాడికి ఘనమైన వీడ్కోలు ఇవ్వాల్సింది. కానీ బీసీసీఐ ఆ గౌరవాన్ని కూడా ఇవ్వలేదు" అని ఆయన విమర్శించారు. ఈ ఇద్దరు స్టార్ ఆటగాళ్లు త్వరలోనే వన్డేల నుంచి కూడా తప్పుకోవచ్చని, దాంతో 2027 ప్రపంచకప్ ఆడే అవకాశం కోల్పోతారని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఘవ్రి చేసిన ఈ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కాగా, వన్డే ఫార్మాట్‌లో విరాట్ 14,181 పరుగులు, రోహిత్ 11,168 పరుగులు చేసి భారత్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించారు.

# గృహ రుణ గ్రహీతలకు ఎస్‌బీఐ ఝలక్..

## వడ్డీ రేట్లు పెంపు

- ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించినా వడ్డీ రేట్లు పెంచిన ఎస్‌బీఐ
- కొత్తగా గృహ రుణం తీసుకునేవారిపై 25 బేసిస్ పాయింట్ల భారం
- 7.50 శాతం నుంచి 8.70 శాతం శ్రేణికి చేరిన కొత్త వడ్డీ రేట్లు
- తక్కువ క్రెడిట్ స్కోర్ ఉన్నవారిపై ప్రభావం అధికం
- ఎస్‌బీఐ బాటలోనే ఇతర ప్రభుత్వ బ్యాంకులు నడిచే అవకాశం




సూర్య, బిజినెస్ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును తగ్గించి ప్రజలకు ఊరట కల్పించాలని భావిస్తే, దేశంలోనే అతిపెద్ద రుణదాత అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మాత్రం గృహ రుణ గ్రహీతలకు షాక్ ఇచ్చింది. కొత్తగా రుణాలు తీసుకునేవారికి వర్తించే వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల (0.25%) వరకు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది.ఎస్‌బీఐ తాజా నిర్ణయంతో గృహ రుణాల వడ్డీ రేట్ల శ్రేణి 7.50% - 8.45% నుంచి 7.50% - 8.70%కి మారింది. వడ్డీ రేటు కనీస పరిమితిలో మార్పు లేనప్పటికీ, గరిష్ఠ పరిమితిని పెంచారు. ఈ మార్పు ప్రభావం ముఖ్యంగా తక్కువ క్రెడిట్ స్కోర్ ఉన్న కస్టమర్లపై అధికంగా పడనుంది. వారు ఇప్పుడు మరింత ఎక్కువ వడ్డీ చెల్లించాల్సి వస్తుంది.ప్రజలపై రుణ భారాన్ని తగ్గించే ఉద్దేశంతో ఆర్‌బీఐ వరుసగా మూడుసార్లు రెపో రేటును 5.5 శాతానికి తగ్గించింది. సాధారణంగా రెపో రేటు తగ్గితే ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేట్ (ఈబీఎల్ఆర్)తో అనుసంధానమైన రుణాలు చౌకగా మారాలి. దేశంలోని షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు ఇచ్చే రుణాలలో దాదాపు 60 శాతం ఈబీఎల్ఆర్ ఆధారితమైనవే. రెపో రేటు తగ్గింపుతో రుణాలు చౌకగా మారతాయని గతంలో ఎస్‌బీఐ రీసెర్చ్ విభాగమే ఒక నివేదికలో పేర్కొనడం గమనార్హం.ప్రస్తుతం యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వంటి ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులు 7.35% నుంచి 10.10% మధ్య వడ్డీ రేట్లను అందిస్తున్నాయి. ఇప్పుడు ఎస్‌బీఐ తీసుకున్న నిర్ణయంతో మిగిలిన బ్యాంకులు కూడా వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. వడ్డీ రేట్లు తగ్గించడం రుణ గ్రహీతలకు ప్రయోజనకరమే అయినా, బ్యాంకుల లాభాల మార్జిన్లపై ఒత్తిడి కొనసాగుతోందని ఎస్‌బీఐ వర్గాలు అంతర్గతంగా హెచ్చరించాయి. ఈ ఒత్తిడే తాజా పెంపునకు కారణంగా తెలుస్తోంది.

# జాన్వీ కపూర్.. ఓ పువ్వులాంటి అందం!



బాలీవుడ్ యంగ్ హీరోయిన్ జాన్వీ కపూర్ ఎప్పుడూ తన స్టైల్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. తాజాగా ఆమె షేర్ చేసిన కొత్త ఫోటోషూట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. పింక్ రెడ్ షేడ్స్ కలిగిన ఫ్లోరల్ డ్రెస్‌లో జన్వి సంప్రదాయాన్నీ, మోడ్రన్ టచ్‌ని కలిపి ఒక కొత్త గ్లామర్ వేవ్‌ని చూపించింది. చేతిలో ఒక తెల్లని పువ్వుని పట్టుకుని చిరునవ్వులు చిందించడం, జతగా వెండి గాజులు, జుమ్కాలు జోడించడం వల్ల ఈ లుక్‌కి సింపుల్‌గా ఒక ప్రత్యేకమైన అందం వచ్చింది. ఈ ఫోటోలు పోస్ట్ చేసిన వెంటనే అభిమానుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. "గార్డెన్‌లో పూల కంటే నువ్వే అందంగా ఉన్నావు," "కలర్స్ కంటే నీ చిరునవ్వు బ్రైట్‌గా ఉంది," అంటూ కామెంట్లు కురిపించారు. కేవలం కొన్ని గంటల్లోనే లక్షల లైక్స్ సాధించడంతో జాన్వి క్రేజ్ ఎలా ఉందో మరోసారి రుజువైంది. ఈ ఫోటోషూట్ ఆమె ఫ్యాషన్ గేమ్‌లోని ప్రయోగాత్మక ట్రెండ్ ను మళ్లీ హైలైట్ చేస్తోంది. కెరీర్ విషయానికి వస్తే, జాన్వీ 2018లో 'ధడక్' సినిమా ద్వారా బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 'గుంజన్ సక్సేనా: ది కార్గిల్ గర్ల్' వంటి చిత్రాలతో తన నటనను నిరూపించుకుంది. ఇటీవల దక్షిణాదికి కూడా అడుగుపెట్టి దేవరలో ఎన్టీఆర్ కు జోడిగా నటించింది. ఇక రామ్ చరణ్ సరసన తన రెండో తెలుగు సినిమా 'పెద్ది' చేస్తోంది. అలాగే సిద్ధార్థ్ మల్హోత్రా జోడీగా 'పరం సుందరి'లో నటిస్తోంది. ఈ ప్రాజెక్టులు ఆమెకు పాన్ ఇండియా స్థాయిలో మంచి అవకాశాలను తెస్తున్నాయి. సినిమాలతో పాటు జాన్వీ ఫ్యాషన్‌లోనూ తనకంటూ ఓ ప్రత్యేకమైన స్థానం సంపాదించుకుంది. ఎప్పుడూ కొత్త స్టైల్‌ను ప్రయత్నించడానికి వెనుకాడని ఆమె, సాంప్రదాయ దుస్తుల్లోనూ, మోడ్రన్ అవుట్‌ఫిట్స్‌లోనూ సమానంగా మెరిసిపోతుంది. ఈ ఫ్లోరల్ డ్రెస్సింగ్ లుక్ ద్వారా ఆమె మరోసారి ఫ్యాన్స్ హృదయాలను గెలుచుకుంది. ఇక జాన్వీ కెరీర్ ఇప్పుడు ఒక క్రిటికల్ ఫేజ్‌లో ఉంది. మంచి కథలతో పాటు తన గ్లామరస్ ఇమేజ్‌ను కూడా బ్యాలెన్స్ చేస్తూ, స్టార్ హీరోయిన్ల లీగ్‌లోకి వెళ్లాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# "ఓజీ" అమ్మాయి.. సో కూల్!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న "ఓజీ" సినిమా చుట్టూ రోజురోజుకు క్రేజ్ మరింత పెరుగుతోంది. సుజీత్ దర్శకత్వంలో, డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమా ఇప్పటికే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ సినిమా పవన్ కెరీర్‌లోనే ఒక రికార్డ్ గా నిలుస్తుందన్న అంచనాలు ఉన్నాయి. పవన్ కళ్యాణ్ గ్యాంగ్‌స్టర్ లుక్‌లో కనిపిస్తుండటమే కాకుండా, ఈ సినిమాలో స్టార్ క్యాస్టింగ్ కూడా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇమ్రాన్ హష్మీ విలన్‌గా, అర్జున్ దాస్, ప్రకాష్ రాజ్, శ్రియా రెడ్డి కీలకపాత్రల్లో కనిపించనున్నారు. ఇక సంగీతం తమన్ అందిస్తుండటంతో ఇప్పటికే విడుదలైన "ఫైర్ స్టార్మ్" పాట సోషల్ మీడియాలో వైరల్ అయింది.లేటెస్ట్ గా విడుదలైన "ఓజీ" పోస్టర్స్ ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. హీరోయిన్ ప్రియాంక అరుల్ మోహన్ ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం రిలీజ్ చేసింది. ఈ సినిమాలో ఆమె 'కన్మణి' పాత్రలో కనిపించనుంది. పోస్టర్స్‌లో ఒకవైపు ఆమె సాంప్రదాయ లుక్‌లో గృహిణి లా మెస్మరైజ్ చేస్తుంటే, మరో పోస్టర్‌లో ప్రశాంతతతో కూడిన క్లాస్ వైబ్ ఇచ్చింది. ఈ లుక్ చూసిన నెటిజన్లు సో కూల్, పర్ఫెక్ట్ మ్యాచ్ ఫర్ పవన్ అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఈ ఫస్ట్ లుక్‌తో పాటు ప్రియాంక పాత్రకు సంబంధించిన క్యారెక్టర్ హింట్ కూడా ఇచ్చినట్టే. గ్యాంగ్‌స్టర్ డ్రామాలో ఇంత కూల్ లేయర్ ఇవ్వడం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. పవన్ కళ్యాణ్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు ప్రియాంక అరుల్ మోహన్ క్యూట్ గా నిలుస్తుందనే అంచనాలు ఉన్నాయి. తాజాగా వచ్చిన ఈ పోస్టర్లతో పాటు, సినిమా ప్రమోషన్స్ మరింత వేగం పుంజుకున్నాయి. ఓజీ రెండో పాట త్వరలోనే విడుదల కానుందని, ప్రోమో సిద్ధంగా ఉందని సమాచారం. ఫస్ట్ సాంగ్‌కు లభించిన స్పందన దృష్ట్యా, రెండో పాట కోసం కూడా ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. ఇక టెక్నికల్ వైపు చూసుకుంటే సినిమాటోగ్రాఫర్లు రవికే చంద్రన్, మనోజ్ పరమహంస వర్క్ ఇప్పటికే ప్రశంసలు అందుకుంటోంది. ఎడిటర్ నవీన్ నూలి కట్ చేస్తున్న ఈ సినిమా గ్యాంగ్‌స్టర్ యాక్షన్‌తో పాటు ఎమోషన్స్ మిక్స్ అవుతుందని ట్రేడ్ అంచనా. సెప్టెంబర్ 25న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్ కానున్న ఈ సినిమా టాలీవుడ్ మాత్రమే కాదు, ఇండియన్ సినీ ఇండస్ట్రీలో అతిపెద్ద ఈవెంట్‌గా




# పాక్ క్రికెటర్లకు పీసీబీ షాక్..

- జీతాల్లో భారీ కోతకు రంగం సిద్ధం
- పేలవ ప్రదర్శనతో పాక్ ఆటగాళ్లపై పీసీబీ ఆగ్రహం
- క్రికెటర్ల సెంట్రల్ కాంట్రాక్టుల్లో మార్పులకు యోచన
- ఐసీసీ ఆదాయంలో 3 శాతం వాటాను తొలగించే అవకాశం
- ఇటీవల వెస్టిండీస్ చేతిలో చరిత్రాత్మక ఓటమి ఎఫెక్ట్
- అన్ని ఫార్మాట్లలోనూ నిరాశపరుస్తున్న పాకిస్థాన్ జట్టు



సూర్య, స్పోర్ట్స్ డెస్క్ : అంతర్జాతీయ క్రికెట్‌లో పేలవ ప్రదర్శనతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలేలా ఉంది. వరుస ఓటములతో నిరాశపరుస్తున్న బాబర్ అజామ్, మహమ్మద్ రిజ్వాన్ వంటి కీలక ఆటగాళ్ల జీతాల్లో కోత విధించేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఇటీవలే వెస్టిండీస్ చేతిలో వన్డే సిరీస్‌ను ఘోరంగా కోల్పోవడం ఈ అంశానికి మరింత బలాన్నిచ్చింది. ఈ ఏడాది పాకిస్థాన్ ప్రదర్శన అన్ని ఫార్మాట్లలోనూ అత్యంత దారుణంగా ఉంది. ఆడిన 11 వన్డే మ్యాచ్‌లలో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచి, మిగతా వాటిలో ఘోరంగా విఫలమైంది. ఇక టీ20ల విషయానికొస్తే, 14 మ్యాచ్‌లకు గానూ ఏడింటిలో గెలిచి, మరో ఏడింటిలో ఓటమి పాలైంది. టెస్టుల్లోనూ ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఒకే ఒక్క విజయాన్ని నమోదు చేసింది. ఈ గణాంకాలు జట్టు ఆటతీరుకు అద్దం పడుతున్నాయి.ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్ ఓటమి పాకిస్థాన్ క్రికెట్ చరిత్రలోనే ఒక చేదు జ్ఞాపకంగా మిగిలిపోయింది. 1991 తర్వాత విండీస్ చేతిలో పాక్ ద్వైపాక్షిక వన్డే సిరీస్ కోల్పోవడం ఇదే ప్రథమం. చివరి వన్డేలో ఏకంగా 202 పరుగుల భారీ తేడాతో ఓడిపోవడం జట్టును తీవ్రంగా దెబ్బతీసింది. ఈ నేపథ్యంలో ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్టుల నుంచి ఒక కీలక నిబంధనను తొలగించాలని పీసీబీ భావిస్తున్నట్టు 'క్రికెట్ పాకిస్థాన్' నివేదిక వెల్లడించింది. రెండేళ్ల క్రితం సీనియర్ ఆటగాళ్ల ఒత్తిడి మేరకు, అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) నుంచి వచ్చే ఆదాయంలో 3 శాతం వాటాను ఆటగాళ్లకు ఇచ్చేలా పీసీబీ అంగీకరించింది. ప్రస్తుతం ఈ నిబంధనను కాంట్రాక్టుల నుంచి తొలగించాలని బోర్డు నిర్ణయించినట్టు సమాచారం. కొన్ని చట్టపరమైన చిక్కుల వల్ల ఈ ఏర్పాటును వెంటనే రద్దు చేయలేకపోయినా, రాబోయే కొత్త కాంట్రాక్టులలో ఈ నిబంధనను చివరిసారిగా చేర్చి, ఆ తర్వాత పూర్తిగా ఎత్తివేయాలని పీసీబీ యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

# అమ్మాయిలూ..పోటీ పెంచండి.. సత్తా చూపండి



## ఉమెన్ గ్రాండ్ మాస్టర్ తానియా



సూర్య, స్పోర్ట్స్ డెస్క్: మహిళల చెస్‌లో భారత క్రీడాకారిణులు ముందంజ వేయాలంటే ఎక్కువ సంఖ్యలో ఓపెన్ టోర్నీల్లో పాల్గొనాలని సీనియర్ ప్లేయర్, ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ (డబ్ల్యూజీఎం) తానియా సచ్‌దేవ్ (38) కోరారు. మహిళల టోర్నీలకు పూర్తిగా దూరం కావద్దని అయితే పురుషులతో ఓపెన్ కేటగిరీలో పోటీపడితే ఆట ఎంతో మెరుగవుతుందని సూచించారు. గత ఏడాది చెస్ ఒలింపియాడ్ నెగ్గిన భారత జట్టులో సభ్యురాలైన తానియా ప్రస్తుతం చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ టోర్నీలో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.

**పురుషులతో పోటీ పడాలి : తానియా**

" చెస్ కెరీర్‌లో ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న అమ్మాయిలు సాధ్యమైనన్ని ఎక్కువ ఓపెన్ టోర్నమెంట్‌లలో ఆడాలి. కేవలం మహిళల టోర్నీలకే పరిమితం కాకుండా పురుషులతో కలిసి శిక్షణ పొందడంతోపాటు వారితో పోటీపడాలి. అప్పుడే వారి ఆట మరింత పదునెక్కుతుంది " అని తానియా పేర్కొన్నారు. అయితే పెద్ద స్థాయికి చేరే ముందు మహిళా టోర్నీల్లో విజయాలు సాధించడం కూడా ముఖ్యమని, అవి కెరీర్‌లో ముందుకు వెళ్లేందుకు కావాల్సిన ప్రేరణను అందిస్తాయని తానియా చెప్పారు. 'మహిళల విభాగంలో సాధించే విజయాలను కూడా తక్కువ చేయాల్సిన అవసరం లేదు అని అన్నారు.

**పూర్తిస్థాయిలో సామర్థ్యాన్ని ప్రదర్శించే అవకాశాన్ని కోల్పోవద్దు : తానియా**

ఇవన్నీ కొత్త తరం అమ్మాయిలు చెస్‌ను ఎంచుకునేందుకు కావాల్సిన స్ఫూర్తిని ఇస్తాయని తానియా అన్నారు. ఓపెన్ టోర్నీల్లో పాల్గొనడం, మహిళల టోర్నీల్లో టైటిల్స్ గెలవడం రెండూ కూడా ముఖ్యమేనని ఏదీ తక్కువ కాదు అని చెప్పారు. సరిగ్గా చెప్పాలంటే కెరీర్‌లో ఎదిగే సమయంలో ఇది మధ్యేమార్గంలాంటిది అని, అయితే కేవలం మహిళల టోర్నీల్లోనే పాల్గొంటే వారు తమ స్థాయిని తగ్గించుకున్నట్లే అవుతుందన్నారు. పూర్తి స్థాయిలో తమ సామర్థ్యాన్ని ప్రదర్శించే అవకాశాన్ని వారు కోల్పోతారు అని వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో మన దేశ మహిళా చెస్ క్రీడాకారిణుల తాజా ప్రదర్శన పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

**చెస్‌లో స్వర్ణయుగం నడుస్తోంది : తానియా**

'ఫిడే' వరల్డ్ కప్ ఫైనల్లో తలపడిన కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్‌లపై తానియా ప్రశంసలు కురిపించారు. 'మన దేశానికి సంబంధించి ఇప్పుడు చెస్‌లో స్వర్ణ యుగం నడుస్తున్నట్లుగా ఉంది. ఇలాంటి సమయంలో మేమేం తక్కువ కాదన్నట్లుగా మహిళలు నిరూపించుకుంటున్నారు. ఒక మెగా టోర్నీ ఫైనల్లో రెండు వేర్వేరు తరాలకు చెందిన భారత ప్లేయర్లు పోటీ పడటం మామూలు విషయం కాదు." అని పేర్కొన్నారు.

**నాలో ఇంకా సత్తా ఉంది : తానియా**

చెస్‌ను చూసి ఈ ఆటను ఎంచుకోవాలనుకునే అమ్మాయిలకు ఇది కావాల్సినంత స్ఫూర్తిని అందిస్తుంది అని తానియా అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కెరీర్ చివరి దశలో ఉన్నా తనలో ఇంకా సత్తా ఉందన్న తానియా% ఏడాదికి ఒకటి లేదా రెండు చొప్పున టోర్నీలు ఆడుతూ చెస్ వ్యాఖ్యానంపైనే ఎక్కువగా దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించారు.


# ప్రొటీన్ ఎక్కువగా తీసుకుంటున్నారా..



## ఈ సైడ్ ఎఫెక్ట్స్ తప్పవు

సూర్య, హెల్త్ డెస్క్:

అతి అన్నింటా అనర్థదాయకమే. కొందరు జిమ్ము, డైట్ల పేరుతో ఎక్కువ మోతాదులో ప్రొటీన్ కలిగిన ఆహారాన్ని తింటున్నారు. ఇటువంటి అలవాటు వల్ల సైడ్ ఎఫెక్ట్స్ బారిన పడటం ఖాయమంటున్నారు వైద్య నిపుణులు. మనిషి ఆరోగ్యానికి ప్రొటీన్ ఎంతో మేలు చేస్తుంది. కానీ, మోతాదు మించితే రక్తంలో కలిసే ప్రొటీన్ విషంగా మారుతుంది. అందుకే మనిషి బరువును బట్టి అవసరమైన ప్రొటీన్ ను లెక్కగట్టి తీసుకోవాలంటున్నారు నిపుణులు. కిలో శరీరబరువుకు 0.8 గ్రాముల ప్రొటీన్ మాత్రమే అవసరం. కాబట్టి మీ బరువును బట్టి మీకెంత ప్రొటీన్ అవసరమో లెక్క వేసుకోవచ్చు. బరువు తగ్గేందుకు, కండరాల నిర్మాణానికి, కణాల రిపేర్ చేయడానికి ప్రొటీన్ చాలా అవసరం. అయితే ప్రొటీన్ అధికంగా ఆహారాన్ని అపరిమితంగా తింటే మాత్రం ఆరోగ్య సమస్యలు వస్తాయి.



**దాహం పెరుగుతుంది**

శరీరంలో ప్రొటీన్ ఎక్కువైతే శరీరం నీరసించి పోతుంది. తీవ్రమైన దాహం కలుగుతుంది. ఎందుకంటే.. అధిక ప్రొటీన్ వల్ల శరీరానికి ఎక్కువ నీరు కావాల్సి వస్తుంది. దాని వల్ల విపరీతమైన దాహం వేస్తుంది. దీనికి కారణం ప్రొటీన్లో ఉండే నత్రజని. ఇది అధికంగా రక్తంలో చేరడం వల్ల ఇలాంటి మార్పులు కలుగుతాయి. దీని వల్ల మూత్రపిండాలపై అధిక భారం పడుతుంది. వ్యర్థాలను బయటకు పంపేందుకు అధికంగా కష్టపడాల్సి వస్తుంది. ఎంత నీరు తాగిన శరీరానికి సరిపోదు. దీనివల్ల శరీరం బలహీనంగా మారిపోతుంది. తలనొప్పి ఎక్కువైపోతుంది. బరువు తగ్గి సన్నగా మారిపోతారు.

**నోటి దుర్వాసన దీని లక్షణమే..**

చాలా మంది నోటి దుర్వాసనతో బాధపడుతుంటారు. ఇందుకు ఆహారంలో అధిక ప్రొటీన్ కూడా కారణమేనంటున్నారు. ప్రొటీన్లో ఉండే రెండు ఆమ్లాల తీవ్రమైన దుర్గంధాన్ని కలిగిస్తాయి. ఇందుకోసం కూడా అధికంగా నీళ్లు తాగాల్సి వస్తుంది.

**మలబద్ధకం...**ప్రొటీన్ శరీరంలో అధికమైతే మలబద్ధకం సమస్య కూడా ఎక్కువవుతుంది. కార్బోహైడ్రేట్లు తగ్గి, ప్రొటీన్ పెరిగితే మాత్రం ఈ సమస్య మరీ తీవ్రంగా మారుతుంది. ప్రొటీన్ ఉండే ఆహారం అధికంగా తిన్నామనిపిస్తే, కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారాన్ని అధికంగా తినాలి.

**ప్రొటీన్ అధికంగా ఉండే పదార్థాలు...**



కొన్ని ఆహారాల్లో ప్రొటీన్ అధికంగా దొరుకుతుంది. మటన్, చికెన్, గుడ్లు , చేపలు, రొయ్యలు, పాలు, పెరుగు, చీజ్, నట్స్ (బాదం, జీడిపప్పు,వాల్నట్స్, గుమ్మడి గింజలు, నువ్వులు, సన్ ఫ్లవర్ గింజలు, టోఫు, అన్ని రకాల బీన్స్, శెనగలు... వీటన్నింటిలో ప్రొటీన్ ఉంటుంది.

**టి నొప్పులు..**

ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలు శరీరంలో వేడిని కలిగిస్తాయి. ఉదాహరణకు చికెన్, గుడ్లు, రొయ్యలు వంటివి. వీటిని మోతాదుకు మించి తీస్కుంటే ఒంటి నొప్పులు వేధిస్తాయి.

Printed and Published owned by Meegada Veerasatya Printed at Surya Publications D.No-60-3-28,Vaishnavi Elite, Road No.5 Bus route, Sunnapu Battila centre, Moghalarajapuram, Vijayawada-520010, AndhraPradesh. and Published from D.No-60-3-28, Road No.5 Bus route, Sunnapu Battila centre, Moghalarajapuram, Vijayawada-520010, RNI Regd No. APTEL/2008/22796, Editor:Meegada Veerasatya, Executive Editor : Kanneganti Sajjanarao, Email Id:Suryatelugudaily7@gmail.com,Ph:9948036048,Vijayawada.